పుడమి పుటల్లో నిక్షిప్తమైన ఘంటసాల చరిత్ర

"శిలలు ద్రవించి యేడ్చినవి జీర్ణములై నవి తుంగభద్ర లోపల....". హంపి నగరంలోని చారిత్రక శిథిలాలను సందర్శించినప్పుడు శ్రీ కొడాలి సుబ్బారావుగారి కవితాత్మ క్షోభించి పలికిన పలుకులివి. అలాగే కృష్ణాతీరాన వెలిసిన ప్రాచీననగరమైన ఘంటసాలలో లభించిన బౌద్ధ శిల్పావశేషాలు భద్రపరచే దిక్కు లేక వానలకు తడిసి ఎండకు ఎండి శిథిలమైపోతుంటే 'ఘంటసాల చరిత్ర' వ్రాసినకీర్తిశేషులు గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారి మనసు కూడా అలాగే క్షోభించి వుండడంలో సందేహంలేదు. పురావస్తుశాఖవారి ఆదరణ లేక దిక్కూ మొక్కూ లేక పడివున్న శిల్పకళాఖండాలను స్థానిక గ్రంథాలయ ఆవరణలో భద్రపరచే వరకు ఆయనకు నిద్రపట్టలేదు. ఎట్టకేలకు 1845 జనవరి 1వ తేదీన పురావస్తు శాఖాధికారి డాక్టర్ బాబ్రా ఈ 'ఓపెన్ మ్యూజియమ్'కు ప్రారంభోత్సవం చేశారు.

అప్పటి నుండే గ్రామస్థులెన్నోసార్లు చిన్న మ్యూజియమ్‌ను కట్టించవలసిందిగా పురావస్తుశాఖవారికీ, ప్రభుత్వానికి విన్నవించుకన్నారు. గ్రామంలో మరి కొన్ని త్రవ్వకాలు సాగించి పుడమితల్లి పుట్టల్లో దాగివున్న ఘంటసాల చరిత్రను వెలుగులోకి తేవలసిందిగా కోరారు. చిట్ట చివరికీనాటికి పురావస్తు శాఖవారికి గ్రామస్థులమొర చెవిని దూరింది త్రవ్వకాలు ప్రారంభించారు. ఘంటసాల ప్రాచీన చరిత్ర వెలుగు చూడబోతున్నది.

1816 ప్రాంతంలో సర్వేయర్ జనరల్‌గా పనిచేసిన కల్నల్ కాలిన్ మెకంజీ మనదేశంలోని గ్రామాల చరిత్రలు వ్రాయించాడు. ఆనాటి గ్రామ పెద్దల నుండి తీసుకున్న కైఫీయతులే మెకంజీ వ్రాయించిన చరిత్రలకు మూలాధారం. ఈ చరిత్ర ప్రతులు శిథిలమవుతుండగా వాటిని తిరగవ్రాయించి ప్రాచ్యలిఖిత భాండాగారంలో భద్రపరచుట ద్వారా సి. పి. బ్రౌన్ ఆంధ్రదేశ చరిత్రకు, ఆంధ్రసాహిత్యానికి అపారమైన సేవచేశాడు. వారు భద్రపరచిన ప్రాచీన వ్రాతలు మన చరిత్ర రచన కేవిధంగా తోడ్పడ్డాయో, ఘంటసాలలో లభించిన పాలరాతి చెక్కడాలను, శిల్పావశేషాలను మొదటినుండీ భద్రపరచి వుంటే ఘంటసాల ఘనకీర్తిని తెలిపే విలువైన చారిత్రక సంపద మనకు ఎంతో మిగిలి వుండేది. ఆనాడీ ప్రభుత్వము ఏ మాత్రం

శ్రద్ధ తీసుకున్నప్పటికీ చారిత్రికమైన శిల్పసంపద పరాయిదేశాలకు పోయి వుండేవి కాదు. బౌద్ధ శిల్పాలు బట్టలుతికే బండలుగా మారి శిధిలమై వుండేవికావు. బుద్ధుని శిలువెత్తు శిలావిగ్రహం ఎనిమిదివేల రూపాయలకు దళారీల వద్దకు చేరి మాయమయ్యేదికాదు.

1920లో ఘంటసాలలోని కోట దిబ్బలో ఒక రైతు దున్నుతుంటే 60 శిల్పాలు బయట పడ్డాయట. అందులో ప్రతి ఒక్కటి 'శాక్యముని జీవితాన్నో, జాతక కథలనో' చిత్రించిన శిలాఫలకమేనట. దొరికిన శిలాఫలకాలన్నిటినీ గ్రామస్థులొక చెట్టుక్రిందకు చేర్చి గుట్టవేసి వుంచారట. కొన్నాళ్ళకు పాండిచ్చేరి నుండి యం. జి. జోవియస్ డూబ్రియల్ ఏజెంటు వచ్చి 5 వేల రూపాయలకు 'రాళ్ళ మొత్తం' కొని తీసుకుపోయాడట. అక్కడ నుండి అవి పారిస్‌లోని గుయ్‌మెట్ మ్యూజియం చేరుకున్నాయి. ఒకసారి డూబ్రియల్ స్వయంగా వచ్చి కొన్ని బౌద్ధ విగ్రహాలు కొనుక్కుపోయారట. ఆ విధంగా ఘంటసాల బౌద్ధ శిల్పసంపద శాశ్వతంగా చేయిజారిపోయింది. ఘంటసాల శిల్పాలలోకల్లా ముఖ్యమైన శిల్పం బోస్టన్‌లో వున్నట్టు బ్రిటిష్ మ్యూజియం అసిస్టెంట్ కీపర్‌గా పనిచేసిన డగ్లస్ బారెట్ తెలిపాడు.

1871 ప్రాంతంలో కృష్ణాజిల్లా కలెక్టర్‌గా పనిచేసిన బాస్వెల్ ఘంటసాలను సందర్శించి అక్కడ వెలికి తీయవలసిన విలువైన బౌద్ధ శిల్పసంపద ఉన్నదని ప్రభుత్వానికి తెలిపాడు కాని ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆ తర్వాత 1906 లో పురావస్తు శాఖ సూపరింటెండెంట్ అలెగ్జాండర్ రే ఘంటసాలలో నెల రోజులపాటు మకాంపెట్టి 'లంజదిబ్బ' అని పిలువబడుతున్న దిబ్బను త్రవ్వించారు. అక్కడ 112 అడుగుల పొడవు, 23 అడుగుల ఎత్తుగల బౌద్ధ స్తూపం బయటపడింది. ఇది ఆంధ్రప్రదేశ్‌లో బయటపడ్డ స్తూపాలలోకెల్లా ఇదే పెద్ద స్తూపం అని అంటున్నారు. 'స్తూపము' అనేది సంస్కృతశబ్దం దీనిఅర్థం 'దిబ్బ'. కాని బౌద్ధమతాచారం ప్రకారం విహారముల వద్ద రాతితోగాని, ఇటుకలతోగాని గుండ్రంగా ఎత్తుగా చేసే నిర్మాణానికే స్తూపమని అర్థం. బుద్ధుడు ఏ విధమైన విగ్రహారాధన పనికిరాదని చెప్పినా ఆయన తర్వాత ఆయన శిష్య ప్రశిష్యులు బుద్ధుని ధాతువును అందులోపెట్టి స్తూపాలను నిర్మించి పూజించ సాగారు. ఆ రోజుల్లో వృత్తి పనివారిలోనూ, వ్యాపారస్తులలోను ఎక్కువమంది బౌద్ధమతాన్ని స్వీకరించారు. వారే ఎక్కువగా స్తూపాలను, విహారాల నిర్మాణానికి విరాళాలు ఎక్కువగా యిచ్చేవారు. బౌద్ధ భిక్షువులు ప్రతి ఉదయం

నగరంలోకి వెళ్ళి భిక్ష అడిగి తెచ్చుకోవాలి గనుక బౌద్ధ విహారాలను, స్తూపాలను నగరాలకు సమీపంలో నిర్మించేవారు. సాంచీ విహారాన్ని, ఘంటసాల విహారాన్ని అలాగే నిర్మించారు. ఘంటసాల ఆనాడు రెండు మైళ్ళ విస్తీర్ణం మేరకు విస్తరించి వుండేదట ఇక్కడ నుండి విదేశాలతో నౌకా వ్యాపారం జోరుగా జరుగుతుండేది. ఆ రోజులలో కృష్ణానది కూడా ఘంటసాలకు సమీపంగా ప్రవహించుతుండేదట. తర్వాత కృష్ణానది ప్రవాహ మార్గం మారి ఘంటసాలకు దూరమైంది.

కృష్ణానదీ తీరం ప్రాచీన నాగరికతకు నిలయం . నాగరికత తొలి దశలో నదీ తీరాలే నాగరికతకు, సిరిసంపదలకు నిలయాలు శాతవాహనుల రాజధాని ధరణికోట ఇక్ష్వాకుల రాజధాని విజయపురి. కృష్ణా తీరాన వెలసిన రాజధానీ నగరాలు.అలాగే కృష్ణానదికిరువైపులా బౌద్ధమత క్షేత్రాలు వెలిశాయి.ఘంటసాల, అమరావతి అట్లా వెలసినప్రసిద్ధ క్షేత్రాలే.శాతవాహనుల సామ్రాజ్యం ఏర్పడకముందే, క్రీస్తుకు పూర్వం 400 సంవత్సరాల క్రితమే కృష్ణానదీ తీరప్రాంతం బౌద్ధ మత సుక్షేత్రదిగా విలసిల్లింది అమరావతి. నాగార్జునకొండ, జగ్గయ్యపేట ఘంటసాల మొగల్రాజపురం (విజయవాడ) గుడివాడ. ఉండవల్లి మొదలైనవన్నీ ఆనాటి బౌద్ధ క్షేత్రాలు.

ఘంటసాలకొక ప్రత్యేకత ఉన్నది బౌద్ధ క్షేత్రాలన్నీ ఓదరేవులున్న పట్టణములు కాదు కాని ఘంటసాల సుప్రసిద్ధమైన బౌద్ధ క్షేత్రమేగాక నౌకా వాణిజ్య కేంద్రము కూడా ఇక్కడ దొరికిన స్తూపాలతోపాటు కొన్ని రోమన్ నాణెములు, శిలాశాసనాలు బయట పడ్డాయి వాణిజ్య కేంద్రమగుట వల్లనే ఇక్కడ రోమన్ నాణెములు అధికంగా లభించాయి. కీర్తిశేషులు వెంకట సుబ్బయ్యగారు లప్పు డప్పుడు దొరికిన నాణెము ఫోటోలు తీయించి "ఘంటసాల చరిత" లో ముద్రించారు. అంటోనియస్, అడ్రియన్ అనే రోమన్ చక్రవర్తుల కాలంనాటి నాణెములు లభిం చాయి ఘంటసాల, దానికి సమీపంలోని గుడూరు రేవుల వంటి యూరప్‌లోని రోమ్ తదితర రేవు పట్టణాలతోనూ, సయాం, కాంబోడియా సుమిత్ర, బోర్నియో వంటి తూర్పు ఆసియా దేశాలతో వ్యాపారం బాగా జరిగినట్లు ఆధారాలు కనపడు తున్నాయి. రోమ్ నగరానికి మన ఆంధ్రదేశంనుండి, దక్షిణాదినుండి విశేషంగా వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు ఎగుమతి అయినట్లు తెలుస్తున్నది. భారతదేశపు

వస్త్రాలను కొని కోట్లాది బంగారాన్ని కోల్పోవలసివస్తున్నదని (క్రీ. శ. 70) "ఎల్డర్ ప్లినీ" అనే చరిత్రకారుడు విచారాన్ని వెలిబుచ్చాడు. సంవత్సరానికి రోమ్‌కు 10 కోట్ల సెస్టర్లు నష్టంవస్తున్నట్లు పేర్కొన్నాడు ఘంటసాలలో రెండవ శతాబ్దపు నాణెములు దొరకడం వల్ల రెండవ శతాబ్దం వరకు రోమ్‌తో వ్యాపారం విశేషంగా జరిగినట్లు స్పష్టమవుతున్నది. క్రీ పూ 7వ. శతాబ్దం నాటికే ఆంధ్ర దేశం విదేశాలతో వాణిజ్యం చేసినట్లు తెలుస్తున్నది రెండవ దశాబ్దానికి చెందిన ఈజిప్షియన్ ఖగోళ శాస్త్రజ్ఞుడు టోలమీ తన రచనల్లో "కంటకశైలం" కొట్టాపు శాలలను గురించి ప్రస్తావించాడు. వాటిని మన చరిత్రకారులు "ఘంటసాల" గూడూరు రేవులుగా గుర్తించారు. బుద్ధుడు రాజ్యాన్ని, గృహాన్ని పరిత్యజించి వెళ్ళినప్పుడు కంటకమనే గుర్రం మీద ఎక్కి వెళ్ళడం వలన, ఆ విశ్వాసనీయమైన గుర్రం పేరిట నిర్మించిన స్థూపంవలన దీనికి కంటకశైలమని పేరు వచ్చి వుండవచ్చుని చరిత్రకారులూహించుచున్నారు.

ఘంటసాల నుండి విదేశాలకు వెళ్ళింది ఆంధ్రదేశపు సరుకులేకాదు. ఆంధ్రుల నాగరికత కూడా ఘంటసాల రేవునుంచి జావా, సుమిత్రా, బోర్నియో. సయాం కాంబోడియా తదితర ప్రాచ్య దేశాలకు వ్యాపించింది. ఆదేశాల్లోని పట్టణాల పేర్లలోనూ, నాగరికతలోనూ ఆంధ్రదేశపు పేర్ల ఛాయలు, నాగరికత ప్రభావము కానవచ్చినట్లు డూబ్రియల్ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు.

ఘంటసాల బౌద్ధక్షేత్రమేకాదు. వాణిజ్యంలో తుల తూగిన నగరం, విదేశాలకు బౌద్ధాన్నేగాక ఆంధ్ర నాగరికతను కూడా వ్యాపింపచేసిన కేంద్రం.

"పురావస్తు శాఖవారు ఇప్పుడు సాగించే త్రవ్వకాల్లో పుడమిపుటల్లో నిక్షిప్తమై వున్న చరిత్ర వెలుగులోకి రాగలదని, ఘంటసాల కీర్తి ప్రశస్తి కొత్త వెలుగును సంతరించుకోగలవని ఆశిద్దాం.

—ఎ. కె. ఆర్. బి. కోటేశ్వరరావు

మధుర జీవనము

మధురంగా జీవితం కొనసాగించుకోగలగడం అంత సామాన్యం కాదు. అందరికీ సాధ్యమున్నూ కాదు.

అందుకు అనుకూల వాతావరణం, ఆలోచన, దీక్ష అవసరం.

మన మందరం జీవితాలు గడుపుతున్నాం ఎవరికి అనుకూలమైన మార్గంలో వాళ్ళం. అయితే ఆ జీవితాల్లో ఆనందాన్ని అందుకోవలసినంత మేరకు అందుకో గలుగుతున్నామా అన్నది ప్రశ్న.

తిండీ, బట్టా, ఇల్లూ వుంటే చాలు అనుకొనేవారు కొందరు; అపైన మానసికానందాన్ని కూడా సమకూర్చుకోవాలనుకొనే వారు కొందరు. భౌతికంగా, బౌద్ధికంగా చక్కని సమన్వయంతో సతతం జీవితాన్ని సంతోష సుఖ కాంతులతో గడుపుతున్నామా అని చూచుకోవాలి.

బహు కొద్ది మంది మాత్రం బ్రతుకు భారరహితంగా, భావోద్వేగంగా, హాయిగా గడుపుతారు వారు ధన్యులు। అలాంటి వారు తమకు తామే గాక ప్రక్కనున్న వారికీ తమ పరిమళ జీవిత ప్రభావాన్ని పంచి ఇస్తారు. తమ బ్రతుకును సార్థపరుచుకుంటారు.

బ్రతుకు బ్రతకడానికేగాని. బ్రతుకులో బాధని ప్రతిక్షణం ప్రదర్శించుకోవడం మంచిదికాదు. మనసున్న మానవునికి మాత్రం తెలియకుంటే అతడు జంతు స్థాయికి దిగువనున్న వాడే అవుతాడు.

బ్రతుకుని తీయగా హాయిగా గడపడం కళాకారులకే సాధ్యమని గాని తీరిక చిక్కిన వారికే సాధ్యమని గాని అనుకోరాదు. కళాకారులకి, కవులకి తత్త్వచింతనాయత్తులకి మాత్రమే సాధ్యమనుకోరాదు. సామాన్యులైన సామాన్య మనుషులకి ఇది సాధ్యం.

జీవించడం ఒక గొప్ప కళ. అందులో ప్రేమ నెరిగి జీవించడం ముఖ్యం. అందుకు తగినంత అనుభవం అవగాహన కావాలి. అనుభవానికి అవగాహన తోడు కావాలి. తరాల బట్టి తరహాలబట్టి ఈ అవగాహనానుభవాలు పండుతాయి.

ఉన్న పరిస్థితుల్ని ఆనందంగా మలుచుకోవడం గొప్ప నేర్పు. గొప్పవరం.

"అన్ని శిల్పాల్లోకి జీవన శిల్పం అత్యుత్తమం" అంటారు మాన్య మిత్రులు Dr. సంజీవదేవ్‌గారు.

మధుర జీవి తన జీవిత మాధుర్యంతో గుబాళిస్తాడు. గురుడుగా వెలుస్తాడు సంఘంలో.

ఒక మంచి సమయాన మా గొర్రెపాటి వెంకట సుబ్బయ్య బాబు మధుర మిత్ర సమాగమం ప్రస్తావించారు. అస్మదాదులం అందుకు సంతోషంగా అంగీకారం తెలిపాము. తత్కారణంగా మధుర మిత్ర సమావేశం తొలిసారి వల్లూరులో శ్రీ వేగుంట కనకరామబ్రహ్మంగారింట జరిగింది. తదాది సంవత్సరానికి ఒక సారి సంక్రాంతి పండుగ దినాల్లో మూడు పూటలు ముద్దుగా సమావేశాలు ఘంటసాలలో, ఘంటసాలపాలెంలో, పెదపనగల్లులో, పెదపుల్లేరులో, గుంటూరులో, తుమ్మపూడిలో, వరంగల్లులో ఇలా వరుసగా జరిగాయి. ఆ సమావేశాలకు కవి పండిత మిత్రులు, కళాకారులు, గ్రామస్థులు హాజరయ్యేవారు. మిత్రులం చతుర సంభాషణలతో, కావ్య పఠనలతో, కాలక్షేపం చేసేవాళ్ళం. ఆతిథ్యం ప్రతి తావునా ఘనంగానే జరిగేది. మనసు గలిగిన మిత్రులం మైత్రీమాధుర్యాన్ని గొప్పగా చవిచూచేవాళ్ళం.

ఈ సమావేశాల్లో శ్రీ సుబ్బయ్యబాబుగారి స్థానం ప్రత్యేకం. ఆయనకు అందరూ ఆత్మీయులే. అల్లుళ్ళు, మనుమళ్ళు కూతుళ్ళు వరుసలో అమరేవారు. అందులో పుత్రుణ్ణి నేనొకణ్ణే. బాబుకి నామీద ప్రత్యేకాభిమానమంటే స్వోత్కర్ష కాదు.

ఒక విషయం ఇక్కడ అప్రస్తుతం కాదనుకుంటాను. అదేమంటే బాబుగారు నా ప్రోద్బలంవల్లే చలం-జీవితం సాహిత్యం అన్న బృహద్గ్రంథాన్ని సమకూర్చారు. దానికై వారెంతో శ్రమించారు.

చివరిగా బాబు మీద నేనల్లుకొన్న ఒక గీతాన్ని దిగువ ఉదాహరిస్తాను. ఈ గేయం నేను విజయవాడలో ఆంధ్ర సర్కారు విద్యాశాఖవారు బాబుకి జరిపించిన సన్మాన సభలో గానంచేసింది. తరువాత దాన్ని నామాన్యశ్రీలు అన్న కావ్యంలో చేర్చుకున్నాను.

ఉల్లము ఉడువులు తెల్లన
మాటా మనుగడ మెల్లన
అందరికీ విడిదియైన
ఆతని హృది చల్లన॥

అచి తూచి మాటలాడు
అందమైన తీరు తనది
మమతా మానవతా గల
మధుర జీవనము తనది॥

మహామహుల జీవితాలు
మన కన్నుల గట్టినాడు:
ఆచరణా శిల్పములో
అందెవేసినట్టి వాడు॥

బంధు ప్రీతి అందరితో
బాంధవ్యము గలబాబు
దర్జా ఠీవీ దర్పం
ధరియించిన నవాబు

—బి. వి. నరసింహారావు

శరద్దర్శనం-ఒక పరిశీలన

"The work of art is a product of human activ'r/ and is made fer human" అన్నది హెగెల్ సూక్తి లలిత కళలలో సాహిత్యానికి కూడ స్థానం వున్నది కాబట్టి పై సూక్తిలోని art అన్నమాటకు బదులుగా litera-ture అని చేర్చుకున్నా అసమంజస మనిపించదు. సాహిత్యం మానవుని సృష్టి. ఆ స్రష్టయే రచయిత. గంభీర సముద్రం పచ్చని చెట్టు చేమలు. వున్నత పర్వత పంక్తులు గంభీర లోయలు మొదలయిన ప్రకృతి దృశ్యాలు అతని హృదయంపై హత్తుకుపోయినట్లే మానవ స్వభావం, ప్రపంచ పరిణామం, సంఘంలోని అన్యాయం, సమాజంలోని అసమానం, పరిసరాల ప్రభావం, పరిస్థితుల పరివర్తనం

కూడ అతని మనోఫలకంపై ముద్రలుగా ఏర్పడతై. చైతన్యవంతుడైన వ్యక్తి రచయితగా రూపొంది ఆ పరిస్థితులకు ఆ దృశ్యాలకు, తన వూహలతోను, మాటలతోను, ప్రాణంపోసి పాఠక లోకానికి అనేక రూపాలలో అందించటం జరుగుతుంది. అట్టి రూపాలలో నవలా రచన ఒకటి. ఆ నవల పాశ్చాత్య సంప్రదాయంలో పుట్టి నేటి ప్రపంచ సాహిత్యంలో ఒక విశిష్ట స్థానం సంపాదించుకొంది.

మన భారతీయ నవలా కారులలో ప్రముఖ బెంగాలీ రచయిత శరత్చంద్ర చటర్జీకి గల స్థానం అద్వితీయమైనది. ఆయన రచించిన నవలలు లెక్కకు మిన్న. అందులో చాలావరకు ఎన్నో ప్రపంచ భాషలలోకి తర్జుమా కావటం విశేషం. ఆయన వ్రాసిన నవలలన్నీ కొంచెం ఇంచుమించుగా మన తెలుగులో అనువాదమై ప్రచురించబడినవి ఒక్కొక్క నవలను అనేకమంది అనువదించటంకూడా జరిగింది. అట్టి విశిష్టత కలిగిన శరత్ నవలా సాహిత్యాన్ని, కథా సాహిత్యాన్ని, ఆయన వ్యక్తిత్వాన్ని సమగ్రంగా అనుశీలన చేసి పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారు "శరద్దర్శనం" అను పేరుతో ఒక వుద్గ్రంధాన్ని రచించారు. ఒక విమర్శనా గ్రంథాన్ని చదవటమంటే చాలా tough గా వుంటుంది సర్వ సామాన్యంగా. కాని ఇది గొప్ప విమర్శనా గ్రంథమయినప్పటికీ సాఫీగా నడిచే ఒక నవల చదువుచున్నంత ఆనందంగా వెళుతుంది. ఆ సౌలభ్యానికి శరత్ ప్రతిభా విశేషాలు కొంత వరకు కారణమయితే చెయ్యి తిరిగిన వెంకటసుబ్బయ్యగారి రచనా పాటవం కొంత వరకు ఈ "శరద్దర్శనం" చదివినవారికి శరత్ సాహిత్యమంతా ఒంటిని పట్టించుకోవాలనే కాంక్ష ద్విగుణీకృతమవుతుంది.

అసలు మన తెలుగు వాఙ్మయంలో విమర్శనాత్మకమయిన రచనలు బహు తక్కువనే దానికి భిన్నాభిప్రాయాలు లేవు. పరిశీలనాత్మక రచనలంటే Surgical works లాంటివి. ఆంగ్ల సాహిత్య సంపర్కం వల్ల మన కావ్య ప్రక్రియలలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ విమర్శనాత్మక కృషి అట్టి సంపల్లాభాలలో ఒకటి అనవచ్చునేమో! విఖ్యాత విద్యావేత్త డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డి "కవిత్వ తత్వ విచారం" ఆయనకు ఆంగ్ల సాహిత్యపు వాసన లేకుంటే వచ్చి వుండకపోవచ్చు. మన భాషలో అధునాతన పరిశీలనాత్మక రచనల కది సోపాన మంటూ వుండటం పరిపాటి.

శరద్దర్శనంలో ఉపక్రమణిక నుండి ఉప సంహారము వరకు విషయాలను పొందు పరచిన పద్ధతి . ముఖ్యంగా శరత్ జీవితానికి సంబంధించిన సంగతులు

బంకిం. రవీంద్ర. ప్రేమచంద్, డికెన్సులతో పోలికలు, వ్యత్యాసాలు, ఈయన రచనలపట్ల సమకాలిక మేధావుల అభిప్రాయాలు. నవలల పరిచయము. వాటిల్లో నిగూఢమై వున్న మానవతా దృక్పధం ఇంకా ఆయన అసత్యతత్వం, ప్రేమ, వాత్సల్యం, కన్నీరు, స్త్రీ పాత్రలు, పురుష పాత్రలు, బాలపాత్రలు, కరుణరసము హాస్యరసము, వర్ణనలు మొదలగు శీర్షికలతో సుబ్బయ్యగారు తడవకుండా విడిచిన దేదీ లేదు ఆ తడవిన విషయాలకు అన్వయించే ప్రపంచ సాహిత్యంలోని మణి పూసల వంటి Quotations. అందుపై వివరణలు పాఠకుణ్ణి ముగ్ధుణ్ణి చేస్తవంటే అసత్యంకాదు, శరత్ అనుశీలన పిలె సుబ్బయ్యగారి సరిశీలన సూక్ష్మాతి సూక్ష్మం. నవలా సాహిత్య విమర్శనా పద్ధతికి ఈ శరద్దర్శనం ఒక Reference book గా ప్రాముఖ్యత సంతరించు కుంటుందనటానికి ఎట్టి సందేహం లేదు. బుద్ధిగమ్య మయిన పరిశోధనా సాహిత్యం మన భాషలో బహు తక్కువ అనేది పైనే మనవి చేసి వున్నాను

శరత్. సుబ్బయ్యగారన్నట్లు తెలుగు నవలాకారుడిగానే చెల్లుబడి అయి పోతున్నాడు.నాకు తెలిసినంత వరకు వుత్తమ నవలా సాహిత్యం ఇంత ఎక్కువగా ఏ తెలుగు రచయిత పుత్పన్నం చేయలేదేమో। శరత్ నవలలలో, మనకు నవలా పాత్రలే గోచరిస్తవి తప్ప రచయిత ఎక్కడా కనిపించడు.రచనా శిల్పం ఒక కళ. ఆ కళా ప్రయోజనం రసస్ఫూర్తి, అభ్యుదయం, విశ్వజనీనతగా వుండాలి. సాహిత్యకారులు యివ్వవలసిన ముఖ్యమయిన సందేశం సౌహార్దం, సౌభ్రాత్రం, సౌజన్యం, పవిత్రత, ఔదార్యంగా వుండాలి. Secluded mentality కి చిహ్న లయిన ఆత్మస్తుతి, పరనింద మాత్రం కారాదు. సమాజ హృదయాన్ని సంస్క రించేదిగా ఉండాలి. ఏ సాహిత్యమయినా.ఆ సంస్కారం మళ్ళా వుత్తమమైందిగా ఉండాలి గదా।

పైన చెప్పిన లక్షణాలతో శరత్ సాహిత్య మంతా నిండి వుంది. వాటి నన్నింటిని వెంకట సుబ్బయ్యగారు శరద్దర్శనం ద్వారా విశ్వమాన సందర్శకం చేయించారంటే అతిశయోక్తి కాదు. నవలకు నవజీవనం పోసిన నవలా సమ్రాట్టు యొక్క కరుణా కాతర హృదయాన్ని ఎక్సరే తీసి మూల పదార్థాల నన్నింటిని ఆ మూలాగ్రంగా దర్శనము చేయించిన దయా మానవతా దార్శనికులు వెంకట సుబ్బయ్య గారు.

రచయితకు అనేక రకాలయిన అభిప్రాయాలు ఉండవచ్చు కాని యఫ్.ఎ. పాటర్ చెప్పినట్లు రచయిత తన భావుకత ద్వారా రచనలు చేయాలి కాని తన అభిప్రాయాలు, నమ్మకాలు ద్వారా కారాదు. రచనలో ప్రధాన స్థానం వహించేది ఆతని భావనా బలమే కవి అభిప్రాయం బలంకాదు. శరత్‌లో మనకు గోచరించే దంతా అట్టి భావనా బలమే.

శరత్‌బాబు తన నవలలద్వారా యిచ్చిన సందేశం కుల మత, ధనిక పేద భేదాల కతీతమయిన ఒక దివ్యశక్తి. ఆయన పాత్రలను సృష్టించిన తీరు సహజ సిద్ధం. నిజంగా ఆయన విశ్వ సాహిత్య జగత్తుకు శరచ్చంద్రుడు.

మహర్షి, వేదాంత ఋషి అయిన అరవిందు లంతటి వారు శరత్ అపార మేధాశక్తికి, పరిపక్వమయిన పరిశీలనాత్మక దృష్టికి, కరుణాపూరిత మయిన హృదయానికి పులకితులై "What is stamped on saratchandra's photo graph everywhere is a large intelligence an acute and accurate observation of men and things and a heartful of sympathy for sorrow and suffering" అని అన్నారంటే శరత్ మూర్తి పైన, ఆయన రచనా విశిష్టతపైనా ఆయనకున్న సదభిప్రాయం వ్యక్తం అవుతుంది. అంతకంటె శరత్ విశిష్టతకు గీటురాయి ఏముంది?

పతితులంటేను, సంఘం దృష్టిలో చెడ్డవారని చెప్పబడే వారియెడల శరత్‌కున్న అనురాగం, సానుభూతి పాఠకులకు కూడ inject చేసే నేర్పుగల "డాక్టర్" ఆ శక్తి ఆయనకు అపారం. ఆ శక్తి అట్టివారి యెడ "అయ్యోపాపం" అను సానుభూతిని చూపకుండా ఎట్టిరాతి గుండె గల పఠితా కూడా వుండలేడు. సుబ్బయ్య గారన్నట్లు "స్త్రీ హృదయాన్ని ఆయనవలె అనుపూర్వకంగా చిత్రించిన వారు నభూతో నభవిష్యతి" దీన్నిబట్టి ఆయన observation ఎంత నిశితమైనదో సూక్ష్మమైనదో తెలుస్తుంది. వంగ మహిళా లోకం తమకు శరత్ చేసిన సేవను గుర్తించిన దనడానికి ఆయనకు 57వ జన్మదినోత్సవ సందర్భంలో సమర్పించిన సన్మాన పత్రమే తార్కాణం. ఏ సంఘ సంస్కర్తకు, ఏ రాజకీయ నాయకునకు అట్టి ప్రత్యేక గౌరవం లభించదేమో! నిజంగా ఆ మహిళా లోకం అన్నట్లు "స్త్రీలహృదయ కుహరాల్లోని మూక ఆనంద ఆవేదనలకు వాగ్రూప మిచ్చిన మహా శిల్పి. వారి మౌన భాషను గ్రహించిన గొప్ప మేధావి. "The great blessings of man

kind are within us and within our reach. but we shut our eyes like people in the dark" అని ఒక విఖ్యాత ఆంగ్ల పండితుడన్న సూక్తి ఆ great blessings of man kind చీకటిలో వున్నవారికి కూడా చూపించిన ప్రజ్ఞాశాలి శరశ్చంద్రుడు ఆయన ప్రగాఢ విశ్వాసం కూడ "Above all is man, there is no greater truth than this" అనేది అంటే మానవునిలోని మానవతపై ఆయనకున్న నిశ్చితమయిన, మొక్కవోని విశ్వాసం వెల్లడవుతూంది అదే ఆయన రచనలలోని విశిష్టత. సాహిత్యం మానవాభ్యుదయం సాధించడానికి సాధన మన్నది నిర్వివాదాంశం కదా!

He has imparted a new power to our language and he has achieved the best reward of a Novelist and he has completely won the hearts of Bengali readers" అని అన్న విశ్వకవి రవీంద్రుని ప్రశంస పఠిస్తే "భావపు జోడు గుర్రముపైన సవారి యొనర్చు భాషయా దేవకు రంగిపై కొలువు దీర్చు, వనమ్ము మృత ప్రవంతిలో జీవన సిద్ధి పొందపరచించెదు పట్టుల సిద్ధహస్తుడు" అని మన కవి బ్రహ్మ ఏటుకూరి ఒక సందర్భంలో అన్న పద్యం గుర్తు కొస్తుంది. వంగ భాషకు ఆయన కలిగించిన పుష్టి, తుష్టి, చాలా శక్తివంత మైనదని విశదమౌతుంది. నవలా రచన ఆయన చేతుల్లో ఎంతగా పరాకాష్ఠ చెందిందో చెప్పడానికి నోబెల్ బహుమాన పరిగ్రహీత అయిన రవీంద్రుని పసిడిపలుకులే సాక్షి. మన తెలుగులో "ముద్దుబిడ్డ", "దీక్ష", "తోడికోడళ్ళు", "బాటసారి" మొదలయిన పేర్లతో చాలా వరకు శరత్ నవలలు సినిమా చిత్రాలుగా వచ్చాయి. ముఖ్యంగా ప్రజానీకానికి కావలసిన romance గాని humour గాని, entertainment గాని లేకుండా పండిత పామర రంజకంగా ఆ చిత్రాలన్నీ వెళ్ళినవంటే కథ హృదయాలకు హత్తుకు పోయేటట్లు చేసిన శిల్ప శక్తి ఆయన కథలలో వుంది కాబట్టిన్నీ, పాత్రల పరిపూర్ణత్వానికి ప్రాణం పోసే సంజీవి ఆయన కలంలో కలదు కాబట్టిన్నీ. అంతకంటే ఆయన అనన్యమయిన ప్రతిభకు పరీక్ష ఏమిటి? ప్రతి నవల హృదయం విప్పుకు చదవటం తటస్థిస్తుంది. అప్పుడు ఆ హృదయంలో జాలువారిన కరుణా ప్రవంతి తన్మయత్వంలో ముంచెత్తుతుంది. ఇంకా పెల్లుబికి కళ్ళు చెమ్మగిల్లత్తై.

శరత్ నవలలలో repitition ఒకటి ఎక్కువగా వున్నట్లు కన్పిస్తుంది. అయినా ఆయన నవలా సాహిత్యమంతా ఎక్కువగా Human Psychologyకి సంబంధించినది కాబట్టి ఆ వస్తువును అనేక కోణాలలో చూపించేటప్పుడు అట్టిది అవసరమవిపిస్తుంది. అందువల్ల ఒకరకంగా Qualification అని చెప్పకోవచ్చు.

ఈయనకు నోబుల్ బహుమానం లభ్యంగాక పోవటానికి తన రచనలలో ఔన్నత్యం. విశిష్టత. అర్హతలేకపోవటం కాదేమో। బహుభాషా ప్రవీణులలో ప్రవీణు డయిన డిలీప్‌కుమార్‌రాయి "విష్కృతి" అనే నవలను ఆంగ్లంలోకి తర్జుమా చేసే టప్పుడు "Among the great Indian writers of to-day, Sarat Chandra is probably the most difficult to render into a European tongue The reason is that he is the most Bengali cf the Bengali belletrists even as dostoievsky is most Russian of the Russian romantist realists. True, he imbibed all that is best of the western culture, but his responses and reactions to the changing times remained to the end incradicably Indian. It is this which makes his expressions, his dialogues in partieular. so babblingly untranslatable" అన్న దాన్నిబట్టి చూస్తే ఆయన వంగభాషలో వ్రాసినంత పటిష్టంగా ఆంగ్లములో నికి తర్జుమాచేసేశక్తి ఎవరికీ లేకపోవటమేననేది విదితమవుతుంది ఆ భావనా సౌష్టవాన్ని. ఆ భాషా పాటవాన్ని యింకో భాషలో అంతబాగా తీసుకురావటం ఎవరికీ సాధ్యం కాదేమో।

శరద్దర్శనంలో శరత్ సాహిత్యానికి వ్యక్తికి సంబంధించిన అన్ని విషయాలను వెంకట సుబ్బయ్యగారు సమగ్రంగాను, సాకల్యంగాను చర్చించి యితరులు చెప్ప టానికి ఏమీ మిగల్చకుండా చేశారు. అందువల్ల యింక శరత్‌పై ఎవరు ఏమి వ్రాసినా అది "పునఃపునః" అవుతుంది.

శరత్‌వలె వెంకట సుబ్బయ్యగారు కూడా కరుణాకాతర హృదయుడే. ఆయన వలె యీయనది స్త్రీ హృదయం. పతితులన్నా. భ్రష్టలన్నా అపారమయినసానుభూతి. అందువల్ల శరత్‌ను గురించి వ్రాయటానికి వెంకట సుబ్బయ్యగారికిగల అర్హత మరెవ రికి వుండదేమో। పుస్తకానికి పేరుపెట్టడం ఒకకళ. ఆ కళలో రచయిత ఆరితేరిన వారని "శరద్దర్శనం" పేరే చెప్పక చెప్పుతున్నది. జీవితపు లోతుల గతులు,

బాహ్యాంతర మనఃపరిణతి, జీవిత సంయమనం, రసహృదయం, కళాత్మక దృష్టి గల శరత్‌ను గురించి చరిత్ర పరిశోధనలోను, సాహిత్య విమర్శనలోను, జీవిత చరిత్రల రచనలోను పండిన విందుహృదయం గల వెంకట సుబ్బయ్యగారు వ్రాయటం ఎంతయినా సమంజసంగా వుంది. ఆ విధంగా వ్రాసి శరత్‌కు, శరత్ సాహిత్యానికి ఎంతో న్యాయం కలుగజేసి మన తెలుగువారి మన్ననలను పొందారు. మధుకరమువలె కృషి చేసి యీ "శరదర్శనం" అనే మధుకలశాన్ని తెలుగు పాఠక లోకానికందించిన వెంకట సుబ్బయ్యగారి పవిత్రాత్మకు జోహారులు.

—వి. కె. ఆర్.

డబ్బున్నోళ్ళంటే యెంత మోజు!

ఇరవై ఆరో నెంబరు బస్సు సింహాచలం నుంచి బయలుదేరి గోపాలపట్నం, మర్రిపాలెంమీదుగా మాంచి హుషారుగా జోరుగావచ్చి 104 బస్సుస్టాండ్ దగ్గర ఆగింది. అప్పుడే ద్యాసెకెండ్ బాలంత వున్న ఎర్రని సూర్యుడు ఆటలో ఓడిపోయిన వాడిలా కృంగిపోతూ కనుమరుగై పోతున్నాడు

అప్పుడే నిండు యవ్వనంతో పంచదార కలశంలా చవులూరించే మచ్చలేని మామిడిపండు చిన్నది. తెల్లని నవ్వుల పలువరుసతో సన్నని చిక్కని కాటుక కన్నులతో బస్సు ఎక్కుతూ 'ఒరేయ్ ఫోనుచెయ్యడం మరచిపోకు. టాక్సీలూ దొరకలేదు, ఆటోలూ దొరకలేదని చెప్పు. చిన వాల్తేరుకు మనిషిని పంపమనీ చెప్పు. మరచిపోకు' కంఠం శ్రావ్యంగా వీణకన్న మధురంగా మోగించింది. అందరి చూపులూ అటు తిరిగాయి.

అడ్డుగావున్న జనం అటే చూశారు. తమకు అడ్డుగావున్న వాళ్ళను తిట్టుకుంటూ కనబడని ఆ జవ్వనిని చూసేందుకు వీలుచిక్కని చాలమంది మనసులో చిరాకు పడిపోయారు. ఒక్కసారైన చూడకపోతే తప్పదు అనుకున్నారు.

జనం ఆవిడకు సులవుగా దారి యిచ్చేశారు. బహుశా ఆమెచేతి వజ్రాల గాజుల మహిమో... ఖరీదైన ఎ క్ట్రానిక్ రేడియమ్ డయల్ రిస్టువాచ్ మహిమో.... వాళ్ళ

యిళ్ళకు 'ఇందిరమ్మ' వచ్చినట్లు మూస్కుపోతూ వెనక్కి వెనక్కి తగ్గిపోయారు. దారి సులభం చేశారు.

రెండో సీట్లోవున్న ఇద్దరిలో ఓ ముసలమ్మ పోతూ పోతూ 'ఇలా కూచో తల్లీ....' అంటూ లాలనగా ముద్దుగా అప్పుడే వచ్చిన వారికి ఎప్పటికీ దొరకని సీటు చప్పున యిచ్చేసి తను ఏదో గొప్ప సహాయం చేసినట్లు మహా ఆర్ద్రైపోయి దిగిపోయింది. గొప్పవాళ్ళకు సహాయం చేశాం అన్న మహాగొప్ప ఆనందమేదో ఆమె కంటిలో మెరిసింది. 'ఇందిర'కే వోటు వేసినట్లు మహా సంబరపడిపోయింది.

కళ్ళల్లో చిలిక నవ్వుల మెరిపిస్తూ పక్కనున్న ఆవిడ ఎలాంటి ఆవిడో ఒకసారి పరిశీలించి చూసుకొంది. తన వెనక మగవాళ్ళున్నట్లు అంతకుముందే గ్రహించింది. తనముందు స్త్రీలే కూర్చున్నట్లు తెలుస్తూనేవున్న విషయం మనసులోనే విరుచుకొంది. 'ఛీ....ఛీ సమయానికి కారు చెడిపోయింది' అని గుంజాటనపడుతూ చాకలి డ్రైవర్ను తిట్టుకుంటూ, పరమేశ్వరి సినిమా హాలుదగ్గర వాల్‌పోస్టర్లో ఎన్. టి. ఆర్.ను చూసి నిత్య యవ్వనుడు ఇంకా ఎంత హుషారు' అనుకొని తమలపాకులు సేవించిన పెదవుల్లోంచి పై కుబికిన సుకుమారమైన నవ్వుల వెన్నెలల్ని మొగాన వెలిగించింది. ఆ ముసలమ్మ యిచ్చిన సీటు ఇంకా తగ్గని వెచ్చదనానికి సహించలేని లక్షణమేదో ఆమె మొగంలో విలవిల తన్నుకుంది మెడలోని హారాలు. చీరలోని జరీపువ్వుల విలువలు అక్కడ ఆ బస్సులో ఆమెను కూర్చోనివ్వడంలేదు. లోలకులు విరవేసే చెవుల సౌందర్యం. అంతకు రెట్టింపు విలువుండే ఆ లోలకుల నాజూకు, పరిమళం కళ్ళముందు మెరిసిపోతూవుంటే తనలోంచి వెల్లువలై ప్రవహిస్తూ, ఆ బస్సులో పేరుకపోయిన కుళ్ళు కంపును తుడిచే ఫ్రెష్‌గా అందరికీ అమృతపు జల్లుల్లా సువాసనల నందించిన తన ఒడుపుల్లోంచి వెల్లుబికే సుగంధ పరిమళం ఆ బస్సుకు ప్రాణంపోసినందుకు మహదానంద పడిపోయింది. తనలోంచి ఏదో వెలుతురు వాళ్ళ మొగాలమీదపడి వెలిగించినట్లు భావించింది.

బస్సు ఆగుతూ కదులుతూవుంది. జనం ఎక్కుతూ దిగుతూ వున్నారు. ఏమాలవేళ దాటిపోవడ వల్ల బస్సు మరీ ఇరకాటంగాలేదు. చాలమంది దిగిపోవడమే కాని ఎక్కేవాళ్ళు పల్చబడిపోయారు.

నవరత్నాలను బుల్లిబుల్లి ముత్యాల గుత్తుల మధ్య పొదిగిన ఆ సొగసు లోలకుల్ని ఒకరు చూస్తూవుంటే, ఒకరు ఆమె చేతి గడియారంవైపే చూస్తున్నారు

ఒకరు ఆ చీర సౌందర్యానికి ముచ్చట పడిపోతూవుంటే, ఒకరు కాళ్ళ పాంజేబు పట్టాల్లోని పనితనం, సొగసులకు ముచ్చటపడిపోతున్నారు. పైపైకి తేలికనిపించే ఆ చీరలోని లంగా తళతళలకు కొందరు మోజుపడుతూ ఆ వజ్రాల గాజులమీద వల బడిపోతున్నారు.

ఆ అందముందు ఏ సినీ హీరోయినైనా బలాదూరే అంటూ కొద్దిమంది మాత్రం ఆమె మొగంవైపు చూడగలిగే దృష్టవంతులు ఉక్కిరిబిక్కిరై పోతున్నారు. ఆ చెంపల సౌకుమార్యానికి జ్వాలలా సూదంటురాయిలా లాగుకుంటూ గుండెల్ని మంటెక్కించేస్తూవుంటే, అటు చూడగలిగిన అదృష్టవంతులు ఉక్కిరిబిక్కిరై పోతున్నారు. వెనకనున్నవారు జుత్తు ముడి. మెడ సొగసు చూస్తూ బెంగపడి పోతున్నారు.

ఈలోగా దుర్గాంమ్మ గుడి రానేవచ్చింది. అంటే బస్సు పూర్ణామార్కెట్‌కు వచ్చిందన్నమాట. మూడువంతులు దిగిపోయారు. అంతకు రెట్టింపు ఎక్కారు. ఈసారి బస్సు కొంచెం సందడిగానేవుంది.

ఏవేవో మాటల కలయికల, 'ధ్వని తరంగాలు' ఆమెకు చికాకు కలిగిస్తూనే ఉన్నాయి. ఇంతసేపూ డబ్బులతగదంమరచిపోయిన కండక్టర్ 'టికెట్....టికెట్' అలా అంటూ ఆమెముందు నిలిచాడు.

గుండెల్ని పిండేసే హ్యాండ్‌బ్యాగ్ జిప్ సర్‌నలాగి కొత్త వదిరూపాయల కాగితం చివరి అంచు కండక్టర్ చేతికందించింది. మనిషెంత గొప్పగా వుందో ఈ నోటూ అంత గొప్పగా వుందనుకుంటూ ఉన్న వాటిల్లో మంచినోట్లకోసం వెదికి వెదికి చివరికి నలిగిపోయిన కుళ్ళునోట్లు చిల్లరతోసహా చేతిలో పెట్టాడు.

ఆమె లెక్క చూసుకుంది. 'ఛీ....తను లెక్కపెట్టుకోవడమేమిటి....' అనుకుంది. నలిగిపోయిన అయిదురూపాయలనోటూ, వడలిపోయిన ఆకుల్లాంటి రెండు రూపాయలనోట్లూ, పదిపైసలబిళ్ళా, అయిదుపైసలబిళ్ళా ఉన్నాయి. కాదు....వున్నట్లు ఆ కళ్ళు చూశాయి. పైట సర్దుకుంది. మళ్ళీ చూసింది. అలాగే అనిపించింది. ఆ డబ్బు చేతిలో వుంచినప్పుడు ఆ చేతి లావణ్యానికి కండక్టర్ తూలిపడబోయాడు. వెంటనే ఆమె అతని గుండెలాగిపోయేటట్టు 'వన్ నాట్ ఫోర్‌మంది చినవాల్తేరుకు ఎంత?' అంది.

కళాశాలవద్ద కండక్టరు 'అరపై పైసలండీ' అన్నాడు.

'మరి చిల్లరెంత ఇచ్చావు' మామూలుగానే అంది. ఈ మాటతో బస్సులోని వారంతా చాలా ఎలర్ట్ అయిపోయారు.

'తొమ్మిది రూపాయల యాభై పైసలిచ్చాను. ఓ అయిదురూపాయల నోటు, రెండురెళ్ళు, ఓ పావలా, పదిపైసలబిళ్ళ ఒకటి, ఐదుపైసలబిళ్ళ ఒకటీ....' అన్నాడు.

మళ్ళీ ఓసారి అతనిచ్చిన డబ్బు లెక్కచూసింది 'ఓ పావలా తక్కువుందే' అంది.

వెంటనే ఆమె ప్రక్కనే కూర్చున్న విధవరాలు 'ఏళ్ళంతేనండి.... పావలాలు, అయిదుపైసలబిళ్ళలూ కొట్టేస్తూ వుంటారండీ' అంది

కండక్టరుకు రాగూడనికోపం వచ్చేసింది. 'మాటలు సరిగ్గా రానివ్వండి. కొట్టెయ్యడం గిట్టెయ్యడం మనకు తెలియదు ఎక్కడ పడిపోయిందో సరిగా చూసుకుంటే .. మీకే ...' అని అతనింకా ఆ మాట పూర్తిచేయకముందే—

'ఏమిటోయ్... ఫూల్‌లా....ఆవిడ ఆఫీసరుగారిభార్య. ఇవ్వలేదంటూవుంటే ... నోటికొచ్చినట్లు వాగుతున్నావ్.... సరిగా చూడమంటావేమిటి? ఆమెకు లెక్కలు రావనా.... ఎందుకు ఇచ్చెయ్ పావలా....' అన్నాడు ఆమెపక్కనే నిలచి ఆమెలోంచి బంగారమేదో తనలోకి ప్రాకిపోతున్నట్లు మహా సంతోషపడిపోతూన్న ఆ పెద్దమనిషి. ఆమెకు ఘోరమైన అన్యాయం జరిగిపోయినట్లు హడావుడై పోయాడు.

వెంటనే మరొకడు 'నేను చూస్తూనే ఉన్నాను. ఆమె లేచి చీర దులుపుకోవడం.... పైట సర్దుకోవడం.... ఎక్కడా పడందే.... పాపం ఆవిడ వంగి కాళ్ళ కిందకూడ చూసుకుంది' అంటూ గట్టిగా అరిచాడు ఓ చూపుల గుంటడు.

కండక్టరుకు పిచ్చెక్కినట్లయింది 'ఆమె కాళ్ళకింద చూసుకుంటే నాకెందుకూ. చీర దులుపుకుంటే నాకెందుకు. నే నిచ్చాను ఎవరమ్మ మొగుడిసొమ్ము తేను; మీరంతా పారేసుకుంటూవుంటే తీసుకొచ్చి యివ్వడానికి' అనేశాడు కాస్త రఫియన్‌లా.

దీనితో ప్రజలు కుతకుత సున్నంలా ఉడికిపోయారు. 'ఆపు ముందు బస్సు. నీ దగ్గరున్న డబ్బు లెక్కపెట్టు ఇచ్చిందీ లేందీ తేలిపోద్ది' అన్నాడు ఓ హీరో సర్న ముందుకు దూసుకొచ్చి

'ఇలా అందరికోసం పైన పైనకు లెక్కపెట్టుకుంటూ కూచుంటే మరి బస్సు కదలినట్లే' అన్నాడు కండక్టరు ధీమాగా.

'అయితే ఎవడబ్బసొమ్ము దొబ్బుతావ్.... ఆపు బస్సు' అన్నాడు కత్తిలా ఓ తాగుబోతు.

'నా జన్మలో ఒక్కసారికూడ ఎవ్వరికీ నే డబ్బు తక్కువివ్వలేదు. అలా ఎప్పుడూ జరగదు' అన్నాడు కండక్టరు ఉక్రోషంతో.

ఈ మాటలు అలా అలా క్షణంక్షణం బస్సుచక్రాల్లా చుట్టుకుంటూ ముందుకు పోతుంటే హోరాహోరీ యుద్ధం జరిగిపోయే స్థితికి వచ్చేసింది.

జగదాంబ దాటి, రామ్‌నగర్ గవర్నర్ బంగళాదాటి బస్సు సిరిపురంవచ్చేసింది. ఆ స్టాప్ దగ్గర బండి ఆగుతూవుండగా-

'అంతా దిగండి. ఊ....తొందరగా దిగిపొండి, బస్సెలా కదులుతుందో చూస్తాను. పావలా ఇవ్వడమో చావడమో ఇవ్వాళ తేలిపోవాల లేకపోతే ఇక్కడి కిక్కడే బస్సు తుర తుర తగలడిపోద్ది.... దిగండి ముందు....' అంటూ ప్రళయంగా అరిచాడు ఓ వీరకిశోరం.

ఓ పదిమంది అతనితో దిగారు. బస్సు కడ్డంగా ప్రాణాలకు తెగించినట్లు నిలబడిపోయారు. డ్రైవరు ఇంజను ఆపివేశాడు

ఆ మూల బస్సులో కెవ్వున అరుపులు. ఏవేవో విరిగిపోతున్న ధ్వనులు. ఫెళఫెళార్భాటాలు. ఆలస్యమైపోతోందని ఇళ్ళదగ్గర తమకోసం ఎదురుచూస్తూ పిల్లలు ఏడుస్తూ వుంటారని మరోమూల కాకిగోల. అంతా ఎవరికివారు వాళ్ళకు తోచినట్టు, ప్రపంచం అంతా యుద్ధంలో మునిగిపోయినట్లు, బలంకొద్దీ బాంబులు విసురుతున్నారు.

ఇహ ఏమి జరుగుతుందో ఏమీ తెలియడంలేదు వాళ్ళ హడావుడి చూస్తూ వుంటే యూనివర్శిటీముందే బస్సును తగలేసేసేలా వున్నారు.

ఆ వీరావేశం ఎక్కడనుంచి ఎలా పుట్టుకొచ్చిందో! అందరిలోనూ కొంపలు మునిగిపోయే ఆవేశం పెరిగిపోయి రెచ్చిపోయి సివాలేస్తోంది.

ఉధృతంగా సైనికుల అరపులు. వికృతంగా మృగాల భరింపనలవికాని కూతలు బస్సును చుట్టుముట్టేశాయి.

ఆమె మళ్ళీ ఏమీ మాట్లాడలేదు. బిక్కచచ్చినట్టు ఊరుకుంది. కొడుకు చచ్చిపోయినప్పుడు ఇందిరాగాంధీలా బిగుసుకుపోయింది.

'దిగిపోదాం రండి వాడు డబ్బు లెక్కపెట్టడు. వీళ్ళు బస్సు తగలెట్టడం మానరు' అంది పక్కనున్న విధవరాలు.

'దిగిపోవాలా' అన్నట్టుగా లేచిందావిడ 'మరితప్పదా' అన్నట్టు బెంగటిల్లిపోయింది.

'పోనీలెండి....ఎందుకు ఓ పావలాకోసం యింత రభస' అనాలనికూడా అనలేకపోయింది. సుదీర్ఘంగా ఆలోచనలో పడిపోయినట్లుంది, వారసునికోసం దిగులుపడిపోతున్న ప్రధానిలా.

అప్పుడు ఆ పక్క క్రింద కూర్చున్న, బస్సులో నిలబడి దాని ఊపుకు తట్టుకోలేని ముసలివాడు ఆకారంలో బిచ్చగాడిలా వున్నవాడు 'ఎందుకమ్మా పావలా కోసం అలా చచ్చిపోతారు. ఇదిగో ఇక్కడుంది తీసుకోండి' అన్నాడు

అంతా చప్పున తుస్సుమనిపోయారు

'వెధవ యింతవరకు ఎందుకు చెప్పలేదు. వెక్కెయ్యాలనుకొని వుంటాడు' ఎవ్వరో పైకి అనేశారు.

ముసలివాడు 'నిజం నిలకడమీద కాని తెలియదు బాబూ ...' అని తనలో తాను గొణుక్కున్నట్లు అన్నాడు. ఆ మాట ఎవ్వరూ విన్నట్టులేదు. అల్లరి యింకా సద్దుమణగలేదు.

ఆ పావలా దొరక్కపోతే మాత్రం ఆవిడగారికోసం, ఆవిడను తృప్తిపరచడం కోసం ఆ బస్సు ప్రాణాలు తోడేసేవారు. కండక్టరును డ్రైవర్ను మళ్ళీ నీళ్ళు త్రాగనిచ్చేవారుకాదు.

ఇన్‌గేట్, అవుట్‌గేట్, పోలీసు స్టేషను, పిచ్చాసుపత్రిదాటి బస్సు ఉపవాత్తేరు చేరింది.

ఆమెతోపాటు ఆ ముసలివాడూ దిగాడు.

వంగి చేతికర్ర పుచ్చుకొని మెల్లగా దీనంగా అపనిందను మోస్తూ ఎవరివైపూ చూడకుండా 'అంతా చల్లగా ఇళ్ళకు చేరుకున్నారు....చాల్లే...' అని తనలో తాననుకున్నట్లు అనుకున్నాడు. ఈ మాట ఆవిడకు చేరనే చేరింది.

ఇంటికి పనిమనిషి తోడురాగా కదిలి, గబగబా బాత్‌రూమ్‌కు పోయి ఆ చీర జాకెట్టు, లంగా, బ్రా వూడదీసి ఓ మూలకు విసిరేసింది.

అప్పుడే టక్‌మని ఏదో ధ్వని—

రైళ్ళు గుద్దుకున్నట్టు. విమానం కూలిపోయినట్టు!

చూస్తే పావలా.

తను దిగంబరంగా వుంది.

షవర్‌లోంచి నీళ్ళు దేశప్రజల ప్రాణాలు తోడేసిన రాజ్‌నారాయణ్ దుశ్చేష్టల్లా ఒళ్ళంతా సర్‌సర్‌న ఎడతెరిపి లేకుండ ఆక్రమిస్తున్నాయి.

'పాపం కండక్టర్....' అనుకుంది.

దేశ నాయకుల అవకతవకలు చూడలేక కన్నుమూసిన జయప్రకాష్‌లా తల్లడిల్లిపోయింది.

జాకెట్‌కు, బ్రాకు మధ్య ఎలా పడిందో....!

ఇంతకీ ఆ మనిషి తన స్వంతడబ్బు దానంచేశాడా? అంత పేదవాడు.... అంత తెలివున్నట్టు కనబడనివాడు! వాడికి ఇంత గొప్ప ఆలోచన ఎలా పుట్టింది? ఆతను ఇవ్వకపోతే ఘోరాతిఘోరం జరిగిపోయేది. భగవంతుడిలా కాపాడాడు. నిజంగా అతను భగవంతుడు!

'అంతా చల్లగా ఇళ్ళకు చేరుకున్నారు....చాల్లే....'

ఆ మాటలు గుండెల్ని చిదిమేస్తున్నాయి.

ఉదయం తన భర్త ఒక పందరూపాయలు తక్కువ ఉన్నాయి. మరోసారి ఇస్తానంటున్నా, అయిదువందలకు తక్కువైతే పనిచెయ్యనని తిప్పికొట్టిన సంగతి ఆమెను కుళ్ళబొడిచేసింది. అందులో అది లంచం. ఈ నగలు, ఈ రవ్వల గాజులు, ఈ లోలకులు. ఈ బ్రా, ఈ జాకెట్టు అన్నీ ఆ లంచాల పాపతే! కాని తను పావలా దొరికింది అని అనలేకపోయింది.

ఈ చీర, ఈ దుస్తులు అన్నీ....అన్నీ దుర్గంధంతో నిండిపోతున్నట్లున్నాయి. ఓ పావలాయేగా అనుకోలేకపోయింది తను.

ఉదారబుద్ధి ఈ రక్తంలో ఏడ్చి చావలేదు.

ఈ దబ్బురూపంలో ఈ లోకంముందు ఎంత గొప్పగా ఆ క్షణంలో తను నిలిచిపోయింది.

ఎలాంటి వారికైనా ఓ రోజొంటుందట ! తను కుళ్ళి కుళ్ళి ఛస్తున్న రోజు యిది.

పాపం ఆ ముసలివాడు అంతటి ఉదారుడు, మానవత్వం రూపు దాల్చినవాడు నిందను నెత్తిని వేసుకొని వెళ్ళిపోయాడు.

ధనవంతులంటే ఈ ప్రజలకింత మోజేమిటో! ఒక్కరూ ఆ కండక్టరు తరుపున మాట్లాడలేదు. అందుకే అవిడను అలా కొలుస్తున్నారు ఇంతకన్నా ఘోరం మరొకటి వుండదు.

"అంతా చల్లగాళ్ళకు చేరుకున్నాడు. చాల్లే...." ఆ పేదవాని గుండెల్లో ఎలా పుట్టుకొచ్చింది ఆ దయాదేవత! మళ్ళీ మళ్ళీ ఆ మాటలే గుండెల్లో కలియ తిరుగుతున్నాయి.

ఆమె కళ్ళల్లో నీళ్ళు...కాదు....కాదు, పైనుంచి జారుతూన్న షవర్ కన్నీళ్ళు... పాపం.

ఇందాక పడమట అస్తమించిపోయిన ముసలి సూర్యుడు; అతగాడి ఓడిపోయి కమిలిపోయిన ముఖం, ఆమె కళ్ళముందు భయంకరంగా నిలిపి, ఆమె గుండెకాయను ఒలుచుకొని నోట కరచుకొని గెద్దలా మాయమైపోయాడు.

(భారతి, మార్చి 1981)

—శ్రీ రంధి సోమరాజు.

కుక్క పిల్ల

ఇరవై . యిరవైయైదు సంవత్సరాలు వెనక్కు వెళ్ళితే....

మా పొరుగు వారింట్లో ఓ కుక్క యీనింది. ఓ నాలుగైదు పిల్లల్ని పెట్టింది. వాటిల్లో తెలుపు, గోధుమరంగుమచ్చలున్న ఓమగపిల్లనుతెచ్చి మాకుపాలుతీసేనౌకరు రోజూ సాయంత్రం మా ఆవులదగ్గర పితికిన పాలను కొద్దిగాపోసి మళ్ళీ దాని స్థానంలో వదిలేసేవాడు. అలా, కొన్నిరోజులు జరిగాక దానికి బాగా నడిచే ఓపిక వచ్చింది. మా నౌకరు దాన్ని తీసుకురావలసిన అవసరం లేకుండానే పాలు తీసే వేళకు అదే వచ్చి పాలుతాగి వెళ్ళిపోయేది. అది కొన్నాళ్ళకు పాలుతాగి తన స్వస్థానానికి వెళ్ళటం మానేసి మా యింట్లోనే వుండిపోయింది ఇది పరిశీలించిన నాకు ఒక పెద్ద అనుభూతి. ఎన్నో కుక్కలు ఎక్కడెక్కడో యీనుతున్నాయి. వాటన్నిటికీ ఏదైనా ఆదరణ వుంటోందా? మరి ఈ కుక్కపిల్లకు ఏమిటీ ఆదరణ? ఎందుకీ అభిమానం? మనుషుల్లో అదృష్టవంతులున్నట్లే వీటికీ అదృష్టముంటుందనుకుంటా. ఈ కుక్కపిల్ల పధ్నాలుగు సంవత్సరాలు జీవించింది. మా యింట్లో ఓ కుటుంబ సభ్యునికింద మెలిగింది. మా యింటిని ఎంతగానో కావలా కాసింది. ఏదైనా మాకు మేమైపెడితే తప్ప, తనంతట తాను తినేదికాదు. మా యింటికి ఎవరుపడితే వారు రావటానికి భయం. మా నాన్నగారు మా అందరికన్నా ఎక్కువగా దాని ఆలనా పాలనా చూసేవారు. మా నాన్నగారు తనువు చాలించిన ఘడియనుండి ఆయనను దహన సంస్కారాలకు తీసుకువెళ్ళే వరకు ఆయన భౌతికకాయంవద్దే తల నేల కాన్చుకుని కదలక మెదలక మా యింటివారితోపాటు అది తన విషాదాన్ని మూగగా ప్రకటించింది. ఎంతో ఆశ్చర్యపడ్డారు చూసిన వారంతా. కుక్క విశ్వాసంగల జంతువు అనటంలో ఎంత నిజం వున్నది. నిజంగా అది జంతువుల్లో మనిషి.

కొన్నాళ్ళకు యీ కుక్క మరణించింది. అది చూపించిన గణనీయమైన విశ్వాస ప్రదర్శనవల్ల ప్రేమాదరాలతో దాన్ని కూడా మా నాన్నగారి సమాధి చెంతనే ఖననం చేయించాము. ఈ ఘటనలద్వారా నాకు కుక్కను పెంచాలనే మక్కువ ఎక్కువైంది. మరో కుక్కపిల్లను యిలానే మా పొలం ప్రక్కనే వున్న ఒక

ప్రభుత్వ వ్యవసాయ పరిశోధనా క్షేత్రం నుండి తెచ్చి పెంచుకున్నాం. అది యిప్పటికీ జీవించే వుంది. ఇది దెందులూరులో ఉన్నప్పటి సంగతి.

ఆ తర్వాత మేము ఏలూరు మకాం మార్చాము. ఓ పదిహేను సంవత్సరాల క్రితం నా అభిలాషకొద్దీ మరో కుక్క పిల్లను పెంచి నాతోపాటు మా ఏలూరు యింటికి తెచ్చుకున్నాను. నేను ఫాక్టరీకి వెళ్ళేటప్పుడు అది గ్రహించగలిగేది. నేను ఫాక్టరీకి వెడుతున్నట్లు మా యింటిగేటు తియ్యమని మొరుగుతూ తెలియజేసేది. తిరిగి నేను యింటికి వస్తున్నట్లు మా యింటి నందు మలుపులోనే గ్రహించి గేటు తీయమని ఎంతో శ్రద్ధ చేసేది. ఎవరు నేర్పారు దానికి అలా చేయమని? అదే నేర్చుకుంది. దానిది అంత సునిశితమైన జ్ఞానం. ఈ చర్యను మా యింటికి వచ్చే వారంతా ఎంతగానో శ్లాఘించేవారు. మా యింటికేకాదు, రాత్రివేళ మా ఇరుగు పొరుగువారికి కూడా అది చేసే శబ్దాలవల్ల యెంతో భద్రత వుండేది. ఇంతగా మా అభిమానాన్ని చూరగొన్నదానికి అనుకోకుండా కొన్ని విపరీతపు బుద్ధులొచ్చాయి. అప్పుడప్పుడు గొలుసు తెంచుకొని పారిపోయేది. ఊరకుక్కలు దానిని విపరీతంగా కరిచేవి. యాచకుడికి యాచకుడే శత్రువన్నట్లు ఒక ప్రాంతపు కుక్కలు మరొక ప్రాంతపు కుక్కలకు శత్రువులు కాబోలు! దీని పరిణామం అది తనకు ఆహారం పెట్టే కుర్రవాళ్ళను కరవటం మొదలు పెట్టింది. అలా చేసినప్పుడల్లా దాన్ని మందలింపుగా కొట్టటం కూడా జరిగేది. కాని దాని ప్రవృత్తిలో మార్పు రాలేదు. వీధిలోని వారు, ఇంటిలోని వారు అనే వివక్షత పోతోంది! అలా పోతే యీ కుక్క మనకెలా విశ్వాసపాత్రురాలు? ఇంట్లో పిల్లలున్నారు. వాళ్ళకేదైనా అపాయిత్యం జరిగితే? తెలిసి తెలిసి అపాయాన్ని ఆహ్వానించినట్లు కాదా! ఇలాంటి ఆలోచనలు నా మనస్సులో మెదిలాయి. ఎవరికైనా యిచ్చేద్దామని మా పిల్లలతో అన్నాను. "ఒద్దండీ. ఏదో చిరాకులో అలా కరవబోయి వుంటుంది. ఎవరికైనా యిస్తే యీ పోషణ లేక బాధ పెట్టిన వాళ్ళమౌతాం. ఏడేళ్ళు కలిసి మెలిసి వుంది" అన్నారు వాళ్ళు. ఈ సెంటిమెంటుపై, భూతదయను కాదనలేకపోయాను. అసలు మనిషేమిటి, జంతువేమిటి? వాటి మనఃప్రవృత్తుల్లో మార్పు రాకుండానే వుండాలి. రాని వచ్చిన తర్వాత మళ్ళీ మార్పు రావటం కష్టం. జూదం, వ్యభిచారం, దొంగతనం, త్రాగుడు లాంటి వ్యసనాలకు లోనైనవారు ఎంతవరకు సరిదిద్దబడుతున్నారు? అలాగే యీ పెంపుడు జంతువుల్లో కూడా మార్పు వస్తే అంతే బహుశా. మా కుక్క గొలుసు తెంచుకొని బయటకు పోయినప్పుడు, ఏ పందిపిల్లనో, కోడిపిల్లనో వేటాడి వుండాలి. అది వ్యసనమై తనకు

ఆర్థు కలిగినప్పుడల్లా చిరాకుతో ఆహారంపెట్టేపనివాళ్ళనే కరుస్తూండేదట. మనిషిలో ఏం చేస్తే సరిదిద్దటానికి కొన్ని చట్టాలున్నాయి. కాని యీ జంతువులకు పెంచేవారే చట్టాలూ, న్యాయనిర్ణేతలు కూడ. ఒకరోజు అలవాటు ప్రకారం మళ్ళ బైటికిపోయి వీధిలో ఎవరి కోడినో చంపి నిర్భయంగా మా యింటికే పట్టుకొచ్చింది. గొలుసు పెట్టటానికి పనివాళ్ళే భయపడ్డారు. వాళ్ళేకాదు యింట్లో వాళ్ళంతా భయపడ్డారు. నేను ఫాక్టరీనుంచి వెళ్ళేటప్పటికి మామూలుగా వినిపించవలసినవాని సాంకేతికం వినిపించలేదు. కుర్రవాడు గేటు తియ్యటానికి భయపడి లోపలినుండే జరిగినదంతా చెప్పాడు. కారు బజారులోనే ఆపి లోపలకు వెళ్ళాను. నిర్భయంగా, నిర్లక్ష్యంగా చంపిన కోడిని ముందు పెట్టుకొని కనిపించింది.

నేనూ భయపడ్డాను. మిల్లుకు ఫోను చేశాను. మా అబ్బాయి వచ్చాడు. వాడికో సాంకేతికం వుంది. దాని ప్రకారం స్కూటరును స్టార్టుచేశాడు. స్కూటరు శబ్దానికి అది యెక్కడున్నా తన గొలుసు వున్న చోటుకు వస్తుందట. అలాగే వచ్చింది. వెళ్ళి గొలుసు పెట్టాడు. ఇవతలికొస్తుండగా కాలు పట్టుకుంది. బహుశా ఆ కోడిని తీసేస్తామేమోనని దానికి అక్కసు అయ్యుండవచ్చు. దాన్ని మేమిద్దరం కలిసి కూడ తీసి వెయ్యటానికి భయపడ్డాము మరో ఆలోచన లేకుండా మునిసిపాలిటీవారికి కబురు పెట్టాం తక్షణం కుక్కను అక్కడ నుంచి తొలగించవలసిందిగా. మునిసిపాలిటీవాళ్ళు వచ్చి దాన్ని తొలగించేలోగా యెన్నెన్నో ఆలోచనలు. ఎంతో మానసిక వ్యధ. ఎక్కడో ఒక వూరి మున్సబు గారింట్లో ఒక మంచి జాతికుక్క. అది యింటివారి అల్లుడినే చంపేసింది కూతురుకు వైధవ్యం ప్రాప్తించింది.

ఈ పరిణామానికి తట్టుకోలేని ఆ యజమాని ఆ కుక్కను కాల్చి చంపాడు. ఆ కుక్క ఎంతో విశ్వాసమైన యింటికావలా జంతువని ఆ వూరందరికి తెలిసినట్లే కొత్తగావచ్చిన యింటి అల్లుడికి తెలుసు. తెలిసి కూడా బయటికి వెళ్ళాల్సిన అవసరం వచ్చినప్పుడు యింటివారిని లేపటానికి రాత్రివేళ మొహమాట పడ్డాడు పర్యవసానం? ఆ కుక్క నిజాయితీకి బలైంది. ఇక్కడ ఎవరిది లోపం? యజమాని అనే చట్టం ఏం చేసింది? చేసింది న్యాయమా?

మరో యింట్లో అల్లారుముద్దుగా కన్నబిడ్డలకన్నా తమతోపాటు చల్లని గదులలో పడుకోబెట్టుకొని, తమతోపాటు పౌడర్లు స్నో, సుగంధ వస్తువులు పూసి తమతో పాటు పార్టీలకు తీసుకువెళ్ళే ఓ కుక్క పిల్లకు దురదృష్టవశాత్తూ నివారణ యోగ్యం

కాని ఒక చీదరవనితే, కుష్ఠురోగిని కన్నవాళ్ళూ, అల్లుళ్ళనవాళ్ళూ సహజంగా త్యజించేటట్లే వాళ్ళూ త్యజించారు.

దగ్గరకు తీయ్యరు, పాలు పోయ్యరు కనీసం వున్నచోటుకు కూడా రానియ్యరు. ఉసూరుమంటూ ఆ భయంకర వ్యాధితో, నోమమన్న ఆప్యాయతకు దూరమై ఆ కుక్క పడేబాధ వర్ణనాతీతం! దీనికి అర్థం ఏముంటుంది? దాని బాధ చూడలేక, దగ్గరకు చేర్చుకోలేక, మనిషికీ మనిషికీ వున్న సెంటిమెంటు వారికీ వారి పెంపుడు కుక్కకూ వర్తింప చేసుకుని బాధపడటం. వ్యాధికి నివారణోపాయంలేదని మనకు అయినవారిని సానుభూతితో మరణింపజేస్తున్నామా? (A Mercy Killing) అలాగే జంతువులపట్ల కూడా. మనసున్న మనిషికి ఒక్కొక్కప్పుడు యిలాంటి చిన్న సమస్యలు కూడ ఎంతో కఠోరమైన సమస్యలౌతాయి.

మా మిల్లులో ఒక కుక్క వుంది. నాలుగైదు పిల్లల సంతానం. పెరిగి పెద్దవైనాయి. మా మిల్లుకు సమాంతరంగా రైలురోడ్డు రోడ్డు వుంటాయి. ఒకరోజు అవి రోడ్డుమీదకు వెళ్ళాయి. రైలు, కార్లు సమాంతరంగా ప్రయాణిస్తున్నాయి. ఒక కారు క్రింద ఓ కుక్క పడి చనిపోయింది. వాటికి దేనివల్ల ఆ కుక్క చనిపోయిందో తెలియదు. అప్పటినుంచి రైలు వెళ్తున్నా, కారు వెళ్తున్నా కొంతదూరం తరిమేవి. ఆ ప్రయత్నంలో అన్నీ రోడ్డు ప్రమాదాలకు బలైపోయాయి. దాని తరువాత సంతతికి కూడా అవే లక్షణాలు. అవీ అలా తరుముతూ బలైపోతున్నాయి. ఎంత వింత! ప్రతీకార ధోరణో ఏమో! ఆలోచనలేని వాటి చేష్టలను అరికట్టటానికి ఎంతో కష్టపడుతున్నారు మా మిల్లులోని వాళ్ళంతా.

ఊరంతా కుక్కలు. ఎక్కడో తింటున్నాయి. ఎలాగో బ్రతుకుతున్నాయి. మధ్య మధ్య కొన్నిటికి మతిచలిస్తోంది. అనవసరంగా దారినపోయే బాటసారులను కరుస్తున్నాయి. కొంతమంది చనిపోతున్నారు. సాంఘిక భద్రత దృష్ట్యా పారిశుధ్య కార్యకర్తలప్పుడు యీ వూరకుక్కల బెడదనుంచి సాంఘిక భద్రత కొరకై పట్టి బంధించి దయాదాక్షిణ్యాలు లేకుండా సైనోగ్యాస్‌ను వాటి మీదకు పంపించి చంపేస్తున్నారు. ఏది న్యాయం? ఎవరిమీదా ఆధారపడక, ప్రకృతిజీవులై బ్రతికే ఊరకుక్కల్ని మనుష్యుల మాదిరే వాటిల్లో కొన్నిటికి మతి చలింపువచ్చి అఘాయిత్యపు పనులు సంఘానికి తలపెడితే అందుకోసం అదుపులోలేని ఆ జాతినంతా నిర్మూలింపటం విచక్షణా రాహిత్యంగా న్యాయమా? మరి ఎంతో క్రమశిక్షణకు, కట్టుబాట్లకు, అను

పొజ్జలకు లోనై జీవించే మానవాళిలోనే అనేక కారణాల మూలంగా అఘాయిత్యాలు జరుగుతున్నప్పుడు, ఈ హద్దూ అదుపూ లేని యీ కుక్కల్లో వివక్షత చూపించటం సాధ్యపడే విషయం కాదు. కనుకనే మూకుమ్మడి నిర్మూలన ప్రయత్నం.

కుక్క, గొర్రె, పిల్లి, పందిలాంటి జంతువుల సంతానం చాలా యెక్కువ. వాటిని ఏదో ఒక రూపంలో నిర్మూలించకపోతే జీవరాసులలో మిన్న అయిన మనిషి మనుగడకే అది ప్రమాదమని ఒక శాస్త్రవేత్త ఉవాచ.

మరి, మా యింట్లోని యీ కుక్క అదుపు-ఆజ్ఞా లాంటి క్రమశిక్షణతో పెరిగిందే! మరి దీనికేమిటీ వైపరీత్యం? మనుష్యులందరూ మనుష్యులు కానట్లే కుక్కలన్నీ విశ్వాస జంతువులు కావు. మనుష్యుల్లో అంతర్గత లక్షణాలున్నట్లే వీటిల్లో కూడ వుంటాయన్నమాట. లేకపోతే ఏడు సంవత్సరాలుగా మా ఆదరణపై ఆధారపడి యున్న యీ కుక్కకు "యజమాని" అనే గుర్తింపే లేకుండా ఎట్లా పోతుంది? కనీసం మాలాంటి వాళ్ళల్లో విపరీతపు బుద్ధులున్నా 'యజమాని' అనే గుర్తింపు చోటు చేసుకుంటుంది. దీనికి అదీ లేదు. దీనినెవరికో పెంపుడు కుక్కగా యిచ్చివెయ్యటమా? 'పెంపకం' అనే చట్టరీత్యా దీన్ని అంతమొందించటమా? ఏది కర్తవ్యం? తప్పు చేసిన మనిషి దిద్దుకోటానికి అవకాశాలుంటాయని పశ్చాత్తాపం కోసం శిక్షించి వదిలేస్తున్నారు.

అయినా చాలా సందర్భాల్లో పశ్చాత్తాపానికి బదులు పంతం పెరిగి, పట్టుదల చోటు చేసుకొని ప్రతీకారభావం పరాకాష్ఠ నందుకుంటోంది. మరి జంతు కూటమికి చెందిన యీ కుక్కలో యీ భావ పరిణామానికి తావెక్కడ? భూతదయ, పెంపకపు జాలితో, హంతకలక్షణాలతో మితిమీరిన యీ కుక్కను పెంపుడు కుక్కగా ఎవరికైనా యిస్తే పెంపకానికి ప్రత్యుపకారంగా వాళ్ళని యిబ్బందుల పాలుచేస్తే? అప్పుడు నా జాలికీ, భూతదయకూ వెర్రి బలికావటమన్నమాట)

ఒక జంతువు మూలంగా తనకున్న ప్రమాదం యితరులకు కూడా అదే జంతువువల్ల ఎందుకుండగూడదు? ఈ కుక్కలో వచ్చిన మార్పును బట్టి, ప్రవర్తనను బట్టి, ప్రయోజనాన్నిబట్టి ఏంచెయ్యాలో నిర్ణయించటం కోసం యింత మథన పడుతున్నానే! మరి సాంఘిక భద్రతకోసం చట్టరీత్యా మానవులలోని దోషుల శిక్షించటానికి పూర్వాపరాలు ఆలోచించి సునిశితమైన మనసుగల ఆ న్యాయ నిర్ణేతలు ఎంత

మధన పడతారో! అక్కడ దోషులు కానివారిని శిక్షించగూడదు. దుష్టత్వానికి దారితీసిన సంఘటనలే ఆలోచనలకు ఆధారభూతాలు.

ఇక్కడ ఆలోచనలేని ఒక జంతువు. అందునా సాధువని భ్రమపడి ఆదరించిన ఆ కుక్కలో క్రూరపు లక్షణాలు ప్రస్ఫుటంగా కన్పిస్తుంటే దీనికిక పెంపకం, జాలి అడ్డు గోడలుగా నిలువకూడదు. సాంఘిక భద్రతకోసం అంతమొందించుట ఒక్కటే శరణ్యం. ఇలా నిర్ణయానికి వచ్చేలోగా మున్సిపాలిటీవారు కుక్కల్ని పట్టి బంధించే వాళ్ళని పంపారు. అలాంటి పనుల పట్ల అలవాటున్న వారే దాన్ని బంధించటానికి భయపడ్డారు. యుక్తి, శక్తి, చొరవ దాన్ని బంధించి తీసుకెళ్ళాయి. తీసుకెళ్ళేముందు పశు వైద్యశాఖ వారికికూడా చూపించటం జరిగింది. (ఇదంతా ఎందుకంటే అదుపులో పెట్టగలిగి అంతమొందించట మౌతుందేమోనని).

వారు కూడా చాలా దూరంలోనే వుండి పరిశీలన చేసి, దాని కళ్ళల్లో పసుపు వర్ణపు ఛాయలు వచ్చాయనీ, అవి వచ్చాక దానికి తారతమ్యపు శక్తి నశిస్తుందనీ, దీనికి మందు లేదనీ, అంతమొందించటం ఒక్కటే వుత్తమమని చెప్పారు. ఇక్కడ సానుభూతితో చంపించటం కన్నా సంఘ శ్రేయస్సు చోటుచేసుకుంటోంది. బంధించిన ఆ కుక్కను వాళ్ళు తీసుకెడుతూంటే ఉరిశిక్ష తీర్పుకు లోనైన ముద్దాయి ఉరికంబ మెక్కేముందు ఎలా వుంటాడో నా కళ్ళకు కట్టినట్లు కనిపించింది. విధి నిర్వహణే ప్రధానమనుకుని సరిపెట్టుకున్నాను. ఆ రాత్రి మా యింట్లో ఎవరూ భోజనాలు చెయ్యలేదు. ఇంటిలో సభ్యుని కోల్పోయినట్లే బాధపడ్డాం. రెండోరోజు వుదయం కుక్కను తీసుకు వెళ్ళిన వాళ్ళు పట్టి గొలుసుతో మా యింటికి వచ్చారు గొలుసు యిచ్చెయ్యటం కోసం.

మా మనుమరాళ్ళు (తెలిసీ తెలియని వయస్సు వాళ్ళు) "కుక్కేది తాతా?" అన్నారు. "వచ్చిపోయిందమ్మా" అన్నాను. (కాని చంపబడింది) అంతే మాత్రం వాళ్ళకి తెలుస్తుందా? "మళ్ళీ ఓ కుక్కపిల్లను తే తాతా" అన్నారు. అది లేనిలోటు వాళ్ళకి కలిగిందన్నమాట మరి నాకు? సందర్భా సందర్భాలనుబట్టి నే చెప్పకుండానే గేటు తియ్యమని చెప్పే బాధ్యత యింకెవరిది? (దెందులూరులో పద్నాలుగు సంవత్సరాలు పైగా ఒకటాని తరువాత ఒకటి జీవించి జీవిస్తున్నాయి మరి యిక్కడ? ఈ కుక్కకు కూడా అదే పెంపకం కదా. నిజంగా దాని మనః ప్రవృత్తిలో మార్పా? పెంపకంలో లోపమా) పెంపకంలో లోపమైతే దోషం దానిది కాదుకదా.

"మానవుడు హంతకుడుగా పుట్టలేదు. పరిసర ప్రభావాలే హంతకుడిగా మార్చాయి" అన్న ఆర్యోక్తి నిజమా? ఇలా పరిపరి విధాలుగా లోలోపల మథన పడింతర్వాత క్రమంగా ఆ కుక్క నా స్మృతిపథం నుండి తొలగించి కుక్కల పెంపకం పట్ల విరక్తి కలిగింది. మా మనుమరాళ్ళు "తాతా! కుక్కపిల్లే?" అని పదే పదే అడగటంతో, మా మిల్లులో యీనిన ఓ కుక్కపిల్లను మా అబ్బాయి పట్టుకొచ్చాడు అది ఎంతో బొద్దుగా, ముద్దుగా వుండి వెనకటి విరక్తిని తొలగించింది. క్రమంగా వయసు వస్తోంది. దాని చేష్టలు దాని ముందు కుక్కను గుర్తుతెస్తున్నాయి. అదే చూపు. అదే కొంటెతనం. అదే సంగనాచితనం. వివక్షతలేని విజృంభణ. ఏమిటిది? అంతా దాని లక్షణాలే. దాని సంతానం కానేకాదు ఎక్కడో ఏదో జాతికి చెందిన మరోపిల్ల. పగ సాధించటానికి యీ రూపంలో రాలేదు కదా? ఏమో! ఇలా ఆలోచన కలిగినప్పుడల్లా దాన్ని చంపించిన నాటి భయంకర రూపం నా కళ్ళకు కట్టినట్లు కనిపించింది. ఏదో మానసిక సంక్షోభం! ఎంతో ఆరాట పడేవాణ్ణి

ఈ కొత్త కుక్కపిల్ల పెరుగుతుండటంతో నాలో కూడా ఆరాటం పెరగనారంభించింది. మా పిల్లలు లేకపోతే స్థలమార్పిడి కష్టసాధ్యమయ్యేది వయస్సు ఐదారు మాసాలే అయినా. ఒకరోజు వర్షం పడుతోంది వర్షంలో తడుస్తూ అరుస్తోంది. ఆ అరుపులకు చికాకుపడి స్థలమార్పిడి చేసే ప్రయత్నంలో దాని చేష్టలకు కోపోద్రిక్తుడనై దాన్ని విపరీతంగా కొట్టాను. మళ్ళీ ఆలోచనలో పడ్డాను. ఎక్కడో పుట్టిదాన్ని తేవటమెందుకు? తెచ్చి, పెంచే నేర్పులేనప్పుడు దాన్ని బాధించి హింసించటం దేనికి? ఎంత మనవరాళ్ళకు ముద్దయినా యింటికి కావలా అనుకున్నా. మన ఆవేశపు చర్య సమంజసమా? అసలు యీ చిన్న కుక్కపిల్ల యిప్పటినుంచే నాలో యింత ఆలోచన రేపుతోందే మనశ్శాంతి లేకుండా చేస్తోందే. అసలెందుకింత బాధ అది లేకపోతే యేం? మనసుండటమే నేరమేమో. "మనసున్న వాడికి సుఖములేదన్నా" అన్న ఆచార్య ఆత్రేయ ఒక పాటలోని పదానికి ఎంత అర్థముంది?

ఇలాంటి మానసిక వ్యథను తట్టుకోలేక దాని పెంపకం లోపాన్ని నాకే ఆపాదించుకుని దాన్ని మా మిల్లులో పనిచేసే ఓ కుర్రాడికిచ్చేశాను. అది అక్కడ నా యింటి దగ్గరున్న పోషణ లేకపోయినా, ఏ హడావిడీ ఆర్భాటం లేకుండా సక్రమంగా పెరుగుతోందట. నా మనుమరాళ్ళు ఎప్పుడైనా మిల్లుకు వస్తే, వెళ్ళి దాన్ని చూసొస్తుం

టారు. ఏమిటీ అనుబంధం? ఏమో! అది మమతా మమకారాల సత్యస్వరూపం కావచ్చు నాకు మాత్రం యెందుకో జాలితో కూడిన ఏవగింపు.

ఒక కుక్కపిల్లతో ప్రారంభమైన ఒక రకమైన అనుభూతి, మరో కుక్కపిల్ల ప్రవర్తనతో మరో రకమైన అనుభూతితో ముగిసింది. (ఐతే. కావాలని తెచ్చి పెంచుకునే పెంపుడు జంతువు విషయంలో యింత మానసిక వైవిధ్యం యెందుకు? అది ఆ యింటి పెంపకంతో ఆయింటి సభ్యురాలై పోతోంది దానికి భాషలేక పోవచ్చు. భావం లేకపోవచ్చు. ఆయింటి బాధ్యతలలో కొన్నిటని నెరవేర్చేదిగా బాధ్యత ఒప్పగించబడుతోంది. మరి కుటుంబ సభ్యులందరూ తలో బాధ్యతా తీసుకునే వారే తీసుకున్న బాధ్యతలన్నీ సక్రమంగా నెరవేర్చబడుతున్నాయా అన్ని చోట్ల? కానప్పుడు యీ పెంపుడు జంతువుల్లాగా బహిష్కరిస్తున్నామా? "పెద్దలలోపాలు పిల్లలకు నరకాలు" అని మన మెన్నో సందర్భాలలో గ్రహించాం. అలాగే పెంపకపు లోపాలు పెంపుడు జంతువులకూ నరకాలే. తప్పని సరి వాటితో పడే యీతి బాధలకు మించి మళ్ళీ యిలా. ఈరకంగా కొన్ని బాధలు కొని తెచ్చుకోవటం దేనికి? కూడని అలవాటు. ఈ అంతిమ నిర్ణయం పెంపుడు జంతువులకూ నాకూ ఇహ కూడనిపని అని వివేకోదయాన్ని కలిగించింది. ఉపశమనాన్ని పొందుతున్నా. ఒక కుక్కపిల్ల నాలో యింత వైవిధ్యపు టాలోచనలు కలగజేసిందంటే అది కుక్కపిల్ల మూలానా?) ఇంతటి విభిన్న ఆలోచనలు కలగటానికి ఓ కుక్క పిల్ల కేవలం కారణ భూతురాలు.

ఇదంతా నామనస్సులోని రకరకాల ఆలోచనల తరంగాలు. మరి యిలాంటి మనస్సు కలిగిన వాడికి సుఖం వుంటుందంటారా —

—కొడాలి వెంకటేశ్వరరావు

యమ్. యన్. రాయ్, విప్లవ నేత-తత్త్వ వేత్త

భారత స్వాతంత్ర్యోద్యమం విభిన్న దృక్పథాలు గల చిన్న పెద్ద పెక్కు జాతి రత్నాలను సృష్టించినది. అందులో యమ్ యన్. రాయ్ ఒక అమూల్యమైన మేలిరత్నం, భారత రాజకీయాలలో నేగాక, ప్రపంచ రాజకీయాలలో కూడ తన అనన్య ప్రతిభా సంపత్తులచే ఒక మహోదిట్టగా, నాయకునిగా, విప్లవ వీరునిగా. తత్త్వ శాస్త్రజ్ఞునిగా విరాజిల్లి మన్ననలు పొందిన మహా మేధావి ఆయనకు ఆయనే సాటి. ఇన్ని గుణాలు ఒకే వ్యక్తిలో మూర్తీభవించటం చరిత్రలో చాల అరుదుగా కనబడుతుంది,

చరిత్ర ప్రసిద్ధి కెక్కిన స్త్రీ, పురుషులందరూ ఉత్తమ జీవులు. మార్గదర్శకులు కారు అలాగే ఉన్నత శిఖరం అధిష్టించిన ప్రతి నాయకుడూ ఉన్నత భావాలకు ప్రతిబింబం కాజాలడు. కొందరు ఉదారవాదులు, స్వేచ్ఛా ప్రియులు. విప్లవ వీరులు, మానవ వాదులు. మహాత్ములుగా, మరి కొందరు ఉగ్రవాదులు, నిరంకుశులు, నియంతలు. మహాక్రూరులుగా చరిత్రలో నిలిచిపోయారు. కొందరు కీర్తికి మరికొందరు అపకీర్తికి తార్కాణం మహానాయకులలో మానవ మిత్రులు. శత్రువులు కూడా ఉన్నారు. కనుక ఒక మహా నాయకుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొనే ముందు వారి జీవిత చరిత్రను వివిధ కోణాల నుండి సహేతుకమైన విమర్శనా దృష్టితో పరిశీలించి వాస్తవాలను వెలికి తీయటానికి ప్రయత్నించాలి జీవిత చరిత్ర అంటే దైనందిన జీవిత చర్యలు మాత్రమేకాదు. సమాజ సంక్షేమం. మానవాభ్యుదయం కొరకు ఆ వ్యక్తి అనుసరించిన మార్గం, భావాలు. ఉపదేశాలు,సిద్ధాంతాలు, కార్యాచరణ ఆదిగా గల అన్నింటినీ పరిశీలించాలి

ఈ దృష్టితో రాయ్ జీవిత చరిత్రను, విప్లవ గాథలను, తాత్త్విక సిద్ధాంతాలను యీ చిన్న వ్యాసంలో విపులీకరించటం సాధ్యపడదు కనుక అతి ముఖ్యమైన కొన్ని సంఘటనలు క్లుప్తంగా పొందుపరచటం జరిగినది. (ఆసక్తి గల పాఠకులు నేను రచించిన "యమ్. యన్ రాయ్ జీవితం సిద్ధాంతం" అనే గ్రంథాన్ని పఠించ ప్రార్థన)

ప్రముఖ చరిత్రకారుడు జాన్ గంథర్ తన బృహద్గ్రంథమయిన "ఆసియా ఖండంలో" (ఇన్‌సైడ్ ఏషియా) రాయ్‌ని గురించి వ్రాస్తూ "మూడు ప్రధాన విప్లవాల్లో ప్రధాన పాత్ర వహించిన ప్రముఖ విప్లవకారుడు" అని వర్ణించాడు. ఇందులో మొదటిది మెక్సికో; రెండవది రష్యా; మూడవది చైనా. ఈ గ్రంథం వెలువడినది 1930లో. కనుక ఆ తరువాత తన మాతృదేశంలో రాయ్ నిర్వహించిన పాత్ర ఇందులో ఉటంకించబడలేదు రాయ్ ఆయుధ సహాయానికై విదేశాలకు బయలుదేరకముందు స్వదేశంలో నిర్వహించిన "రహస్య విప్లవ కార్యక్రమాలు" కూడ జాన్ గంథర్‌కు తెలిసి వుండవు. ఆఫ్రికా, ఆస్ట్రేలియా మినహాయించి మిగిలిన మూడు ఖండాలలో రాయ్ కార్యక్రమాలు విస్తరించినవి.

గత శతాబ్ది చివరి భాగంలో ఉగ్రవాద రాజకీయాలకు రహస్య విప్లవ కార్యక్రమాలకు వంగ రాష్ట్రం కేంద్రస్థానంగా చరిత్ర ప్రసిద్ధి కెక్కినది. కలకత్తా నగరం బ్రిటిషు వారి మొదటి రాజధాని కావటం చేత ఇంగ్లీషు భాష, పాశ్చాత్య సంస్కృతి, సంప్రదాయాలచే ప్రభావితులయిన కొందరు విద్యావంతులు సంఘ సంస్కరణలకు ప్రయత్నించినా ఆశించిన ఫలితాలు రానందున వేడి రక్తం గల యువకులు అనేక మంది "హింసా ప్రవృత్తిని హింసతోనే రూపుమాపాలి" అనే దృఢ సంకల్పంతో రహస్య విప్లవ సంఘాలను స్థాపించి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలను ప్రారంభించారు

ఈ రహస్య సంఘాలలో చేరటం అంత సులువైన పని కాదు. ఎన్నో తీవ్ర పరీక్షలను తట్టుకొని అందులో ప్రథమశ్రేణికి రాగలిగిన వారే సంఘసభ్యులు కావటానికి అర్హులు. తన పద్నాల్గవ యేటనే, విద్యార్థి దశలో స్వాతంత్ర్యేచ్ఛతో ఉత్తేజితుడయిన రాయ్, సంఘ నాయకుల కఠోర పరీక్షలో "సెబాస్" అనిపించుకొని సాధారణ సభ్యుని అర్హత పొందిన అనతి కాలంలోనే ఎన్నో అలవికాని కార్యాలను సాధించి ప్రముఖ నాయకుడు కాగలిగాడు.

విప్లవకారుల సమీకరణ, బాంబుల నిర్మాణం, తుపాకుల కొరకు పోలీసు స్టేషనులపై దాడులు, నిధులకై దోపిడీలు, సైనికాధికారులపై ప్రతీకార చర్యలు ఆనాటి విప్లవ సంఘాల ముఖ్య పథకాలు. రాయ్ ఏదో ఒక కార్యానికి పరిమితం కాకుండా అన్నింటా ముందు భాగంలో వుండి తోటి విప్లవకారుల మన్ననలు పొందాడు.

విప్లవ చర్యలను అణచటానికి ప్రభుత్వం అనేక మందిని నిర్బంధించి చిత్రహింసలకు గురి చేయటం, ప్రాణాలను బలి గొనటంతో నిరాశా నిస్పృహలకు లోనై, చిందర వందరగా అరణ్య ప్రదేశాలలో రహస్య జీవితం గడుపుతున్న విప్లవకారులతో రహస్య సంబంధాలు పెట్టుకొని వారిలో నూతనోత్సాహం కలిగించటానికి రాయ్ ఎంతో కృషి చేశాడు. రాయ్ కూడా అనేక సార్లు నిర్బంధించబడినా ఎంతో చాకచక్యంతో తప్పించుకుంటూ, మారువేషాలతో, మారుపేర్లతో తన విప్లవ చర్యలను సాగిస్తూనే వచ్చాడు. "లక్ష్యం మంచిదయినప్పుడు సాధనలెట్టి వయినా న్యాయ సమ్మతం" అని అప్పటివారి దృఢవిశ్వాసం.

1914 ఆగస్టులో ప్రథమ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనది. "శత్రువు శత్రువు మిత్రుడు" అనే భ్రమ విప్లవకారులలో జనించినది. కలకత్తా నగరంలోని జర్మను కాన్సలు ద్వారా ఆయుధ సామగ్రిని పొందటానికి రాయ్ రహస్యమంతనాలు జరిపాడు. ఈ ప్రయత్నం ఆశాజనకంగా కనబడటంతో 1915 ఫిబ్రవరిలో సాయుధ తిరుగుబాటుకు పథకం రూపొందించబడినది కాని రాస్ బిహారితో చేతులు కలిపి విప్లవ వాదిగా నటించిన ఒక గూఢచారి ద్వారా ప్రభుత్వం యీ పథకాన్ని ముందే తెలుసుకోవటం వలన యిది భగ్నమైనది. బటేవియా (ఇప్పటి ఇండోనేషియా)లోని జర్మని రాయబారిని కలుసుకొని నౌకల ద్వారా ఆయుధ సామగ్రిని చేరవేయటానికి రాయ్ మరో ప్రయత్నం కూడా చేశాడు. అది కూడా విఫలమైనది. చివరకు భారతదేశ ఈశాన్య ప్రాంతమయిన సీమా ద్వారా ఆయుధాలు చేర్చే ప్రయత్నంకూడా సఫలీకృతం కాకపోవటంతో సరాసరి జర్మనీ ప్రభుత్వంతోనే ముఖాముఖి చర్చలు జరపటానికి జర్మనీ దేశం ప్రయాణం కట్టాడు. తన మొదటి ప్రయాణంలో రాయ్ సయాం, మలయా, జావా, సుమిత్రా మొదలైన అనేక దేశాలలో ప్రవాస జీవితం అనుభవిస్తున్న భారత విప్లవకారులను కలుసుకొని వారి గతచరిత్రను అనుభవాలను తెలుసుకొనగలిగాడు.

రాయ్ జర్మనీ ప్రయాణం అతి సాహసోపేతం, అద్భుతం. చేతిలో బైబిలు: క్రైస్తవ మతాచార్యునిగా ఉన్నత విద్యకై ప్యారిస్ వెళ్లుతున్నట్లు నటించాడు యుద్ధంలో జపాను కూడ ఇంగ్లండుతో కలిసి వున్నందున పోలీసులు గూఢచారుల నిఘాలకు ఎత్తులు వేస్తూ రాయ్ ఆగ్నేసియా దేశాలు, చైనా, కొరియా, జపాను దేశాలను అధిగమించి నౌక ద్వారా అమెరికా ప్రయాణం కట్టాడు. చివరకు నౌకలో కూడా రాయ్ అనేక బాధలను ఎదుర్కొనవలసి వచ్చినది.

రాయ్ జర్మనీ ప్రయాణం అమెరికాతో ఆగిపోవటం ఆయన జీవితంలో ఒక పెద్ద మార్పును తెచ్చినది. నూతన ప్రపంచం తనకు నూతన జీవితాన్నిచ్చినట్లు రాయ్ తన స్వీయ చరిత్రలో వర్ణిస్తాడు. రాయ్‌కి తన తల్లిదండ్రులు పెట్టిన పేరు నరేంద్రనాథ్ భట్టాచార్య. అమెరికా మిత్రులు దానిని మార్చి మానవేంద్రనాథ్ రాయ్‌గా నామకరణం చేశారు. చివరకు ఆ నామమే స్థిరపడి పోయినది.

అమెరికాలో వున్న కొద్ది కాలంలోనే రాయ్ అచ్చటి భారత విప్లవకారులతో బాటు స్థానికులైన అనేక మంచి సోషలిస్టుల పరిచయంకూడా చేసుకొన గలిగాడు. సోషలిజం, కమ్యూనిజం, మార్క్సిజం గురించి లోతుగా అధ్యయనం చేశాడు. జాతీయ, అంతర్జాతీయ వాదాల మధ్య ఉన్న అంతరాలను నిశితంగా పరిశీలించటానికి మంచి అవకాశం లభించినది.

అమెరికాకూడా ఇంగ్లండు పక్షాన యుద్ధంలో చేరటంతో అచ్చట అంతవరకు బాహాటంగా తిరుగుచున్న ప్రవాస భారత విప్లవకారులు అనేక నిర్బంధాలకు గురికావలసి వచ్చినది చట్ట వ్యతిరేకంగా అమెరికాలో ప్రవేశించిన వారిని పోలీసులు అదుపులోనికి తీసుకొన ప్రారంభించారు. రాయ్ కూడా ఈ నిర్బంధానికి గురికావలసి వచ్చినది. అయితే బెయిలుపై విడుదలయిన రాయ్ ఆ అవకాశాన్ని ఆధారంగా తీసుకొని జర్మనీ వెళ్ళటం అసాధ్యం కావటంచేత ఆ ప్రయత్నం విరమించుకొని రహస్యంగా పోలీసుల కనుగప్పి ప్రక్కనున్న మెక్సికో చేరుకున్నాడు.

అమెరికా నూతన జీవితానికి అంకురార్పణంగా భావించిన రాయ్ మెక్సికోను తన రెండవ జన్మ భూమిగా వర్ణించుచున్నాడు. అమెరికాలో తాను పొందిన సోషలిస్టు భావాలను మెక్సికోలో కార్యరూపంలో పెట్టటానికి రాయ్‌కి తగిన అవకాశం లభించినది.

దశాబ్దాల తరబడి స్పెయిన్ వలసరాజ్యంగా వున్న మెక్సికో స్వతంత్ర దేశమయినా ఆర్థికంగా నలిగి, అంతర్గత పోరాటాలతో, అరాచకం ప్రబలటంతో వాటిని ఆధారంగా తీసుకొని అమెరికా మెక్సికోతోబాటు మిగిలిన లాటిన్ అమెరికన్ దేశాలపై ఆధిపత్యం సంపాదించటానికి ప్రయత్నాలు సాగించినది. ఇట్టి తరుణంలో రాయ్ మెక్సికో ప్రవేశించాడు. అచ్చటి సోషలిస్టులు, అనార్కో-సిండికలిస్టులు, అభ్యుదయ వాదులను సమీకరించి అమెరికన్ సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తిగా రూపొందించటానికి విశేష కృషి జరిపి ఆశించిన ఫలితాలు సాధించ గలిగాడు.

శ్రామిక వర్గాలను కూడా గట్టి అధికారవక్షానికి అందగా నిలిపి ప్రభుత్వపరంగా ప్రశంసా పత్రాలను పొందగలిగాడు.

1918 డిశంబరులో, ప్రభుత్వ ధనసహాయంతో, కార్మిక వర్గాల సహకారంతో ఏపుల సన్నాహాలు జరిపి మెక్సికోలో సోషలిస్టు మహాసభను జరపటం. ఆ సభకు సోషలిస్టు శోవియట్ యూనియన్ నుండి అభినందన సందేశం రావటం రాయ్ ప్రతిభా పాటవాలకు ఒక ప్రత్యేక గుర్తింపు. మెక్సికో జాతీయుడు కాకపోయినా అప్పటి ప్రజలు, ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి సోషలిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొనటం గమనించదగిన విషయం. తరువాత కొలది కాలానికే మెక్సికో సోషలిస్టు పార్టీ రాయ్ సలహాననుసరించికమ్యూనిస్టుపార్టీగా అవతరించినది. రష్యా తరువాత రష్యా ప్రమేయం లేకుండా, అంతర్జాతీయంగా ఇతర దేశాలలో స్థాపింపబడిన తొలి కమ్యూనిస్టు పార్టీ ఇదియే.

రష్యాదేశస్తుడు బరోడిన్ ద్వారా రాయ్ గత చరిత్రను, అనుభవాలను అపార జ్ఞానాన్ని, అభ్యుదయ భావాలను తెలుసుకొనిన లెనిన్ మహాశయుడు 1920 కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ మహాసభకు రష్యా ఆహ్వానించటం రాయ్ జీవితంలో మరో ముఖ్య ఘట్టం. రష్యా విప్లవంలో ఉద్దండ నాయకులైన లెనిన్, ట్రాట్స్కీ, బుఖారిన్, స్టాలిన్ వంటి అతిరధులు, మహారధుల సరసన అత్యున్నత పీఠాలను అధిష్ఠించి అంతర్జాతీయంగా కమ్యూనిస్టు విధానాలు, కార్యక్రమాలను నిర్ణయించటంలో రాయ్ ప్రముఖ పాత్ర వహించాడు. ఆ కాలంలో మాస్కో సందర్శించిన జవహర్‌లాల్ నెహ్రూ రాయ్‌ని ఒక అసాధారణ వ్యక్తిగా, "మేరు పర్వతంగా" తన ఆత్మకథలో వర్ణించాడు.

రాయ్ రష్యా ప్రయాణం కూడా అతి సాహస చర్యలతో కూడి యున్నది అమెరికా నుండి ఇంగ్లండు వరకు శత్రుదేశాల నౌకలపై గస్తీ ఏర్పాటుండటం చేత రాయ్ మెక్సికో నుండి ఐరోపాఖండం చేరటానికి మెక్సికో ప్రభుత్వం తగిన భద్రతలు సమకూర్చినా మార్గ మధ్యంలో అనేక అవరోధాలను ఎదుర్కొనవలసివచ్చినది. రష్యా చేరక ముందు స్పెయిన్, జర్మనీ తదితర దేశాల విప్లవనాయకులను కలుసుకొని వారి విప్లవ పంథాలను, దేశ పరిస్థితులను అర్థంచేసుకొనటానికి ప్రయత్నించాడు.

1916లో దేశం విడచి వెళ్ళిన రాయ్ 1930 వరకు ప్రపంచం నలుమూలలా తిరుగుతూ విప్లవ ఉద్యమాల్లో తలమునకలుగా నిమగ్నుడయినా భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో కించిత్తు కూడా అలక్ష్యం చూపలేదు సరికదా ఆ వుద్యమ వ్యాప్తి కొరకు నిరంతరం కృషి జరుపుతూనే వచ్చాడు. అమెరికాలో ప్రవాస భారత విప్లవ కారులను కలుసుకొని జర్మనీ పథకం గురించి. ఇతర కార్యక్రమాల గురించి చర్చలు జరిపాడు మెక్సికోలో లోగడ బెర్లినులో కలిసిన జర్మను అధికారులను తిరిగి కలుసుకొనివారి నుండి ధన సహాయం పొంది ఆ సొమ్మును ఒక జపాను బ్యాంకుద్వారా, భారత విప్లవ కారులకు అందే ఏర్పాట్లు చేశాడు. వారి సలహా ననుసరించి రాయ్ తిరిగి చైనా వెళ్ళి అచ్చటనే ఆయుధ సామగ్రిని పొంద టానికి పథకం రూపొందించ వలసినది. కాని రాయ్ ప్రయాణానికి తగిన అవకాశం లభించనందు వలన ఆ ప్రయత్నం విరమించ వలసి వచ్చినది.

రష్యాలో రాయ్ తాష్కెంటును కేంద్ర స్థావరంగా ఏర్పరచు కొని కొంత మంది భారతీయులకు సైనిక శిక్షణతోబాటు విప్లవ నాయకులుగా తీర్చి దిద్దటానికి ప్రయత్నించాడు. భారతదేశంలోని విప్లవ వాదులకు ధన సహాయంతో పాటు విప్లవ సాహిత్యాన్ని కూడా పంపుతూ ఉద్యమ ఆవశ్యకతను దాని విస్తరణ గురించి ఆదేశాలు పంపుతూ వుండేవాడు. రాయ్ కృషి ఫలితంగా మొట్టమొదటగా తాష్కెంటులో తాత్కాలిక భారత కమ్యూనిష్టుపార్టీ స్థాపన జరిగినది. తరువాత 1924 లో రాయ్ ప్రోత్సాహంతో భారతదేశంలో ప్రథమ కమ్యూనిష్టుపార్టీ అవత రించినది. అదే సంవత్సరం బ్రిటీషు ప్రభుత్వం కమ్యూనిష్టు కార్యకలాపాలను అరికట్టటానికి వారిపై కేసును బనాయించినది, ఇది కాన్పూరు కుట్రకేసుగా చరిత్ర ప్రసిద్ధి కెక్కినది. ఇందులో రాయ్ మొదటి ముద్దాయి. లెనిన్ సలహాపై రాయ్ తాష్కెంటు చేరటంలో ప్రధానోద్దేశం ముస్లిమ్ రాజ్యాలలో సామ్రాజ్యవాదుల పలుకుబడిని తగ్గించి విప్లవ శక్తులను సమీకరించటం.ఇందుకు అనుకూల చర్యలను తీసుకొనటంలో రాయ్ ప్రముఖ పాత్ర వహించాడు, ముఖ్యంగా పర్షియన్, ఆఫ్గన్ రాజ్యాలలో రాయ్ కృషి శ్లాఘనీయం. ఒక తరుణంలో లెనిన్ రాయ్‌ని ఆఫ్గని స్తాన్‌కు రాయబారిగా పంపి తద్వారా భారతదేశంలోని విప్లవ శక్తుల అభివృద్ధికి తోడ్పడాలని కూడ ఆలోచించాడు.

రాయ్ జీవితంలో చైనా విప్లవం (1927) మరో మైలురాయి. ఐరోపా ఖండంలో విప్లవాలు విఫలం కావటంతో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ వలస రాజ్యాల వైపు మొగ్గు చూపినది. వలస రాజ్యాలలో జరుగు ఉద్యమాలు, తిరుగుబాటులు సామ్రాజ్య శక్తులను బలహీన పరచగలవని ఆశించినది.

19 0లో స్థాపింపబడిన చైనా కమ్యూనిస్టు పార్టీకి రష్యా ఆర్థికంగా ఇతరత్రా అనేక సహాయాలు అందచేయటంతో అది ఒక సుస్థిరమైన పార్టీగా రూపొందింది ముఖ్యంగా దక్షిణ రాష్ట్రాలలో కర్షక-కార్మికులలో తగినంత పలుకుబడిని సంపాదించుకొనగలిగినది.

కొమింటాంగ్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ ప్రభుత్వ మేర్పడినా సామ్రాజ్యవాద శక్తుల బలం తగ్గలేదు. పైగా అంతకు ముందున్న వాంగ్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి జనరల్ చియాంగ్-కై షేక్- అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు.

"బూర్జువా ప్రజాస్వామ్య విప్లవం" కమ్యూనిస్టు విప్లవానికి ముందు దశగా భావించిన రష్యా అధికారులు మొదట వాంగ్ ప్రభుత్వానికి, తరువాత చియాంగ్-కై-షేక్ ప్రభుత్వానికి కూడ ఆర్థికంగా, సైనికంగా సహాయపడుతూ ప్రజాసామాన్యంలో కమ్యూనిస్టుపార్టీ పలుకుబడిని బాగా పెంచగలిగారు.

జాతీయ ప్రభుత్వంతో సహకరిస్తూ సామ్రాజ్య శక్తులను అంతంచేయాలని కమ్యూనిస్టుల వ్యూహం. దీనినే "ఐక్యపోరాట" మన్నారు. దీనికి స్టాలిన్ మద్దతు కూడా వున్నది నానాటికీ పలుకుబడిని పెంచుకుంటున్న కమ్యూనిస్టుల వ్యూహ రచన ప్రభుత్వ పెత్తందారులకు సైనికాధికారులకు, గిట్టలేదు. ఫలితం: ఇరువర్గాల మధ్య విభేదాలు, తగాదాలు. పోరాటాలు ప్రారంభమైనవి 1926లో యివి తీవ్ర స్థాయికి చేరటంతో అచ్చట విప్లవం విజయవంతం కాగలదనే ఆశలు వీడచూపినవి.

ఇట్టి సమయంలో స్టాలిన్ రాయ్‌ని చైనా పంపుతూ అచ్చటి పరిస్థితుల ననుసరించి కమ్యూనిస్టు పార్టీకి అవసరమయిన సలహాలివ్వవలసినదిగా ఆదేశించాడు. అప్పటికే రాయ్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రధాన నాయకులలో ఒకరిగా పరిగణించబడ్డాడు దాదాపు ఇంటర్నేషనల్ లోని ఉన్నత స్థానాలన్నిటినీ అలంక

రించారు. అంతేగాక తూర్పు దేశాల కమీషన్ అధ్యక్షునిగా, చైనా కమీషన్‌లో సంయుక్త కార్యదర్శిగా కూడ వుండటంచేత స్టాలిన్ రాయ్‌ని తగిన వ్యక్తిగా భావించి చైనా పంపాడు.

అంతకు ముందుకాలంనుంచే మైకేల్ బరోడిన్ తన అనుచర వర్గంతో చైనాలో పార్టీ విధానాలను, కార్యక్రమాలను నిర్ణయిస్తూ తన కృషిలో నిమగ్నమై వున్నాడు. ఈయన స్టాలిన్ అంతరంగికులలో ప్రముఖుడు. రాయ్‌ని మెక్సికోలో కలుసుకొనిన వ్యక్తి ఈతడే కనుక రాయ్, బరోడిన్ యిద్దరూ కలిసి చైనా పరిస్థితులను చక్కదిద్ది విప్లవాన్ని విజయవంతం చేయగలరని స్టాలిన్ ఆశించి వుండవచ్చును.

కాని రాయ్ చైనా చేరునప్పటికే పరిస్థితులు విషమించినవి. ఐక్యపోరాట నినాదం కమ్యూనిస్టులకు ప్రమాదం తెచ్చి పెట్టినది. కర్షక-కార్మిక హక్కులైన భూ సంస్కరణలు, వేతనాలు, నిరుద్యోగంపై బూర్జువా వర్గం విముఖత చూపినా కమ్యూనిస్టులు నోరెత్తలేదు. ప్రజా ఉద్యమాలు అణచబడ్డవి కమ్యూనిస్టులు హతమార్చబడ్డారు అయినా "ఐక్యపోరాట" నినాదాన్ని వదులుకొనలేదు. దీనికంతటికీ ప్రధాన కారకుడు బరోడిన్. రష్యా పంపుచున్న ఆర్థిక సహాయం, ఆయుధ సామగ్రి పంపకం అంతా ఆయన ద్వారానే జరుగుచున్నందున చైనా కమ్యూనిస్టు పార్టీ బరోడిన్ ఆజ్ఞలను ధిక్కరించలేక పోయినది. ఇందుకు పూర్తి బాధ్యత బరోడిన్‌దే అనటానికి కూడా వీలులేదు. ఆయన స్టాలిన్ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాడు.

రాయ్ కేవలం సలహాదారునిగానే అక్కడకు వచ్చాడు. ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేసి ప్రభుత్వంతో తలపడి కాదో, పేదో తేల్చుకోవాలని రాయ్ అభిప్రాయం అందుకు అనుగుణంగా కర్షక దేశమైన చైనాలో వారికి ఆయుధాలు అందించాలని, అనుకూలంగా భూ సంస్కరణలు జరపాలని, వారి హక్కుల కొరకు పోరాడాలని, "ఐక్య పోరాట" నినాదానికి మారుగా "భూ సంస్కరణ" నినాదాలు యివ్వాలని రాయ్ వాదించాడు. అంతేకాదు కొమింటాంగ్ పార్టీని ప్రజా పార్టీగా మార్చి బూర్జువా వర్గాల నాయకత్వాన్ని కూలద్రోయాలని కూడా సూచించాడు. రాయ్ అభిప్రాయాలకు తగిన విలువ లభించలేదు. ఏది ఏమయినా చివరకు చైనా విప్లవం ఘోర పరాజయానికి గురికాక తప్పలేదు. తరువాత రాయ్ జర్మనీలో వుండగా

జర్మనీ భాషలో "చైనాలో విప్లవం- విప్లవ ప్రత్యాఘాతకం" పేరుతో 1930 లో ఒక బృహద్గ్రంథాన్ని ప్రచురించాడు. తరువాత 2 అధ్యాయాలు అదనంగా చేర్చి ఇంగ్లీషులో రచించాడు. కొన్ని కారణాల వలన ఆ గ్రంథం ఆలస్యంగా 1946లో ప్రచురింపబడినది.

భిన్న భావాలు, భిన్న అభిప్రాయాలు కమ్యూనిస్టులకి గిట్టవు. స్వేచ్ఛా మనస్తత్వం కమ్యూనిజంలో ఇమడదు. "క్రమశిక్షణ" పేరుతో ఎన్ని ఘోరాలు జరుగుతున్నా చెల్లుబడి అవుతూనే వున్నవి. రాయ్ మెక్సికోలో వుండి అప్పటి సామాజిక పరిస్థితులను చక్కదిద్దటంలో నిమగ్నుడై వుండగా రష్యా నుండి ఆహ్వానం వచ్చినది. అయినా వెళ్ళటానికి వెనుకంజ వేయటంతో బరోడిన్ "బోల్షెవిక్ క్రమశిక్షణను పాటించాలని హెచ్చరించాడు. ఆనాడే రాయ్‌లో కొంత నిరసన భావం కనబడినది బరోడిన్ కేవలం తమాషా కన్నానని, మాస్కో భారతదేశ మార్గంలో వుందని" మాట మార్చాడు. మాతృదేశానికి దగ్గరలో వుండి మాతృదేశ బంధవిముక్తికి తగిన కృషి చేయగలననే ఉత్సాహం రాయ్‌లో జనించినది. రాయ్ రష్యా ప్రయాణానికి అది కూడా ఒక ముఖ్య కారణం.

అధికారమే పరమ లక్ష్యంగా భావించిన స్టాలిన్ హయాంలో అంతర్గత ప్రజాస్వామ్యం నశించినది. సహచరులు, అనుచరులే కాదు, అంతరంగికులను కూడ "క్రమశిక్షణ" పేరుతో పదవీచ్యుతులు చేయటం, మరుభూములకు పంపటం ప్రాణాలు తీయటం సాధారణ విషయంగా మారినది. ఒక దశలో రాయ్ కూడా యిదే ప్రమాదానికి గురి అయినా అదృష్టవశాత్తు చికిత్స నెపంతో జర్మనీ చేరటం వలన స్టాలిన్ కబంధ హస్తాలనుండి తప్పించుకొనగలిగాడు.

తన ప్రథమ ప్రయత్నం మధ్యలోనే ఆగిపోయినది. తాను చేరవలసిన గమ్యం యింకా దూరంలోనే వున్నది. కనుక ఇక తన కార్యరంగం మాతృదేశానికే తరలించాలి. దూరంగా వుండటంకంటె స్వయంగా మాతృదేశమేచేరి కార్యసాధనకు పూనుకోవాలని రాయ్ కృతనిశ్చయు డయ్యాడు.

స్వదేశంలో అడుగు పెట్టగానే బ్రిటిషు ప్రభుత్వం కాన్పూరు కుట్రకేసు ఆధారంగా రాయ్‌ని శిక్షించక మానదు. ఆ శిక్ష కూడా దీర్ఘ కాలం అనుభవించవలసి వుంటుంది. ఆ విషయం రాయ్‌కి తెలుసు. అంతకు మిన్నగా భారత స్వాతంత్ర్యోద్యమంలో తాను నిర్వహించవలసిన గురుతర బాధ్యత కూడా రాయ్‌కి తెలుసు. కనుక

జర్మనీ మిత్రుడు పాలించిన లెక్కిసేనుక 1930 చివరిలో రహస్యంగా మారు పేరుతో కరాచీ నగరం తరువాత బొంబాయి నగరం చేరుకున్నాడు.

తాను రహస్య జీవితం సాగిస్తూనే ఉత్తర భారతంలో పర్యటించి తన అనుయాయులైన అనేక మందిని రహస్యంగా కలుసుకుంటూ విప్లవ కార్యాలకు నూతనోత్సాహం చేకూర్చ కలిగాడు. ఈ సంచలనం బ్రిటిషు గూఢచారులకు అనుమానం కలిగించినా 15 సంవత్సరాల క్రితం దేశం విడచివెళ్ళిన రాయ్‌కి ప్రస్తుత రాయ్‌కి పోలికల్లో తేడా వుండటంచేత రాయ్‌ని బంధించటంలో విఫలులయ్యారు. చివరకు అఫిషియల్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుల అచూకీ ఆధారంతో రాయ్ 1931 జులైలో నిర్బంధింపబడ్డాడు. ప్రత్యర్థులను పరిహర్పటమే కమ్యూనిస్టుల పరమార్థం గదా!

రాయ్ అరెస్టు సమాచారం దేశం నలుమూలలా వ్యాపించినది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ప్రదర్శనలు జరిగినవి. రాయ్‌ని విడచిపెట్టాలని ఇతర దేశాలలో కూడ ఆందోళనలు, నిరసనలు ప్రదర్శింపబడినవి. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఐన్‌స్టీన్ 'రాయ్ వంటి మహావ్యక్తిని జైల్లో పెట్టినందుకు సిగ్గుపడాలి' అని విమర్శించాడు. ఇంగ్లాండులో లేబరు పార్టీ తరఫున ప్రదర్శనలు జరిగినవి.

బహిరంగ విచారణకు ప్రభుత్వం భయపడి జైల్లోనే విచారణ పూర్తిచేయటానికి కోర్టుకు ఉత్తర్వులు జారీచేసినది. రాయ్ తాను నిర్దోషినని రుజువు చేసుకొనటానికి అవకాశ మివ్వబడలేదు. 12 సంవత్సరాల శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు యిచ్చినది. అపీలుకు సంబంధించిన రికార్డునంతా సమకూర్చిన బ్రిజేష్‌సింగ్ (ఈయన తరువాత స్టాలిన్ కుమార్తెను పెండ్లి చేసుకున్నాడు) తీరా విచారణ సమయంలో అఫిషియల్ కమ్యూనిస్టు పార్టీలో చేరి రాయ్ రక్షణ (డిఫెన్సు) సంఘానికి రికార్డును అప్పగించకుండా రాయ్‌కి ద్రోహం చేశాడు. చివరకు హైకోర్టులో రాయ్ శిక్షాకాలం 6 సంవత్సరాలకు తగ్గించబడినది. అది కూడా దీర్ఘకాలమే. పైగా రాయ్‌కి మొదట యిచ్చిన ఎ తరగతి బి తరగతిగా తగ్గించబడినది.

రాయ్ జైలులో వాతావరణం సరిపడక, తగిన వసతులు లేక దుర్భరజీవితాన్ని గడుపవలసి వచ్చినది. వ్యాధిగ్రస్తుడయ్యాడు. ప్రభుత్వం చదువుకొనడానికి అవసరమైన పుస్తకాలను అందనివ్వక, వ్రాసుకొనటానికి తగినన్ని కాగితాలను కూడ యివ్వక మానసిక సంక్షోభానికి గురి చేసినది. నెహ్రూ రాయ్ జైలు జీవితాని

గురించి యీ విధంగా వ్రాశాడు. "మేధాసంపత్తిగల ఒక మహావ్యక్తి నిరాదరణకు గురికావటం కంటె భరించరాని శిక్ష మరొకటి లేదు.... ఆయన విలువైన కాలం ఆ విధంగా వృథా చేయబడుచున్నది.... తన జీవితంలో అత్యున్నత స్థానాన్ని అందుకొనగలిగిన ఆ యువకుని జీవితం ఒక్కసారిగా కొండలోయకు దించబడ్డది.... ప్రస్తుత సమాజంలో భారత పుత్రులలో మహా సాహసోపేతుడు, మేధావుల సంతతికి చెందిన ఒక ప్రధానవ్యక్తి భవిష్యత్తు ఈ విధంగా అంధకారమయం కావటం కడు శోచనీయం."

జైలు జీవితం ఒక విధంగా రాయ్‌కి మేలు చేకూర్చినది. అవిశ్రాంత విశ్రాంతి ఎరుగని రాజకీయ జీవికి విశ్రాంతి లభించినది. మార్క్సిజం గురించి పునఃపరిశీలన చేశాడు. ప్రాక్, పశ్చిమ తత్త్వ శాస్త్రాలను పరిశోధించాడు. ఆధునిక విజ్ఞానశాస్త్రాలలో వచ్చిన మార్పులను, సమాజంమీద వాటి ప్రభావాలను గురించి తేలికగా ఆలోచించగలిగాడు. ఇందుకు అవసరమైన గ్రంథాలను బెర్లిన్‌లో వున్న ఎలెన్ రాయ్ పంపుతూ వచ్చినది. రాయ్ బహుభాషా పండితుడు. కనుక ఇంగ్లీషు, జర్మనీ, ఫ్రెంచి భాషలలో అధునాతనమైన శాస్త్ర పరిశోధన గ్రంథాలను పంపుతూ వుండేది.

మేధావుల శ్రేణికి చెందిన ఆంధ్రవిశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు సర్. కట్టమంచి రామలింగారెడ్డి రాయ్‌ని గురించి 'ఒక గ్రంథ భాండారం జీర్ణించుకొని మరొక గ్రంథ భాండారం సృష్టించిన మహా మేధావి'గా శ్లాఘించాడు. ఇది అక్షరాలా నిజం. రాయ్ బహు గ్రంథ కర్త. జైలులో వున్నప్పుడు ఫాసిజం; మెటీరియలిజం; విజ్ఞాన-తత్త్వ శాస్త్రం; జైలు ఉత్తరాలు; పిల్లి ఆత్మకథ; భారతనారీ ఆదర్శము; ఆధునిక విజ్ఞాన శాస్త్రంలోని తాత్త్విక ఫలితాలు; మొదలయిన అనేక ప్రామాణిక గ్రంథాలను రచించాడు. చివరి గ్రంథంలో కొన్ని భాగాలు యింకా అముద్రితంగానే మిగిలియున్నవి.

కేవలం ఆర్థికవాద ఆధారంతో రూపొందించిన మార్క్సిజంలోని కమ్యూనిజం సమగ్ర రాజకీయ ఆచరణ కాదని తెలిసికొనగలిగాడు. మానవ సంకల్పం (భావ చైతన్యం) కూడా సాంఘిక పరిణామంలో ప్రముఖపాత్ర నిర్వహించగలదని, వ్యక్తి స్వేచ్ఛ సమాజ అభివృద్ధికి కొలతబద్ద అని కమ్యూనిస్టు నియంతృత్వం దీనికి పూర్తిగా విరుద్ధమనే నిశ్చయానికి వచ్చాడు. ఇదే తరువాత న్యూహ్యూమనిజానికి ప్రాతిపదిక అయినది.

1936 నవంబరులో రాయ్ జైలునుండి విడుదలయ్యాడు. వివిధ పార్టీలు, సంస్థల నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం చెప్పారు. రాయ్ జైలు నుండి

బయటకు రాగానే ప్రప్రథమంగా యిచ్చిన ప్రకటన సారాంశం. 'మనం ముందు స్వరాజ్యం సంపాదించాలి. ఆ తరువాతనే సోషలిజం లేక కమ్యూనిజం. కనుక భారత జాతీయ సంస్థ అయిన కాంగ్రెసును అన్నివిధాల బలపరచాలి. అంతేగాదు మిత. మతవాద ధోరణులను తొలగించి కాంగ్రెసును విప్లవ పంథాలో నడిపించి నిజమైన ప్రజా సంస్థగా రూపొందించాలి."

ఫెయిజ్‌పూర్ కాంగ్రెసు మహాసభలో రాయ్ ఒక విలక్షణ వ్యక్తిగా అనేక మందిని ఆకర్షించటం విశేషం. తన గంభీరోపన్యాసంలో భవిష్యత్తులో కాంగ్రెసు అనుసరించవలసిన విధానాలు, కార్యక్రమాలు గురించి విపులంగా వివరించటం కాంగ్రెసు నాయకులకే ఆశ్చర్యం కలిగించినది. కాంగ్రెసును 'రాజ్యాంగ పరిషత్తు'గా మార్చి విదేశీప్రభుత్వానికి పోటీప్రభుత్వంగా రూపొందించాలని రాయ్ యిచ్చిన కొత్త నినాదం స్వాతంత్ర్య సమరంలో ఒక వినూత్నమైన పంథాగా గోచరించినది

రాయ్ విడివిడిగా అనేకమంది కాంగ్రెసు నాయకులను, కాంగ్రెసు - సోషలిస్టు నాయకులను కలుసుకొని భవిష్యత్ కార్యక్రమం గురించి సుదీర్ఘమైన చర్చలు జరిపారు. ఒకదశలో అంతర్జాతీయవాదం పేరుతో అటూ, యిటూ ఊగిసలాడుతూ స్థిరత్వంలేని జవహర్‌లాల్ నెహ్రూ స్థానంలో రాయ్‌ని నిలబెట్టాలని కొంతమంది కాంగ్రెసు నాయకులు ఆలోచించారు. స్వయంగా రాయ్ దీనికి అంగీకరించలేదు. నెహ్రూపై అనేక ఆశలు పెట్టుకొన్న రాయ్ ఆయనకు కుడిభుజంగా వుండి అవసరమయిన సలహా సంప్రదింపులను అందచేయుటానికి నిశ్చయించుకున్నాడు కాని రాయ్ ఆశలు చివరకు క్రమముగా మారినవి. సోషలిజం పేరుతో నెహ్రూ, గాంధీ ప్రథమ శిష్యునిగా మారాడు. అధికారం ఆశయాలను వమ్ము చేస్తుంది.

ఆరోగ్యం సరిగా లేకపోయినా లెక్కచేయక రాయ్ దేశం నలుమూలలా సంచరించి అనేక బహిరంగ వుపన్యాసాలిచ్చి అన్ని వర్గాలు కాంగ్రెస్‌లో చేరి కాంగ్రెసును పటిష్ఠపరచడానికి తీవ్ర కృషి జరిపారు.

రెండవ ప్రపంచ యుద్ధంలో రాయ్ అనుసరించిన మార్గం ఆయన రాజకీయ విజ్ఞతకు, దూరదృష్టికి ఒక గీటురాయి. కాంగ్రెసు తనకు ముందుగా అధికారం సంక్రమింపచేస్తేగాని యుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనవని బిర్రబిగుసుకొని రాష్ట్రాలలో ఏర్పడిన, ప్రభుత్వాలచేత రాజీనామా చేయించినది. కమ్యూనిస్టులు సామ్రాజ్యవ్యతిరేక యుద్ధంగా నిర్ణయించి యుద్ధవ్యతిరేక ప్రచారానికే సన్నద్ధులయ్యారు. క్రమేపి

కాంగ్రెసు కూడా యుద్ధ వ్యతిరేక చర్యలకు పూనుకొన్నది. బ్రిటిషు ప్రభుత్వవోటమి భారత స్వాతంత్ర్య సాధనకు దగ్గర మార్గంగా భావించి 'వ్యక్తి సత్యాగ్రహం' తరువాత 'క్విట్ ఇండియా' ఉద్యమం ప్రారంభించినది. బోసు జపాను సహకారంతో ఢిల్లీ ఎర్రకోటను పట్టుకొనటం తేలికగా భావించాడు.

యుద్ధ గమనాన్ని, యుద్ధ పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ వచ్చిన రాయ్ 'ఫాసిస్టు వ్యతిరేక యుద్ధం'గా నిర్ణయించి "ఇది ఫాసిజానికి, ప్రజాస్వామ్యానికీ మధ్య జరుగుతున్న యుద్ధం బ్రిటిషు ప్రభుత్వం మనకు స్వరాజ్యం యిచ్చినా, యివ్వకపోయినా యీ యుద్ధ ఫలితాల ప్రభావం మన దేశంపై కూడా వుండక తప్పదు. ఫాసిజం గెలిస్తే స్వరాజ్యం వచ్చినా ఫలితం శూన్యం. లేక ప్రజాస్వామ్యం గెలిస్తే బ్రిటిషు ప్రభుత్వం మనకు స్వరాజ్య ప్రదానం చేయక తప్పదు. ఇది చారిత్రక నిర్ణయం. కనుక మనం విధిగా యీ యుద్ధంలో పాల్గొనాలని" పిలుపు యిచ్చాడు.

ఇది నిజంగా రాయ్ జీవితంలో కఠోర సమయం. అనేకమంది అనేక విధాలుగా రాయ్‌ని దుమ్మెత్తి పోయటం జరిగినది. అయినా రాయ్ చలించలేదు. చరిత్ర నిర్ణయాలను తన మేధాసంపత్తుతో ముందుగానే అంచనా వేయగల సమర్థుడు కనుక ఏకాకిగా, తన కొద్దిపాటి అనుచర వర్గంతో దేశం నలుమూలలా తిరిగి యుద్ధఅనుకూల ప్రచారం చేశాడు. ప్రవాహం వాలునుబట్టి యీదటంలో సామర్థ్యం అక్కరలేదు. ఎదురీతలోనే సామర్థ్యం కావాలి. దీనిని ఆచరణలో ముందుగా చూపగలిగినది భారతదేశంలో రాయ్ ఒక్కడే. ప్రజాస్వామ్యశక్తుల విజయం భారత నాయకుల ప్రమేయం లేకుండానే భారతదేశానికి స్వాతంత్ర్యం చేకూర్చినది. ఇది మనకొక్క దేశానికే పరిమితం కాలేదు. వలస రాజ్యాలలో మరికొన్ని దేశాలుకూడ యీ కారణంగా స్వతంత్ర దేశాలుగా అవతరించినవి.

అయితే యుద్ధానంతరం పరిస్థితులు యథా స్థానానికి చేరటం ప్రారంభమయినది. ఒక రకంగా స్టాలిన్ ముందుకు ప్రధాన కారకుడు. వంద సంవత్సరాల క్రితం కారల్ మార్క్సు ప్రవచించిన బద్ధశత్రువు కాపిటలిజాన్ని లెనినిజంతోపాటు, తన 'ఇజం'తో జోడించి అంతకంటే బద్ధశత్రువుగా స్టాలిన్ వర్ణించాడు. దీనితో చరిత్ర పునరావృతం కాసాగినది.

రాయ్‌లో సిద్ధాంతపరమైన ఆలోచనలు రేకెత్తినవి. ఇంతవరకు మానవ స్వేచ్ఛాపథంలో మార్క్సిజాన్ని చివరిమెట్టుగా భావిస్తూ వచ్చాడు. కాని కమ్యూనిజం

దానిని భగ్నం చేసినది. సాంఘిక పరిణామంలో కమ్యూనిజం అంతిమదశ కాదు. కమ్యూనిజం తరువాత కూడ పరిణామక్రమం వుంటుంది. దీనికి అంతం లేదు. స్వేచ్ఛకు పరిధులను శాసించకూడదు. దాని విస్తరణలోనే మానవశ్రేయస్సు యిమిడియున్నది.

ప్రకృతిలో భాగమైన మానవుడు ప్రకృతిని అధిగమించగల శక్తి, యుక్తులను కలిగియున్నాడు. వీటి వికాసమే మానవ స్వేచ్ఛకు మూలాధారం. దేవుడు, దయ్యం, మతం, కులం, వర్గం పేరుతో అంధవిశ్వాసాలు, మూఢాచారాలు ప్రబలి మానవుని బానిస ప్రవృత్తికి కుదించి వేస్తున్నవి.

విధేయత, విశ్వాసం ఆరాధన, పరాధీనతత్వం బానిస లక్షణాలు. అవిధేయత, వివేచన, ఎదిరించుట, ప్రశ్నించుట స్వేచ్ఛాజీవి లక్షణం. మొదటిది పరాశ్రయం కోరుతుంది. రెండవది స్వయంశక్తిపై ఆధారపడుతుంది. మొదటిది తల వంచడం; రెండవది తల ఎత్తటం. తలెత్తగలిగినవారే చరిత్ర నిర్మాతలు

ప్రస్తుత సమాజంలో సాయుధ తిరుగుబాటులకు స్థానంలేదు. అవి ఫలించినా మత విప్లవం, సైనిక విప్లవం మరోపేరుతో మైనారిటీ ప్రభుత్వాలు స్థాపింపబడుచున్నవి. 'విప్లవం' అనే పదానికి విలువలేకుండా పోయినది. అలాగే 'సోషలిజం' కూడా వక్రీకరింపబడి లెనినిజం, స్టాలినిజం టిటోయిజం, మావోయిజం, ఇంకా అనేక యిజాలుగా రూపొందుచున్నది.

సమాజం, రాజ్యం, సంస్కృతి, సభ్యత వగైరాలన్నీ మానవ నిర్మితాలు. సృష్టికర్త సృష్టికి బానిసయై పడరానిపాట్లు పడుచున్నాడు. మానవుడు మానవుడుగా మనగలగాలి. మానవ విలువలు, మానవ స్వేచ్ఛ, మానవ స్వాతంత్ర్యం మానవుడు నిర్మించుకొనిన అన్ని వ్యవస్థల్లో నూటికి నూరుపాళ్ళు మూర్తీభవించాలి. అప్పుడే మానవుడు నిజమైన 'చరిత్ర నిర్మాత' కాగలడు. ఇందుకు అనుకూలమైన భావ చైతన్యం, భావోద్దీపన, భావవికాసం, భావోద్వేగం ప్రజాసామాన్యంలో విరివిగా జరపటం మానవ శ్రేయోభిలాషుల ప్రథమ కర్తవ్యం అని రాయ్ హెచ్చరిస్తాడు. అంటే 'భావ విప్లవం' జరుగనిదే ఏ విప్లవమయినా విఫలంకాక తప్పదని రాయ్ భావన.

రాయ్ సిద్ధాంతాలు "న్యూహ్యూమనిజం"గా వ్యాప్తి చెందుతున్నవి. తత్త్వ శాస్త్రంలో "న్యూహ్యూమనిజం" నూతన అధ్యాయం. మరో అధ్యాయం చేరేవరకు దీనికి తగిన ప్రాముఖ్యం వుండక తప్పదు. రాయ్ మరణానంతరం (1954) రాయ్ జీవితం గురించి, రాయ్ సిద్ధాంతాల గురించి అనేక పరిశోధన గ్రంథాలు వెలువడినవి. యింకా వెలువడుతూనే వున్నవి. ఇది హర్షదాయకం.

—కోగంటి రాధాకృష్ణమూర్తి.

గ్రామీణ మహిళలు - జీవన విధానం

గ్రామాల్లో ఆడవారందరికీ వెనుకటిరోజుల్లా కాకుండా చాలా సౌకర్యాలతో ఉన్నాయి లోగడ ఎంతటి శ్రీమంతుల ఇంటనైనా కలారికి ఒక్క క్షణం తీరిక ఉండేదికాదు ప్రొద్దున లేచినప్పటి నుండి రాత్రి పడుకొనే వరకు పని చేయాల్సిన అవసరం ఉండేది. బియ్యం దంచుకోవడం దగ్గరనుండి పిండి విసురుకోవడం వరకే కాదు చివరకు పేడచేసి పిడకలు తయారుచేసుకునే పనికూడా తలమునకలుగా పని చేసుకునేవారు ఎప్పుడో ఏ శుభానికో, అశుభానికో వెళ్ళినప్పుడు తప్ప కాలుమడిచి కూర్చొని మాట్లాడుకోవడానికి తీరికుండేదికాదు.

కాని ఈనాడో, గ్రామీణజీవితంలో చాలా మార్పు వచ్చింది. వడ్ల మరలు, పిండిమరలు మొదలైనవన్నీ అందుబాటులో ఉన్నాయి చివరకు కూలీనాలీ చేసుకునే వారు కూడా వడ్లు దంచుకోవడం లేదు నెలజీతాలుండే వారు ధాన్యం తెచ్చుకున్న వెంటనే మిల్లుకు తీసుకువెళ్ళి బియ్యం ఆడించుకుంటున్నారు రోజువారి కూలిపనులు చేసుకునే వారు మిల్లుకు వెళ్ళి బియ్యం కొనుక్కుంటున్నారు చివరకు ధాన్యరూపంలో కూలి లభిస్తే వాటిని కూడా మిల్లుకు తీసుకువెళ్ళ వచ్చిన ధాన్యంలో సగం బియ్యం చొప్పున తెచ్చుకుంటున్నారు. కానీ వడ్లదంపు అనే పనాన్ని మరచిపోయారు. ఇక మధ్య తరగతి కుటుంబాలలో అసలు ఇలాంటి పనులే అంతరించిపోయాయి.

పండుగ వచ్చిందీ అంటే వెనుకటి రోజులలో ఇళ్ళు అలకడం, ముగ్గులు

పెట్టడం ఓ పెద్దపని. ఆ పెద్ద పెద్ద మండువా లోగిళ్ళ బూజులు దులిపి గోడల దగ్గరనుండి బాగుచేసుకోవడంతో ఓ నెల పండుగ పనులకే సరిపోయేది.

మరి ఇప్పుడో సిమ్మెంటు రావడంతో గోడలలకడంపనీ,డాబాలుగా రూపొంద డంతో బూజులు దులపడంలోని శ్రమ తగ్గిపోయింది.

మా చిన్నతనాల్లో సాయంకాలం అవుతున్నదీ అంటే కిరసనాయిలు బుడ్లు, లాంతర్లు అన్నీ పోగుచేసి వాటిని తుడుచుకోవడం, కిరసనాయిలు పోసుకుని వత్తులు బాగుచేసుకుంటేగాని ఆ రాత్రి వారికి గడవదు. మరి ఇప్పుడో హాయిగా కరెంటు దీపాలు దాదాపు ప్రతి పల్లెలోనూ రావడంతో ఆ శ్రమా లేదు.

ఈ విధంగా ఈనాడు మహిళలకు ఎంతో సమయం మిగులుతోంది అసలు ప్రతి మహిళా కాస్తో కూస్తో చదువుకుంటున్న మాట వాస్తవమే. ఎంతసేపని వార్తా పత్రికలు, మాసపత్రికలూ, చదువ గలుగుతారు। ఆ తరువాత ఏమి చెయ్యాలనేది నిజంగా పెద్ద సమస్య. ఏదో ఒక తావత్రయం మిగులుతోంది. చీరలు కావాలనో, నగలు చేయించుకోవాలనో, సినిమాలు చూడాలనో మోహాలు పెరుగుతున్నాయి. ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా అన్నట్లు పెద్దవాళ్ళే వ్యామోహాలకు గురి అవుతుంటే ఇక చిన్నపిల్లల సంగతేముందీ. వాళ్ళకు ముందుగానే చిన్నప్పటి నుండీ ఈ వ్యామోహాలు ఒంటబడతాయి. అందువలన బిడ్డలను పెంచడంలో కూడా చాలా మార్పు వస్తోంది.

దీనికి తోడు నానాటికీ జీవన విధానంలో పెరిగిపోతున్న నవనాగరికత నరికిని బట్టి బ్రతకాలంటే ఎక్కడి సంపాదనా చాలడంలేదు. కొంత మంది ఆడవారు విద్యా వంతులై మగవారితో పాటు ఉద్యోగాలు చేస్తున్నా పెరిగిపోతున్న జీవన విధానంలో ఇంకా ఇబ్బందిగానే ఉంది. కోరికలు మిగిలిపోతూనే ఉన్నాయి.

అలాంటి పరిస్థితులలో ఇక సామాన్య చదువులు మాత్రమే చదివిన వ్యవ సాయ కుటుంబాలలో అటు అనాటి అలవాట్లూ కాకుండా ఇటు ఈనాటి సాంఘిక జీవిత విధానాన్ని అందుకోనూలేక సతమతమౌతున్నారు.

అయితే దీనికి పరిష్కారం ఏమిటి? అనేదే పెద్ద సమస్య. ఈ మధ్యనే మేము విదేశ పర్యటన చేసి వచ్చాం. అక్కడ వారిలో చూచిన విశేషం ఒకటి కనిపించింది. ఆడే పురుషునితోపాటు ప్రతిష్ఠ తన శక్తి వంచన లేకుండా కృషి చేయడం. చేస్తే

పనికి మర్యాద (Value of labour) చూపడం. తాను చేసేపని తక్కువదా, ఎక్కువదా అనేదికాదు ప్రశ్న. ఏమైనా పని చేస్తున్నానా, లేదా అనేది వారి ప్రశ్న. వృథాగా కాలం వెళ్ళబుచ్చడం అక్కడ నాకు చాలా చాలా తక్కువ కనిపించింది. ప్రతి స్త్రీ, ప్రతి పురుషుడు తమ తమ పనులలో నిమగ్నులై పోతారు. ఎవరి పనులను వారు నిర్వర్తించుకుని ఇంటికి చేరుకొంటారు. యంత్రాల సహకారంతో ఇంటి పనులు చక్కబెట్టుకొని విశ్రాంతి తీసుకుంటారు. ఇందువల్ల వారి బిడ్డలు కూడా పెద్దవారి అనుకరణతో స్వయం పోషకులు అవుతారు. స్వయం కృషికి వారు ఇచ్చే మర్యాదతో పని చేయటంలో తప్పొప్పులు లేవు. పది సంవత్సరాలొచ్చిన ప్రతి బిడ్డా పోకెట్ మనీ తానే సంపాదించుకుంటాడు. వార్తా పత్రికలు తెచ్చి ఇంటింటా ఇవ్వడం దగ్గరనుండి, కార్లు కడిగి పెట్టడం దగ్గరనుండి, రోడ్డు రిపేరీలకు ఎర్రజెండా పుచ్చుకొని నిలబడే వరకు అలాంటి బిడ్డలు పని చేస్తారు. ప్రతిఫలంగా దొరికే సొమ్మును వారు తమ తమ ఖర్చులకు స్వేచ్ఛగా వాడుకుంటారు. అందువల్ల వారు ఎన్నో ఖర్చులుపెట్టుకొని తమ జీవన విధానంలో క్రొత్త పుంతలననుసరిస్తూ జీవించగల్గుతున్నారు.

కానీ మన దేశంలో వీలైనంతవరకు ఒకరు సంపాదించడం, కుటుంబాన్ని పోషించడం జరుగుతోంది. ఇప్పుడిప్పుడే కొంతమంది మహిళలు కూడా ఉద్యోగాలు చేస్తున్నమాట వాస్తవమే.

కానీ ఇంకా చేసేపని హోదాకలదా, హోదా లేనిదా అనే ఆలోచనలుండటంతో ప్రతి ఒక్కరూ పనులలో నిమగ్నులు కాలేకపోతున్నారు. వ్యవసాయ కుటుంబాలలో ఆడవారు పొలం వెళ్ళడం తప్పు. ఏమంతొచ్చిందని ఈవిడ పొలంవెళ్ళాలి? అక్కడ స్వయంగా పని చేయడం అంతకన్న తప్పు. కూలివాళ్ళతోపాటు తనూ అవస్థపడాలి? అనేదేకాని పనియొక్క ప్రాముఖ్యతను గుర్తించలేక పోతున్నారు. ఒక వైపున ప్రజాస్వామ్య సిద్ధాంతాలంటున్నారు. మరొకవైపున పనినిబట్టి గౌరవ మర్యాదలిస్తున్నారు. ఈ విధంగా మధ్యతరగతి కుటుంబాలలో ఎంతో కాలాన్ని వృథా చేస్తున్నారు. కాని పని విలువను అవగాహన చేసుకోలేక పోతున్నారు.

మారుతున్న సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయ్. కాలం మారుతున్నదని అభిప్రాయాలు మారుతున్నాయ్ ఆదర్శాలు మారుతున్నాయ్. ఎన్ని మారినా, ఏది ఏమైనా మానవ ధర్మం మాత్రం ఒక్కటే. సమాజంలో జీవిస్తున్న ప్రతివ్యక్తి

మరొకరికి భారం లేకుండా, హాని చేయకుండా స్వయంపోషకుడుగా తనను తాను తీర్చిదిద్దుకొని జీవన సరళిని మెరుగు పరచుకోవడమే.

మొత్తం జనాభాలో సగానికి పైగా ఉన్న మహిళలు తమ కర్తవ్యాన్ని గుర్తించినప్పుడే సమాజం బాగుపడుతుంది. వెర్రి వ్యామోహాలు అణగారిపోతాయి. గ్రామీణ మహిళలు సుజీవనానికి తాము కూడా కృషి చేయడం అలవరచుకోవాలి. గ్రామంలో వ్యవసాయానికి కావలసిన కృషిలో తోడ్పడడం, ఆయా గ్రామాలలో దొరికే ముడిసరుకులననుసరించి పరిశ్రమలను రూపొందించగలిగితే మరేమి లోటు వుండదు.

ఈ విషయాన్ని ప్రతి ఒక్క గ్రామీణ మహిళ గమనించిన నాడు దేశాభ్యున్నతికి లోటుండదు.

—అవుల జయప్రదాదేవి

ఖద్దరు సంస్కృతి

ఇటీవల నాకు ఖద్దరు సంస్కృతి పట్ల జుగుప్స పుట్టుతున్నది. అందువల్లనే ఖద్దరు ధారణ మరి విరమించాలని నిర్ణయించుకొన్నాను.

పండగలకు, పబ్బాలకు కొత్తబట్టలు కట్టుకునే అలవాటు నాకులేదు. అయినా, నా 73వ జన్మదినం నాడు (డిసెంబర్ 1, 1980) నేను కొత్తబట్టలు కట్టుకొన్నాను. ఆనాడు నేను కట్టుకొన్నవి—మిల్లు బట్టలు.

1925 ప్రాంతాలలో అది జ్ఞాపకం— జవహర్‌లాల్ నెహ్రూ ఖద్దరును "లివరీ ఆఫ్ ఫ్రీడమ్"* అని ప్రస్తుతించాడు. అది ప్రస్తుతం "లివరీ ఆఫ్ ల్యాకీయిజం"*గా మారింది.

---

* Livery of freedom

* Livery of lackeyism

ఈనాడు ఖద్దరు అన్యాయానికి, అక్రమానికి, అధర్మానికి ఆచ్ఛాదం. ఈనాడు ఖద్దరు కపటానికి, కుత్సితానికి, క్రౌర్యానికి కవచం. ఈనాడు ఖద్దరు స్వార్థానికి, నైచ్యానికి మేలి ముసుగు.

అయితే, ఇది ఒక్కసారిగా జరిగిన మార్పు కాదు. దాదాపు మూడు, నాలుగు దశాబ్దాలుగా ఇది కొనసాగుతున్నది. ఇప్పుడిది తారాస్థాయికి చేరుకొన్నట్టు చెప్పవచ్చు.

ఖద్దరు వస్త్రధారుల మాట విడిచిపుచ్చండి; ఖద్దరు ఉద్యమ నాయకులలోనే చెదురుగా తప్ప ఈనాడు నిజంలేదు. నీతిలేదు. ఖద్దరు ఉత్పత్తి కేంద్రాలలో, విక్రయ కేంద్రాలలో ఎన్నెన్నో దగాకోరు పనులు జరుగుతున్నవి. వాటిలో విక్రయిస్తున్న తేనెలో బెల్లంపాకం కలపడం, దంపుడు బియ్యంలో రాళ్ళు, రవ్వలు కలపడం వరకు జరుగుతున్నవి

ఖద్దరు వస్త్రధారులకంటె కూడా, ఖద్దరు టోపీ పెట్టుకొనే వ్యక్తులను చూస్తే భయపడవలసి వస్తున్నది. వారిలో నూటికి 99 మంది "టోపీ దాసు"లని చెప్పవచ్చు.

ఈనాటి మన నైతికపతనానికి నిందించవలసింది ఒక్క ఖద్దరు ధారులను మాత్రమే కాకపోవచ్చు: ఇతరులు సయితం వారికంటె తక్కువ నిందార్హులు కాకపోవచ్చు. కాని, ఒక్క విషయం మాత్రం మరువరాదు. ఈనాటి మన సంఘ నాయకులు, మన ప్రభుత్వ నాయకులు ఖద్దరుధారులే. అందువల్ల, ఈనాటి మన నైతిక పతనావస్థకు ప్రధానంగా వారే బాధ్యులని చెప్పవలసి వస్తుంది.

మట్టినుంచి మహావీరులను గాంధి సృష్టించినట్టు చెప్పడం కద్దు. అయితే, గాంధి జీవితకాలంలోనే వీరు తిరిగి మట్టి మనుష్యులుగా మారిపోయారు.

నే నిదివరలో ఒకసారి వ్రాసినట్టు, గాంధికి గోపాలకృష్ణ గోఖ్లే నైతికపు గురువు; గోఖ్లేకు మహాదేవ గోవింద రనడే నైతికపు గురువు. వీరు ముగ్గురు ఒక జాతిగా మన నైతిక పునరుజ్జీవనానికి అత్యధిక ప్రాధాన్య మిచ్చారు. ఫలితం మాత్రం— మన నైతికపునరుజ్జీవనం కాదు; నైతికంగా మరింత పతనం.

ఈ విషయంలో గాంధిని ప్రత్యేకించి తప్పు పట్టవలసి వుంటుంది. మానవ

స్వభావంలో బలాలతోపాటు, దౌర్బల్యాలు కూడా వుంటాయి. ఈ దౌర్బల్యాలను (స్వభావ సిద్ధమైన పరిమితులను) దృష్టిలో పెట్టుకోనకుండా నైతిక ప్రమాణాలను నిర్ణయిస్తే జీవితంలో కపటం విధిగా ప్రవేశిస్తుంది. ఉదాహరణకు, గాంధి కోరిన మేరకు ఎంతమంది సత్యాన్ని పాటించగలరు? ఎంతమంది ఆగ్రహాన్ని జయించగలరు? ఎంతమంది త్యాగాలను చేయగలరు? ఎంతమంది బ్రహ్మచర్యాన్ని ఆచరించగలరు?

మరొక గాంధికి తప్ప సాధ్యంకాని అంతటి ఉత్తమ నైతికప్రమాణాలను ప్రజా బాహుళ్యం ముందు పెట్టినందువల్లనే మన జాతీయ జీవితంలో కపటం విశేషంగా ప్రవేశించింది. చివరికి గాంధి సయితం తన నైతిక ప్రమాణాలను అన్నిసందర్భాలలో పూర్తిగా పాటించినట్టు చెప్పలేము.

ఈ విషయంలో ఒకవేళ అభిప్రాయభేదా లున్నా, ఒకటి మాత్రం నిశ్చయం. నేటి ఖద్దరువారులలో అత్యధిక సంఖ్యాకులు సంఘానికి చేద పురుగులుగా పరిణమించారు. ఏదో ఒక విధంగా ప్రజలను దోచుక తినడంకన్న, మరొక వ్యాపకం వీరికి లేదని చెప్పవచ్చు. అందువల్ల నీతి నిజాయితీల పట్ల యిప్పటికీ కొంత గౌరవమున్నవారు ఖద్దరును ధరించడం వెంటనే మానివేయాలి.

ఒకప్పుడు విదేశీ వస్త్రదహనం ఒక ఉద్యమంగా సాగింది. యువకు లెవరైనా ఈనాడు ఖద్దరు వస్త్రదహనాన్ని ప్రారంభిస్తే వారికి నా నైతిక ప్రోత్సాహం పూర్తిగా లభిస్తుంది. నేను సూచిస్తున్న ఉద్యమం ద్వారా తప్ప ఈనాటి ఖద్దరు సంస్కృతికి— స్వార్థానికి, కపటానికి, నైచ్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఖద్దరు సంస్కృతికి— అంత్యక్రియలు జరుగవు.

—నార్ల వెంకటేశ్వరరావు

భిన్నత్వంలో ఏకత్వం

ఆ రోజుల్లో వైద్యవిద్యార్థులకు వసతి గృహాలులేవు విశాఖపట్నంలో-పన్నెండు గురు విద్యార్థులు కలిసి ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఉండేవారు హోటల్లో భోజనం చేస్తూ-వాటిని "లాడ్జెస్" అనేవారు. అలాంటిది ఒకటి మేము కూడా తీసుకున్నాం పదిమందిమి కలిసి-దానికి "శాంతినికేతన్" అని పేరు పెట్టాను నేను టాగూర్ కవీంద్రుని మీదనాకుగల గౌరవాన్ని పురస్కరించుకుని. కాని మా లాడ్జిలో శాంతి కంటె అశాంతే ఎక్కువగా ఉండేది. అయితే అది క్షుద్రమైనది కాదు అతి రసవంతమైన అశాంతి సంగీతాలతో. సాహిత్యాలతో. రాజకీయ చర్చలతో, క్రీడారంగ చర్చలతో ఎప్పుడూ సందడిగా ఉండేది చదువులు సూత్రం అవిచ్ఛిన్న తైలధారగా సాగిపోతూనే వుండేవి ఎట్టి ఆటంకమూ లేకుండా. రాను రాను అది ఒక కళా కేంద్రంగా రూపొందింది. అనేక మంది వచ్చిపోతూ వుండేవారు.

అది అలావుండగా మావాళ్లు పది మందీ పది రకాల మనుషులు ఈవైవిధ్య. వైభవం కనుల పండువుగానూ, రసస్ఫోరకంగానూ వుండేది. ముఖ్యంగా హాస్య రసం తొణికిసలాడుతూ వుండేది మా యువక హృదయాలకు కితకితలు పెడుతూ.

శాస్త్రి పొట్టి వాడు. కాని గట్టివాడు. చదువుల్లోనూ. క్రీడల్లోనూ కూడా మాకంటె కొంచెం పెద్దవయసు. అప్పటికే పెళ్ళి కావటం తండ్రి కావటం కూడా జరిగిపోయింది కాని ఆ సంగతి యెత్తితే మాట తప్పించేసేవాడు. అది రహస్యంగా వుంచాలని అతని పట్టుదల. అయితే అది మాకందరికీ తెలుసు. ఒక చిన్న సంఘటనతో అది బాగా బయటపడిపోయింది. అతనికి పిల్లనివ్వాలని వచ్చాడు ఒక పెద్ద మనిషి విజయనగరం నుంచి. మాలో ఒక కొంటె వాడు అసలు సంగతి చెప్పకుండా అతనికి కాస్త ఆశ కలిగించాడు. పాపం ఆయన రెండు మూడు రోజులు అతన్ని కాఫీ హోటలుకు తీసుకు వెళ్ళి. సిగరెట్లు ఇచ్చి కాస్త మచ్చిక చేశాడు సంబంధం కుదురుతుందనే ఆశతో, ఇంతలో మరొకరెవరో అసలు సంగతి బయటపెట్టారు. ఎక్కడలేని కోపం వచ్చి చిందులు తొక్కుతూ తిరస్కరించాడు. పాపం ఒక రోజున శాస్త్రి చొక్కా తొడుక్కుని జేబులో చెయ్యి పెడితే నెత్తి మీద ఉండవలసిన అతని పిలక అందులో వుంది. ఈ కొంటె పని ఎవరు చేశారో

తెలియక అందరిమీదా విరుచుకు పడ్డాడు. దాంతో మళ్ళా పిలకపెంచలేదు. మేమందరమూ సభచేసి వైద్య విద్యార్థికి పిలకవుండకూడదని ఏకగ్రీవంగా తీర్మానించాం. శాస్త్రి ఛాందసుడు. హోటలుకు వెళ్ళేవాడుకాదు కేరియర్ తెప్పించుకుని మడిగట్టుకుని ఇంటి దగ్గరే తినేవాడు. పనిమనిషి తెచ్చిన నీళ్ళు స్నానం చేసే వాడు కాదు. వీధి పంపు దగ్గర స్నానం చేసేవాడు. నీళ్ళుపట్టుకునేందుకు వచ్చిన వాళ్ళతో చిన్న చిన్న పేచీలు పడుతూ, తరవాత ప్రాక్టీసులో బాగా సంపాదించాడు.

ఆచార్లు మరో రకం ఛాందసుడు వసారాలో తడిక అడ్డంకట్టుకుని స్వయంపాకం చేసుకు తినేవాడు. కొంచెపు తనాపికి తడిక లోంచి ఎవరైనా తొంగి చూస్తే అన్నం వదిలేసి లేచిపోయేవాడు. ఎప్పుడు తడి తువ్వాలు చుట్టుకుని ఉండేవాడు. డిసెక్షను హాలులో శవాల్ని ముట్టుకున్నందుకు ప్రాయశ్చిత్తంగా రోజూ జందెం తీసేవేసి కొత్త జందెం వేసుకునేవాడు. బాగా సంగీతం పాడేవాడు. కంఠంలో వొణుకు రావడం కోసం నీళ్ళ కుండని కావలించుకుని సంగీత సాధన చేసేవాడు. కొన్నాళ్ళకి న్యుమోనియా వచ్చి చావుతప్పి బయట పడ్డాడు. ఒకసారి తలవని తలంపుగా ఆతని నలభీమపాకం చవిచూసే భాగ్యం కలిగింది మాకందరికీ. ఆ వూళ్ళో హోటలు భోజనం బాగుండదని మనవేపువాడు ఒకడు వస్తే వాడి చేత మా లాడ్జికి ఎదురుగా హోటలు పెట్టించాం. రెండు నెలలు మనుగుడుపు పెళ్ళి కొడుకులకు పెట్టినట్టు పెట్టాడు భోజనం ఒక రోజున అందరి దగ్గరా బకాయిలు వసూలుచేసి ఉడాయించాడు. అందరూ గొల్లుమంటూ వచ్చేద్దారు. అపూటకి మా ఆచార్లు నలభీమపాకంతో వాళ్ళని శాంత పరచి పంపించాం. చాలా రోజుల తరువాత కలుసుకున్నప్పుడు ఈ సంఘటన జ్ఞప్తికి తెచ్చుకుని నవ్వుకున్నాం.

రావు ఒక విచిత్ర వ్యక్తి. పెళ్ళి అయింది. కావలసిన సంబంధమే-మామగారు పెద్ద ఉద్యోగి. వారికీ వీరికీ కట్నాల వద్ద తగాదా వచ్చి వారు పిల్లని పంపలేదు. వీరు తీసుకురాలేదు. పాపం ఇతగాడికి "వనిత గల బ్రహ్మచర్యం" ఆ విరహవేదనతో తపిస్తూ వుండే వాడు. మామగారికి ఉత్తరాలు వ్రాస్తూ వుండేవాడు మా అందర్నీ సంప్రదించి రాత్రంతా కూర్చుని అనేక మతలబులు వ్రాసి చింపేసి. మళ్ళీ వ్రాసి, అది తెల్లవారాక ఎవరికీ చదివి వినిపించి, బాగాలేదంటే మళ్ళీ చింపేసి. ఇలా రోజులు గడిపేవాడు. చదువు దానికి తగ్గట్టుగానే వుండేది. లేఖాసాహిత్యంలోటి నతమతమవుతూవుండేవాడు అట్టేకోపం రాకూడదు. మళ్ళీ లొంగిపోయినట్టు కనిపించకూడదూ, ఎన్నోరసాలు అందులో కలిసి వుండాలి. ఇంతటూ

ఆ వుత్తరం పూర్తగానే తన భార్యను తిరుగు టపాలో తన దగ్గరకు పంపించేటట్టు ఉండాలి. ఈ విచిత్ర వ్యక్తి తరవాత ఏమయ్యాడో తెలియదు.

మరొకడు విద్రానందుడు క్లాసు వేళకు లేపమని రూమ్ మేటుతో చెప్పి గాఢ నిద్రలో మునిగిపోయేవాడు. లేపితే వెంటనే చెంప పగిలేలా ఒక లెంపకాయ వేసేసి మళ్ళీ నిద్రలో మునిగిపోయేవాడు ఇదొక సమస్యగా తయారయింది మాకు బాగా ఆలోచించి ఆరడుగుల కర్ర ఒకటి సంపాదించాం. దాంతో దూరాన్నుంచి డొక్కలో పొడవటం. చెయ్యి విసిరితే దానికి తగిలేది. దానికి "వేకింగ్‌స్టిక్" అని పేరు పెట్టాం ఈ మహానుభావుడు తరవాత భార్యామణితో కాపరం ఎలా సాగించాడో ఏమో?

రాజు చాలా భోళామనిషి. ఎవరన్నా కొత్త సూటు వేసుకుంటే ఎదురుగా వచ్చి, నఖశిఖ పర్యంతం దృష్టి సారించి, భలే బాగా వుందిరా తమ్ముడూ అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించే వాడు.

తాను సిగరెట్లు కాల్చేవాడు కాదు కాని ఎవరైనా సిగరెట్టు నోట్లో పెట్టుకోగానే వచ్చి అగ్గిపుల్ల గీసి అంటించేవాడు. అతనికి అదొక సరదా. వాడు పొగ వదులుతూ వుంటే చూసి పొంగిపోయే వాడు చంటిపిల్లవాడిలా అందర్నీ పూర్తి పేర్లతో పిలిచేవాడు, ఇంటిపేర్లతో సహా.

సింహం తెలివైన వాడు. నెల్లూరు యాసతో మాట్లాడే వాడు. 1921లో జైలుకు వెళ్ళాడు తరవాత మళ్ళీ వచ్చి ప్రవేశించాడు. గాంధీగారికి వుత్తరాలు వ్రాస్తూ వుండేవాడు. ఆయన "యంగ్ ఇండియా" పత్రికలో జవాబులు వ్రాసేవారు. అతనితో రాజకీయ చర్చలు చేయడం చాలా రసవంతంగా వుండేది. చదువు పూర్తి చేయకుండానే మానేశాడు. చాలాసార్లు జైలుకు వెళ్ళాడు. చాలా సంవత్సరాల తరువాత ఈవూరు వచ్చి తన బంధువుల ఇంట్లోదిగాడు. తెల్లవారగానే నన్ను వెతుక్కుంటూ వచ్చి గాఢాలింగనం చేసి పొంగిపోయాడు.

సీతారాం ఆజానుబాహువు, ఫుట్‌బాలు ఛాంపియన్. మంచం మీద బోర్లగా పడుకుని పుస్తకం నేలమీద పెట్టుకుని చదివేవాడు. అప్పుడుగాని అతనికి బుర్రకి ఎక్కేదికాదు. ఏదైనా అందుకోవలసివస్తే అతన్ని పిల్చేవాళ్ళం అవలీలగా అందు

కునేవాడు. చాలా రోజుల తరవాత ఒక గాన సభలో కలుసుకున్నాం. అతను సంగీత ప్రియుడు. సభ ముగిసిన తరవాత చాలా సేపు పాత విషయాలన్నీ నెమరు వేసుకొని ఆనందించాం. ప్రాక్టీసులో బాగా సంపాదించాడు.

చౌదరీ మంచివాడు అమాయకుడు, ఆప్యాయంగా మాట్లాడే వాడు కాని అతనికి రాత్రి తెల్లవార్లూ కన్నుపొడుచుకున్నా నిద్ర పట్టేది కాదు. మెడ వంచి పడుకో పెడితే పాము పడగలాగ తలెత్తి లేచి కూర్చునేవాడు. అతనికి చాలా చికిత్సలు చేయించాం. పాసయిన తరవాత కొన్నాళ్ళు ప్రాక్టీసుచేసి మిలిటరీ డాక్టర్‌గా వెళ్ళిపోయాడు.

మాధవ్ సాత్వికుడు. మౌనంగా వుండి మా అల్లరంతా గమనిస్తూ తనలో తాను నవ్వుకుని ఆనందించేవాడు. ప్రాక్టీసుకు వచ్చిన కొద్దికాలానికే టి. బి. వచ్చి చనిపోయాడు. మంచి మేధావి.

సత్యం కనపడని కొంటె. కాని ప్రేమాస్పదుడు. మంచి వాడు. సగంలో మానేసి శానిటరీ కోర్సుకు వెళ్ళాడు. ఆ ఉద్యోగంలోనే పింఛను పుచ్చుకున్నాడు.

ఆనాటి "శాంతి నికేతన్" ఎన్నో మధుర స్మృతులను మిగిల్చింది. ఎంత హాస్యరసాన్ని సృష్టించి మా జీవితానికి సువర్ణ పాత్రని అందించింది. ఇన్ని సంవత్సరాలు గడిచిపోయిన తరవాత ఒక్క సారి వెనక్కి తిరిగి చూసి, ఆనాటి ఆపేక్షలు, ఆ చిలిపి చేష్టలు తలచుకుంటే ఆనందంతో గుండె నిండి పోతుంది.

ఆఖరి సంవత్సరం చదువుకు మమ్మల్ని విశాఖ నుంచి మదరాసు పంపారు, అక్కడ తమిళుల "సాంబారు" మళయాళీల "అవియల్" కన్నడిగుల "మైసూర్ రసం" రుచి చూసే భాగ్యం కలిగింది వారి వారి భాషల్లోని మాధుర్యాన్ని అస్వాదించి, భిన్నత్వంలోని ఏకత్వాన్ని తనివితీర అనుభవించే అవకాశం కూడా కలిగింది.

తరవాత, నేత్ర వైద్యంలో ప్రత్యేక శిక్షణకు బెంగుళూరు వెళ్ళినప్పుడు, అక్కడకు తొమ్మిది రాష్ట్రాలనుంచి తొమ్మండుగురు డాక్టర్లు వచ్చారు. అదొక చిన్న భారతదేశమా అనిపించేది. ఏ ప్రాంతం వాడైనా, ఏ భాష మాట్లాడినా అంతా భారతీయులమే అనే ఘంటా నినాదం మా హృదయాల్లో ధ్వనిస్తూ వుండేది— ఎంతో ఆప్యాయంగా, ఆనందంగా కాలం గడిపేవాళ్ళం— "కచ్చి" నుంచి వచ్చిన "మెహతా"కు ఇడ్డెన్లు అంటే ఇష్టం—అతను ఇడ్డెన్ లాగనే ఉండేవాడు. ఆ పోలిక

చూసి నవ్వుకునే వాళ్ళం— తమిళ సోదరుడు "గంధ మానవన్" చిట్టి చిట్టి కథలు చెప్పి నవ్వించేవాడు —

చాలా రోజుల తరవాత మలయా (మలేసియా) దేశంలో పనిచేసేటప్పుడు అన్ని జాతుల మనుషులతోను అతి సన్నిహితమైన పరిచయం ఏర్పడి మానవ జాతి అంతా ఒకటే అన్న భావం ధృవపడింది— ఒక ఆంగ్లేయ మిత్రుడు మేమిచ్చిన పంచె కట్టుకునేందుకు ప్రయత్నించి, అది జారిపోగా దిగంబరుడై, విరగబడి నవ్విన ఆ నవ్వు నాకిప్పటికీ కళ్ళకు కట్టినట్లుంటుంది- ఒక మలయా ముసలమ్మ నన్ను భోజనానికి పిలిచి నేను మొహమాట పడుతుంటే దగ్గర కూర్చుని తినమని బ్రతిమాలి బుజ్జగించి తినిపించిన దృశ్యం ఇప్పటికీ గుండెను కితకితలు పెడుతూ వుంటుంది. ఎప్పుడో చనిపోయిన, మా అమ్మమ్మను జ్ఞప్తికి తెస్తూ. "సూత్రే మణిగణా ఇవ" అన్నది ఎంత చక్కని సూక్తి!

నా చిన్నతనంలో మా నాన్నగారి స్నేహితుడు ఒక ముస్లిమ్ ఆఫీసరు వుండే వారు— నేను తరచు వాళ్ళ యింటికి వెళ్ళేవాణ్ణి- వాళ్ళింట్లో స్త్రీ పురుషులందరూ నన్ను చాలా ప్రేమగా చూసేవారు నాకు మా యింట్లో తిరిగినట్టే వుండేది.

ఆ వూళ్ళో ఒక చిన్న యూరోపియన్ కాలనీ వుండేది - వాళ్ళపిల్లలు మాతో ఫుట్ బాల్ ఆడుకునేందుకు వచ్చేవాళ్ళు- నన్ను వాళ్ళ యింటికి తీసుకుపోయి, వాళ్ళతో పాటు టేబిల్ దగ్గర కూర్చోబెట్టి బిస్కట్లు, కేకులు, పుడ్డింగు పెట్టేవాళ్ళు-

ఆ రోజుల్లో మా నాన్నగారి దగ్గరకు అనేకమంది పండితులు వచ్చి ఎన్నో హిందూమత విషయాలు చర్చించేవారు_ నేను మా నాన్నగారి ప్రక్కన కూర్చుని వినేవాణ్ణి.

ఈ త్రిమత సామరస్యం నా హృదయంలో ఆనాడు మొలకలెత్తి, విదేశ యాత్రతో ఒక పెద్ద వటవృక్షమై విశ్వసోదర భావంగా రూపొందింది.

విశ్వమంతా నీదేనోయ్
వీరంతా నీవారేనోయ్

డా. శంకర శ్రీరామారావు

అంకితం

పూజ్యమిత్రులు
గొర్రెపాటి వేంకట
సుబ్బయ్య గారి
పవిత్ర స్మృతికి

—సోమసుందర్

ఆధునిక కవితావిర్భావము

శ్రీ శ్రీ, నారాయణబాబు ప్రభృతుల నిర్వహణ

18వ శతాబ్దపు ప్రారంభ దినాలనుంచీ, తెలుగు సాహిత్యంలో ఒక జడత్వం వ్యాపించింది ఈస్టు ఇండియా కంపెనీ నిలదొక్కుకొని స్వదేశీ జమిందార్లను తోలుబొమ్మలు చేసి ఆడించ నారంభించింది. దేశీయ పాలకుల్లో అంతః కలహాలు కల్పించింది. వాళ్ళ తలలు తన గుప్పెటలో పెట్టుకొని దీ దిక్కులు కొట్టి సంతృప్తి పడింది ఆ దశలో దేశీయ మేధావుల మనస్సులు సంక్షుబ్ధ మయ్యేయి. కింకర్తవ్యతా విమూఢత వ్యాపించింది జడత్వం పెచ్చురిల్లింది.

కవులు పట్టూరిన పిండెలయి రాజుల పాదాలకింద నలిగిపోతొచ్చేరు. అయినా జాగృతి చైతన్యాలు కలగలేదు. తమ కెదురుగా నిలచిన ఏ ఛోటా జమిందారునో, భూస్వామినో ఆశ్రయించి అతడే మహా భూ మండలాధీశ్వరుడిగా భావించి కీర్తించ నారభించారు. కవికి సంకల్ప వికల్ప శక్తి ఉందన్న విషయం మరచి వంది మాగధులుగా రూపు దిద్దుకున్నారు ఎంత గుణహీనుడైన పాలకుడి నైనా శ్రీ రామచంద్రుడితోనో, శ్రీకృష్ణ దేవునితోనో పోల్చి స్తుతించారు. దానికి ప్రబలమైన కారణం గతానుగతికంగా వస్తున్న "నా విష్ణు పృథ్వీపతిః" అన్న సిద్ధాంతం ఉండనే ఉంది పదిమంది గూండాలను వెనక వేసుకు సాగినవాడల్లా పృథ్వీపతిగా భావించడం పరిపాటయింది ఈ దిశలోని కవులు, తమ రాజును వీర భోగ వసంత రాయుడిగా భావించి పచ్చి బూతుల బుంగను శృంగార రసంగా భావించారు. "ఏకోరసః శృంగార మేవః" అనే తప్పుడు సిద్ధాంతానికి దిగి కావ్యాలను నింపేరు దీనికి విరుగుడుగా ఒక పక్కనుంచి కేవలం భక్తి తత్పరతే ప్రధాన సాహిత్యవాదికగా ఎన్నుకున్న శతక కవులు. వాగ్గేయ కారులు బాహ్య వాస్తవికతలోని క్లేశాలను దాటడానికి భక్తి ఒకటే తెప్పగా భావించేరు. సదరు భక్తి భావం కూడా మండలాధిపతి విష్ణు సంభూతుడే కనుక వాడికే జమ కట్టేరు. "తవ భృత్యభృత్య భృత్యః" అనే భక్తి భావం బానిస మనస్తత్వానికి మారుపేరయింది. అట్టి పరిస్థితుల్లో 1857 లో వచ్చిన ప్రథమ స్వాతంత్ర్య పోరాట ఫలితంగా విక్టోరియా

రాణి ప్రకటనతో బ్రిటీష్ సామ్రాజ్యవాద వలసగా భారతదేశ మార్పు పొందింది. విక్టోరియా ప్రకటనలో ఎన్నో హక్కులు ఇవ్వబడ్డాయి. అని మురిసేరే తప్ప దేశీయులు కంఠానికి ఉచ్చులు బిగించడం గుర్తించలేదు. తత్పూర్వ శతాబ్దాలుగా పాతుకు పోయిన బానిసత్వం ప్రజా బాహుళ్యంలో పాలకుడెవరైనా పరిగణనలోకి తీసుకో జాలని జడత్వాన్నే కొనసాగించింది. కనుకనే ప్రథమ స్వాతంత్ర్య పోరాట దశనుంచి కూడా సామాన్య ప్రజానీకం స్వాతంత్ర్యేచ్ఛను ప్రకటించడం కన్పించదు. దేశీయ పాలకులు ప్రభు వర్గీయులు, సిపాయిలు యిత్యాది అల్ప సంఖ్యాకులే పోరాట శక్తులుగా నిలిచేరు. బ్రిటీష్ సామ్రాజ్య శక్తులను వీగిపోయేరు. బ్రిటీష్ సామ్రాజ్యంలో వలసగా మారిన తర్వాత భారతదేశంలో రైలుదారి నిర్మాణం ప్రారంభమైంది. వంతెనలు, ఆనకట్టలు నిర్మించడం ఆరంభమైంది.

ఇంగ్లండ్‌లోని పరిశ్రమలకు ముడి సరుకులు ఓడల కెక్కించి తీసుకు పోడానికి వీలుగా ఫ్యాక్టరీలు నెలకొల్పేరు. ఇదంతా ఒక నిశ్శబ్ద పారిశ్రామిక విప్లవంగా భారతీయుల చైతన్యాన్ని తీర్చిదిద్దుతోంది. ఆ చైతన్య ప్రభావమే రాజా రామ మోహన్ రాయి ఈశ్వర చంద్ర విద్యాసాగర్ వంటి మేధావుల్లో విశ్వజనీనమైన నూతన దృష్టి ఏర్పడింది. ఆ దృష్టితోనే ఈ మేధావులు ఆంగ్ల విద్యాశాలలు నెలకొల్పి దేశీయులకు నూతన దృష్టి అలవర్చ ప్రయత్నించారు. కాని అప్పట్లో ఈస్ట్ ఇండియా కంపెనీ అధినేతలు లోకలకత్తా. భారతీయులు ఆంగ్ల విద్యా విశారదులు కావడానికి తీవ్రంగా ప్రతిఘటించారు. భారతీయులకు ఆంగ్ల విద్య నేర్పడం ద్వారా వారిని చక్కని గుమాస్తాలుగా రూపొందించడమే T. B. Macaley వంటి ఆంగ్ల విద్యా వేత్తల ఉద్దేశ్యం. కాని ఈ ఆంగ్ల విద్య భారత మేధావుల్ని చైతన్యవంతుల్ని చేసింది. 18వ శతాబ్దపు చివరి దశాబ్దాలలో బెంగాల్ దేశం నూతన భావాలతో చైతన్యవంతం కానారంభించింది.

1848 వరకూ తంజావూరులో నాయక రాజులు ఏర్పరచిన తెలుగు సంస్కృతి కొన మెరుపులు చూపిస్తూ వచ్చింది. తంజావూరు పక్కనే ఉన్న పంచనదక్షేత్రంలో సంగీత మూర్తిత్రయం గొప్ప వాగ్గేయ కారులుగా స్థిరపడ్డారు. సరిగ్గా త్యాగబ్రహ్మ అవతారం చాలించిన ఆ సంవత్సరమే గోదావరి తీరంలో వీరేశలింగం అవతరించేడు. ఆ నాటికి అవతారమొందిన ఏ ఒక్క నూతన శిశువు భావి భారత విధాత కాగలడన్న విశ్వాసం ఏ ఒక్కరికీ కలగదు.

అలాంటి వీరేశలింగం స్వయం కృషితో విశాల దృష్టిని అలవర్చుకొని మరో పదహారు సంవత్సరాలకే సాంఘిక విప్లవ కారుడిగా దర్శన మిచ్చేడు.

వీరేశలింగం కలం పట్టే వరకూ తెలుగు సాహిత్యం హేతువాద వాసనలే ఎరుగదు గతానుగతికత్వం అపారంగా సాలిస్తూనే ఉంది. వీలైనంత వెనక చూపే దానికి దర్శనాధర్శమైంది. సమకాలీన, సామాజిక స్థితిగతుల పరిశీలన కవి గాయకులకు అస్పృశ్యమైంది. కనకనే మరో పదేళ్ళపై గత రెండు శతాబ్దాల సాహిత్యాన్ని అంధ యుగంగా వీరేశలింగమే పేర్కొన్నాడు. అవారావి సకల విషయాలలో ఇది యదార్థమే కాని, భాషా పరమైన ఆగారేఖలు తంజావూరులో పొడచూపక పోలేదు. ఆనాటి రంగాజమ్మ ప్రభృతులు శుద్ధ వ్యావహారికాన్ని కావ్య భాషగా మలిచేరు అయితే భాషా స్వరూపం ఒక్కటే సాహిత్య జీవన రేఖలు నిర్ణయించదు. మృత గతాన్ని తలపై మోస్తున్న సాహిత్యం కళ్ళు మూసుకు వెనక్కి నడిచింది. దైవభక్తిగా ప్రభుభక్తి శ్రుతి మార్చుకుని బానిస బంధాలు బిగించింది. 1860లలోజన్మించిన రవీంద్రుడు,గురజాడఅప్పారావు,సుబ్రహ్మణ్య భారతి ఇత్యాదులు సాహిత్యంలో విప్లవత్మక చైతన్యాన్ని నెలకొల్పేరు. 189 లో విరచితమైన కన్యా శుల్కంలో సంఘ సంస్కరణోద్యమ నేపథ్యంలో ఉత్తమ కావ్య ధర్మాలు దర్శనమిస్తాయి. 1905లో బెంగాల్ విభజనలో ఏర్పడిన వందే మాతరం ఉద్యమం దేశాన్ని ఆపాదమస్తకం కదల్చింది. భారతీయుల విద్యా విధానంలో ఆంగ్ల విద్య స్థిరపడింది. ఆంగ్ల విద్య ద్వారా ప్రపంచ రాజకీయాలను వివిధ దేశాల జీవన విధానాలను మన మేధావులు దర్శించుకో గల్గుతున్నారు అట్టి సమయంలో 1906లో హెయిలీ తోకచుక్క దర్శనం భారత దేశాన్ని భయ భ్రాంతులోనర్చింది. ఆ సమయంలో మొట్ట మొదటిసారిగా అనాటి భారతీయ హృదయంలో పొడచూపిన భయానికి తమ ఇల్లాలినే ప్రతినిధిగా నిల్పి గురజాడ ఇలా అంటారు —

"ధూమ కేతువు కేతువనియో
మోము చందురుదలిగి చూడడు
కేతువా యది?
వేల్పులలనల కేలి వెలి తొగ
కొంచుమా?"

"అరుదుగా విను చప్పకంబున
చొప్పు తెలియని వింత పొడమగ
వన్నకాలపు చిన్న బుద్ధులు
బెదరి యెంచిరి కీడుగా"

గత కాలానికి చెందిన బుద్ధి మాంద్యతయే తోకచుక్క చూపి బెదిరి కీడుగా యెంచిందని విస్పష్టంగా గురజాడ ప్రకటించేరు. ఇదే యావదాంధ్ర సాహిత్యం లోనూ, మొట్టమొదటి సారిగా ప్రకటించబడ్డ హేతువాదం. వారే ఇలా అంటారు.

"అంతెకాపి రవంత యైనను
వంతనేగతి కూర్చనేర్చునె
వలవ నేరిమినెంతు ఆదియన
వింగి తొడపై వేలుచున్"

"కవుల కల్పన కలిమినెన్నో
వన్నె చిన్నెలు గాంచు వస్తువు
అందు వెర్రి పురాణ గాథలు
నమ్మ చెల్లునె పండితుల్"

"కన్ను గానని వస్తు తత్వము
కాంచ నేర్పరులు ఇంగిలీజులు
కల్లనొల్లరు - వారి విద్యల
కరచి సత్యము నరసితిన్"

"దూర బంధువు ఇతడు భూమికి
దారి పోవుచు చూడవచ్చెను
డెబ్బదెనుబది ఏళ్ళ కొకతరి
నరుల కన్నుల పండుగై"

అదే సంవత్సరం ఈ తోకచుక్క పుట్టు పూర్వోత్తరాలు పరిశోధించి బయట పెట్టిన ప్రముఖ శాస్త్రవేత్త 'హెయిలీ'— "ఈ తోకచుక్క క్రీస్తుపూర్వం 464నుంచి ప్రతి 76 సంవత్సరాలకు ఒకసారి కనిపించి తీరుతుంది" అని ప్రకటించారు. అదే సంవత్సరం నుంచీ ఆ తోకచుక్కకు ఆయన పేరు పెట్టడం జరిగింది. ఈ తోకచుక్క

బోగట్టా ఇంగ్లీషు ద్వారా తెల్సుకోగలిగేనవి, కంటికి కనుపించని వస్తుతత్వాన్ని కూడా కాంచగల్గిన నిశితబుద్ధులు ఇంగ్లీషువారని గురజాడ ప్రస్తుతించేరు. ఆ జ్ఞానంతోనే ఆయన ఇలా అన్నారు.

"తెగులు కీడని కతలు పన్నుచు
దిగులు చెందుట అదేటి కార్యము
కలతు నేనిక సంఘ సంస్కర
ణ ప్రయాణ పతాకగాన్"

అని స్పష్టంగా ప్రకటించేరు. ముఖ్యంగా ఆంధ్రదేశంలో సంఘసంస్కరణోద్యమం పరాకాష్ఠకు చేరిన కాలం అది. దానిని హర్షిస్తూ దేవతలే విజయ ధ్వజాన్ని ఆవిష్కరిస్తున్నారని ఆయన భావించేరు. అంతేకాక ఆయన తన నూతన భావనలను 'ముత్యాల సరాలు' అనే హేతువాద కవిత్వానికి మేనిఫెస్టో అనదగిన తొలి రచనలో విస్పష్టంగా ఇలా ప్రకటిస్తారు.

"చూడు మనుసును మేటి వారల
మాటలవి యెడు మంత్ర మహిమను
జాతి బంధములన్న గొలుసులు
జారి సంపదలుబ్బెడిన్"

"ఎల్ల లోకము ఒక్క ఇల్లయి
వర్ణ భేదము లెల్ల కల్లయి
వేల లెరుగని ప్రేమబంధం
వేడుకలు కురియు"

"మతము లన్నియు మాసిపోవును
జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును
అంత స్వర్గ సుఖమ్ము లన్నవి
అవని వెలసిల్లును"

"మొన్న పట్నమునందు ప్రాజ్ఞులు
మొట్టమొదటిది పెట్టు యిదియని
పెట్టినారొక విందు జాతులచేర్చి
వినవైతో ?"

అవి దక్షిణ భారతానికే మొట్టమొదటిదైన నానాకరసమాకర విందు ప్రవృత్తిని తమ ఇల్లాలికి విప్పిస్తున్నారు. ఆ నవచైతన్యంతోనే తాను తేటైన మాటలు కూర్చుకుని "ముత్యాల సరాల గుత్తునా?" అన్న సంకల్పానికి పూనుకున్నారు తూర్పు బలబల తెల్లవారడం గ్రహించేరు. తోకచుక్కయు, వేగుచుక్కయు, ఒడయుడౌ వేవెల్గు కొలువుకు వెరచిమెరసిరి మిన్నువీధిని అన్న సత్యసాక్షాత్కారం చేసుకున్నారు చెదల వీటి కదల బారుతున్న దృశ్యాన్ని గ్రహించారు. తెలతెలవారుచున్న తొలి కోడికూత సమయంలో యిల్లు చేరుకున్నారు. అప్పటికి కార్యవశమున పోయి పట్నమున పదినాళ్ళు ఉండి వచ్చేరు. అక్కడ సంఘసంస్కరణ ప్రవీణుల సంగతులు మెలిగేరు. ఆ చైతన్యం యావత్తు ఈ తొలిగీతిలో అభివ్యక్తమైంది. ఆయన ఉత్సాహంతో తన ప్రేయసికి నివేదించగా ఆమె సహజంగా యిలా అంటుంది.

"కోట పేటలు నేగలరని
కోటి విద్యలు మీకు కరపరి
పొట్ట కూటికి నేర్పు విద్యలు
పట్ట కీట్లు కదల్చెనా?"

ఆమె సత్యం పల్కింది. పొట్టకూటికి నేర్పుతున్న పాశ్చాత్య విద్యలు భారతీయ వైదిక పురాతన జీవితపు పునాదులు కదిల్చింది. ఆలోచనల్లో నూతనత్వం, జీవిత విధానంలో కొత్తదనం, విషయావగాహనలో కొత్త మెలుకువలు ఆంగ్ల విద్యతోనే భారతీయుల కైవశమయ్యేయి. కాని యింకా జడమయంగా ఉన్న లోకులంతా ఈ సత్యాన్ని అవలోకించలేక పోతున్నారు. ఆ లోకానికి గురజాడ తన సతీమణినే ప్రతినిధిగా భావించేరు. భర్త మాటలు లెక్కచేయక దూరంగా వైదొలగిన భార్యను దృష్టిలో పెట్టుకుని ఈ కావ్యాన్ని ముగిస్తూ

"తూర్పు భగ్గున తెల్లవారెను
తోకచుక్క యదృశ్యమాయెను
లోకమందలి మంచి చెడ్డలు
లోకు లెరుగుదురా?"

గురజాడవారి ముత్యాల సరాలన్నీ పట్టుమని పదికన్నా ఎక్కువ లేవు. మిగిలిన మిణుగురులన్నీ పరిగణనీయం కానక్కర్లేని సామాన్య రచనలు ఆయినా ఆ పదింటిలోనే రాబోయే ఈ యుగ సాహిత్యం అంతటికీ ఒజ్జ బంతులు

నిర్మించారు. ఆధునిక యోచనకు వారధి నిర్మించేరు. అనాటిదాకా సాహిత్యంలో ఉదాత్త నాయకుల ప్రతిష్ఠకోసం గతంలో బ్రతికినవారుగా భ్రమపడుతున్న విగత జీవులకే ప్రతిష్ఠాపన జరుగుతుండేది. చరిత్రలోనో, పుక్కిటిపురాణ కథలలోనో పేర్కొనబడిన వ్యక్తులే పాత్రలవుతూ వచ్చేరు. ఆది నన్నయ నెలకొల్పిన ఈ దుష్ట సంప్రదాయం చిన్నయ వరకూ అవిచ్ఛిన్నంగా సాగిపోయింది. జాతిలో ఇంకిపోయిన మూఢవిశ్వాసాల నెన్నిటినో వజ్ర సంకల్పంతో వీరేశలింగం ఎదిరించేరు. దెయ్యాలు, భూతాలు, చేడిపి చెల్లంగి వంటి వాటినన్నిటినీ నతుములు చెరకొట్టేరు. వితంతు పునర్వివాహంయువకులు ధీరహృదయులై ముందుకు ఉరికే కల ఆకర్షణీయం చేసేరు. అట్టి నేపథ్యంలో గురజాడ అప్పారావు సాహిత్య కళకు విశిష్టమైన నూతన గమ్యాన్ని రూపొందించేరు. "ప్రేమ విద్యకు ఓనమాలివి" అనదగిన నూతనోపదేశమూ ఇచ్చేరు. మరుజు ప్రేమ అని తలచేవారిని ఆపి ఆలోచింపచేసేరు. 'ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును – ప్రేమ నిల్పిన ప్రేమ నిలుచును' అనే నూతన భాష్యంతో జాతిని మేల్కొలిపేరు. మొగుడు చెప్పిన మాట పాతకి అని త్రోసిపుచ్చేరు. మాయ మర్మములేని నేస్తము మగువలకు మొగవారికి ఒక్కటే అని ప్రబోధించేరు. అవన్నీ ఆధునిక జీవనధారకు సంబంధించిన నూతన భాష్యాలు. తెలుగు సాహిత్యం అంతకు ముందెన్నడూ ఎరగనిది. అలాగే ఈ ఆలోచనా స్ఫూర్తిగల గురజాడ దేశమంటే మనుషులేనన్న కొత్త సందేశం అందించడంలో ఆశ్చర్యం లేదు. దేశమాత పటాన్ని పూజిస్తున్న రోజుల్లో ఆ మాట చెప్పడం సాహసం.

ఈ ఆధునిక చైతన్యంతో మరింత ముందుకు పోవలసిన కవితా చైతన్యం పదేళ్ళపాటు కుంటినడక నడిచింది. 'ప్రేమ యిచ్చిన ప్రేమ వచ్చును' అనే గురజాడ మౌలిక భావన మాత్రం సర్వ కవులకూ స్వీకార యోగ్యమైంది. దాదాపు 15ఏళ్ళపాటు ఆత్మాశ్రయ వస్తువు ఒక్కటే సాహిత్యాన్ని పాలించింది. 'ప్రేమ కవిత్వమే' ప్రధాన భూమిక వహించింది. దేశభక్తి ఉద్యమ ప్రేరణతో దేశం కదలిపోతున్నా కవులను పెద్దగా కదిలించలేదు. సకృత్తుగా దేశభక్తి గీతాలు అంతా రాసినవారే అయినా అవన్నీ సెంటిమెంట్లకు ప్రాధాన్యత వహించినవే తప్ప ఆధునిక స్పృహతో దేశ స్వతంత్ర సాధన ఆవశ్యక కర్తవ్యంగా భావించి వచ్చినవి కావు.

1927 దాకా శ్రీశ్రీ ప్రభవాది కావ్యాలలో కాని, పురిపండా సౌదామినిలో కాని, నారాయణబాబు 'మిణుగురులు'లో కాని తత్పూర్వ ప్రేమకవితాయుగ ప్రాధాన్యమే,

సెంకొల్పేటులవ్వ స్వీయ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించుకోలేదు. సరిగ్గా ఆ సమయం లోనే బెంగాల్ నుంచి ఒక కొత్త వాయువు వీచనారంభించింది. 'నజ్రుల్ ఇస్లామ్' విప్లవ కవిత్వంతో వంగిపోయిన జాతి వెన్నెముకను నిటారుగా నిల్పుతున్నాడు. 'హరీన్' ఛటోపాధ్యాయ కొత్త అందాలు ఆకాశం అంతా పరుస్తున్నాడు. వీరిరువురి ప్రభావం పురిపండా, శ్రీశ్రీ, నారాయణ బాబులపై విస్పష్టంగా చైతన్యాన్ని కలిగించింది.

ఆతని కవితల ప్రభావంతోనే శ్రీశ్రీ మరో ప్రపంచాన్ని, పురిపండా పురి పండా అనే గేయ కావ్యాన్ని, నారాయణబాబు కపాల మోక్షం కావ్యాన్ని ఆవిర్భవింపచేయి. పురిపండా ఒరియా, బెంగాలీ భాషల్లో గాఢపరిచయం అలవర్చుకొని ఆయా భాషల ఆధునిక విప్లవాత్మక కవితలను స్వయంగా అధ్యయనం చేసి, సోదర కవులకు గానం చేసి వినిపించేవారు. ఒరియా భాషలో ఇప్పటికి ఆధునిక విప్లవాత్మక కవిత చెప్పుకో తగిన స్థాయి నందుకోలేకపోయినా, వంగభాషలో మాత్రం 1920 నుంచీ నజ్రుల్ ఇస్లామ్ అంతర్జాతీయ శాస్త్రీయ సామ్యవాద దృక్పథాన్ని అలవర్చుకొని తీవ్రావేశంతో విప్లవ కవితా శంఖారావంగా గర్జా ఘోషలు వినిపిస్తూనే ఉన్నాడు. విశ్వకవి రవీంద్రుని వంటి వారి ఆమోదాన్నందుకున్నాడు. పురిపండా శ్రీరంగం నారాయణ బాబులపై నజ్రుల్ ప్రభావం ఏ ఏ రీతులుగా ఎక్కడెక్కడ ఎలా ప్రతిఫలితమైందో సోదాహరణంగా చూపడం ఈ వ్యాస పరిధిలోనిది కాదు కాన, ఈ సత్యాన్ని స్థాపిస్తూ విషయాంతరానికి వస్తాను.

గురజాడ అప్పారావుగారి ద్వారా ప్రథమంగా స్థాపితమైనదీ, పురిపండా, శ్రీశ్రీ ప్రభృతులచే శక్తివంతంగా నిర్వహింపబడినదీ అయిన కవిత్వంలో ఆధునికత్వం గురించి యిక్కడే నిర్దిష్టంగా నిర్వచించుకోవలసి ఉంది.

వీరేశలింగ గారిని ఒక కొండ గుర్తుగా స్వీకరించి, కాలీనంగా వీరేశలింగం తర్వాత వచ్చిన తెలుగు సాహిత్యమంతటినీ ఆధునిక సాహిత్యమేనని కవులందరూ ఆధునికులేనని – మన విశ్వవిద్యాలయ ఆచార్యులు మూకుమ్మడిగా [illegible]ండించి ఇప్పటికే కంగాళీ చేస్తూవచ్చారు. ఆధునిక పదం కాలవాచి ఎంతమాత్రం కాదని అది గుణవాచి మాత్రమేనని అందువల్లనే అది సమకాలీనతకుగాని, నవీనతకుగాని పర్యాయపదం ఎంతమాత్రం కాదని నేనిదివరలోనే ఎన్నోమార్లు చెప్పియున్నాను. ఇప్పుడీ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ వేదిక నుంచి మరోమారు నిర్ద్వంద్వంగా ఉద్ఘాటిస్తున్నాను. నన్ను బలపరిచే కారణాలను వివరిస్తాను.

ఇరవయ్యో శతాబ్దం హేతువాదాన్ని మకుటంగా ధరించిన మాట సత్యమే. సర్వమేధారంగాలకూ హేతువాదమే చోదకశక్తిగా ప్రబలతరమైంది. అటు వైజ్ఞానిక శాస్త్రంలోవలెనే ఇటు సాహిత్యంలో సైతం ప్రయోగవాదం ప్రధాన వ్యాపకమైంది. కళా సాహిత్యరంగాలన్నింటా గతానుగతికత్వం త్రోసి రాజనబడి. అనుపూర్వీతకీ, సంప్రదాయ దాస్యానికీ తిలోదకాలివ్వబడ్డాయి. వారసత్వమే సంప్రదాయంగా భ్రమించే మూఢవిశ్వాసం విసర్జించబడింది. ఐతే- ఈ శతాబ్దంలో వచ్చిన సాహిత్యమంతా హేతువాద ఆధీనమే ననడానికి అవకాశంలేదు. అందువల్లనే సమకాలికంగా సంభవించినంత మాత్రంలో సర్వకళా సాహితీ స్వరూపాలనూ అవిశేషంగా ఆధునికమని పిలవ కట్టడానికి ఆధారంలేదు.

వైజ్ఞానిక శాస్త్రంలో వలెనే సాహిత్యంలో కూడ ఆధునిక స్వరూపాన్ని తీర్చిదిద్దిన చోదకశక్తులున్నాయి. జీవ పరిణామవాదాన్ని నెలకొల్పి మొదటిసారి విపులీకరించిన ఛార్లెస్ డార్విన్. ఈ మహనీయుని ప్రతిపాదనవల్ల. 'తొట్టతొలుత వాక్యమున్నది. వాక్యము మానవాకారము ధరించినది' అనే పాశ్చాత్య మతవాదం గాని, 'బ్రహ్మముఖం నుంచి బ్రాహ్మణులు, బాహువుల నుంచి క్షత్రియులు' ఇత్యాదిగా సృష్టించబడ్డారనే భారతీయ వైదిక విశ్వాసంగాని పటాపంచలయ్యాయి. జీవకణం నుంచి కాలక్రమేణా మానవ స్వరూపం వరకూ పరిణామం పొందిన జీవక్రమమే సాక్షాత్కరించనారంభించింది.

జీవితం వలెనే సాంఘిక వ్యవస్థలు కూడా స్థిరమైనవి కావని, గతి వాటి జీవన సూత్రమనీ నిర్వచించి, ఆర్థిక సామాజిక శక్తుల అంతస్సంబంధంలోని నిరంతర సంఘర్షణాత్మక గతి తర్కాన్ని తదధీనమైన భౌతిక లక్షణాలనూ విశ్లేషించి సామాజిక విప్లవసూత్రాన్ని నిర్దేశించిన కారల్ మార్క్సు మహాశయుడు ద్వితీయుడు. ఈయన ఎత్తిన శాస్త్రీయ అభయ హస్తంతో పీడిత మానవులు శిరసులెత్తి యోచనాశీలురయ్యారు. ధనస్వామ్యం గాని, పృథ్వీపతిగాని భగవంతుని వర ప్రసాదుడు కాదన్న ఆత్మ విశ్వాసం ప్రబలింది. లక్ష్మీ దేవతా ప్రసన్నత కాకమ్మ కథగా మారిపోయింది. సామాజిక సంబంధాలలోనూ, వ్యక్తుల మధ్యగల సంబంధాలలోనూ పూర్వ విశ్వాసాలన్నీ వీగిపోయి, ఉత్పత్తి శక్తుల ధన సంబంధం గుర్తింపబడింది.

శరీరాంతర్భాగాలను శాస్త్ర దృష్టితో విశ్లేషణచేసి రోగ లక్షణాలను నిర్ధారణ చేసిన చాలాకాలంవరకూ మానవుని జీవితాన్ని నిర్ధారించే మనసు స్వరూపమేమిటో

వీటయి పీళ్ళకు పూర్వం తెలిసిరా లేదు. మానవ జీవితాన్ని నడిపే అగోచర పదార్థంగా ఆత్మ ఏమూలనైనా లేకపోతుందా అనే అనుమానమే శాస్త్రకారులను సైతం పీడించక పోలేదు. శరీరం వలెనే మానవుని మనస్సు లేదా మెదడు కూడా అనేక అంతర్భాగాల సంపుటిగా మొదటిసారి గుర్తించినవాడు సిగ్మండ్ ఫ్రాయిడ్। ఆ సంపుటిలో భిన్న భిన్న భాగాలకు భిన్న విభిన్న కృత్యాలూ ఉన్నాయని ఆయనే గుర్తించారు. చేతనావచేతనాలకు పరిమితమై మానవ మేధ నిరంతర గమన శీలిగా సాగుతుందనీ. ఆ మనసుకు అంతర్భాగాలు దెబ్బతినడం వల్ల సంభవించే రోగాలు. వివారణలూ సంభవమేననీ ఆ మహనీయుడే పరిశోధించి విశ్లేషీకరించాడు ఆయనే మొదటిసారిగా మనస్తత్వ శాస్త్రాన్ని మానవజాతి కందించాడు. దానితోనే కళలకు, వాస్తవాలకు గల సంబంధాంతరాలను సాహిత్యంకూడా తన ప్రమేయంగా స్వీకరించింది.

కాలదూరాలకు, స్థలాంతరాలకు గల సంబంధమూ, విభేదమూ అనివార్యతకిగా విశ్వసింపబడుతున్న దశలో-వాటికి గల సంబంధ బాంధవ్యాలను వివరించి, సాపేక్ష సిద్ధాంతాన్ని నిర్ధారించిన ప్రథమ మహాశయుడు ఐన్‌స్టయిన్। ఆయన ఆధునిక చేతనకు నిర్ధారించిన మహాశయులలో నాల్గవవారు ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతం వల్ల సాహితీ కారులు పునరాలోచన చేశారు. మనిషి మనసులో గతమూ భవిష్యత్తు వర్తమాన గ్రంథితమై ఏక కాలంలో జీవించే అవకాశం అనుభవ పూర్వకమే. అలాగే-మనసుస్మృతిలో కాలదూరాల అంతరం అణుమాత్రంగా మారి ఏక స్వరూపానుభవంగా మిగిలిపోవడమూ అనుభవం లోనిదే। ఐన్ స్టయిన్ ప్రతిపాదించిన సాపేక్షవాదం ద్వారానే జేమ్స్ జోయిస్. వర్జీనియా వూల్ఫ్. టి. ఎస్. ఎలియట్ వంటి వారు కాలాన్నికూడా ఒక ప్రమాణంగా సాహిత్యంలో నెలకొల్పారు. మొదటి యిరువురూ. చైతన్య స్రవంతి(Stream of conscience) అనే నూత్న సాహితీ రీతికి ప్రాధాన్యత కల్పించారు।

ఈ నలుగురు మహనీయులూ మానవజాతి పరంపరాగతంగా పడిపోతున్న మూఢ విశ్వాసాలను భగ్నం చేశారు. విశ్వాసం స్థానంలో వివేచన పాదుకొల్పారు. సంప్రదాయ మూఢాచారాల స్థానంలో ప్రయోగవాదాన్ని ప్రతిష్ఠించారు. వీరి వైజ్ఞానిక విజయాల ప్రభావం సాహితీ స్వరూపాన్నెంతగానో మార్చి వేసింది. సమకాలీన సమస్యలనే గాక, సార్వకాలిక సమస్యలకు పరిష్కార మార్గాల నందించింది

ఈ యోచనాధారల ప్రభావంతో వచ్చిన సాహిత్యాన్నే మనం ఆధునిక సాహిత్యం అనాలే తప్ప, ఇరవైయవ శతాబ్దంలో వచ్చిన సర్వ సాహిత్యాన్నీ ఆధునిక సాహిత్యంగా వింగడించడం వెర్రితనం అవుతుంది. ఈ ప్రధాన ఆలోచనలకు సమీపంగా ఉన్న సాహిత్యం ఏ శతాబ్దంలో వచ్చినదైనప్పటికీ ఆధునికమే అనడానికి ఆస్కారమూ ఉంది. హేతువాద బద్ధంగానూ గతాను గతికత్వానికి నిరోధక శక్తిగానూ రూపొందిన వేమన యోగి సాహిత్యం నిస్సంశయంగా ఆధునికమే అనడంలో మనకి అభ్యంతరం ఉండనక్కరలేదు. అంటే దేశకాల పాత్రాధీనం కాని ఒకానొక తాత్త్విక చైతన్యానికి లోబడే యావత్తూ ఆధునికమే అనాలి తప్ప గతానుగతిక మూఢవిశ్వాసాలతో కూడిన సాహిత్యం మనకు సమకాలీనమైనప్పటికీ ఆధునిక శబ్ద వాచ్యతకు అర్హమైనది కాదు. వైదిక వ్యవస్థని పునర్నిర్మించాలనీ, వర్ణాశ్రమ ధర్మాలను తిరిగి నెలకొల్పాలనీ కలలుగన్న విశ్వనాథ సాహిత్యం ఆధునికమనడానికి వీలులేదు। మనం జీవిస్తున్నది అణుయుగమే అయినా ఆదిమ మానవులు సాధించిన మృణ్మయ పాత్రలు యింకా ప్రవర్తిల్లుతూనే ఉన్నాయి. అంత మాత్రంతో మనది కుండల యుగం అనలేము కదా।

తెలుగు కవిత్వంలో ఆధునిక లక్షణాభివ్యక్తిగా "నేను" మొదటిసారి 1908లో గురజాడ అప్పారావు "గుత్తునా ముత్యాల సరముల కూర్చుకొని మేలయిన మాటల" అంటూ ప్రారంభించిన గేయంలో దర్శన మిచ్చింది. స్టూవర్ట్ హిమ్స్ షైర్ అనే పండితుడు ఈ నేను ప్రవేశం గురించి చక్కగా విశ్లేషించాడు. "ఈ సాహిత్య సంబంధి అహమిక ద్రవస్థితిలోని వ్యక్తిత్వానికి అభివ్యక్తి సాధనమే తప్ప రచయిత తాలూకు స్వీయ వ్యక్తిత్వ ప్రాబల్యం కాదు అంటే ఇది ఒక జీవన విభాగానికి ప్రవిధి ఈ అహమిక వల్ల గతానేకస్మృతులు సాహిత్య పరంగా సాధించబడతాయి. రచయిత చేయ దలచిన కేంద్రీకరణకు దోహదం చేయగలుగుతుంది. ఈ ద్రవరూపమైన అహమిక సంఘటనల గొలుసుకట్టులో నుంచి అనుస్యూతంగా తేలుతూ వస్తుంది. పరిస్థితులపై ప్రభావం ప్రసరిస్తుంది. పరిస్థితులలో అంతర్నిహితంగా నాయక పాత్ర వహిస్తుంది.—"అంటాడు స్టూవర్ట్ హేమ్స్ షైర్.

(వివరాలకు చూ. నా కవిత్వం కాలాతీత కాంతిరేఖ- పు. 153)

హేతువాద బద్ధమైన ఆలోచనల పునాదిపై ఏర్పడిన అభివ్యక్తి సాధనం నేను, మేముకు పర్యాయ పదమే। అది నిత్య బహువచనమే। గురజాడతో ప్రారంభ

మైన ఈ ఆధునిక అభివ్యక్తి తిరిగి మరో యిరవై ఏళ్ళకి శ్రీ శ్రీ ప్రభృతుల కవితలలో సామూహిక ప్రతిబింబంగా దర్శనమిస్తుంది.

నేను సైతం ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను।

....

నేను సైతం ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను.

అన్నంత వరకూ వచ్చిన జయభేరి మ్రోగించిన వాడు ఫలానా వారి కుమారుడైన శ్రీశ్రీ అన్న అర్థస్ఫూర్తి పాఠకుడి కెక్కడా కల్గదు. పురాతన విశ్వంలో ఒక సచేతన నవ విశ్వాన్ని నెలకొల్పటానికి జరిగే సమిష్టి కృషి, చైతన్యం మాత్రం ద్యోతకం అవుతాయి. ప్రపంచాగ్ని విశ్వవృష్టి వంటి పదచిత్రాల ద్వారా కవి ఆధునిక అంతర్జాతీయ స్పృహ అభివ్యక్తం చేస్తున్నాడు. విప్లవాత్మకంగా ప్రపంచాన్ని మార్చాలనుకుంటున్న శక్తులకు "నేను" ను ప్రతీకాత్మకంగా నిల్పి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ అంతర్జాతీయ స్పృహ నారాయణబాబులో మరి విస్పష్టమైన ముద్ర పొందింది. అసని కవితా వస్తువుకు నియమితమైన ఎల్లలు నిర్ధారించలేము ఫ్యాక్టరీ. పరిశుభ్రమైన నీరు తాగి కుళ్ళును మాత్రం విసర్జించటం. గగన తలాన్నంతా పొగ మబ్బులతో నింపటం వంటివి ఆంధ్రదేశానికి మాత్రం పరిమితమైనవి కావు

ఆధునిక కవిత్వానికి సామాన్య మానవుడు అతను సర్వం సహామూర్తిమత్వం అధిష్టాన వస్తువు. ఆ వస్తువును విశ్వరూపంతో సాక్షాత్కరింప చేసేరు.

చూ: రుధిరజ్యోతిర్దర్శనం

నా ప్రసంగంలోనే ముందు శ్రీశ్రీ. పురిపండా ప్రభృతులపై నజ్రూల్ ఇస్లామ్ ప్రభావం తీవ్ర స్వరూపంగా అభివ్యక్తం అయ్యిందని పేర్కొన్నాను. దానికి రెండు మూడు ఉదాహరణలు చూపడం అవసరం.

నడు నడు మును ముందులకే
ఊర్ధ్వ గగన మది మ్రోగేనగారా
నిమ్నతలమ్మున ధరణీ హృదయం

క్లేశ శోక సంకుల రవ భారము
ప్రభాత కాంతుల యువ కిశోరమా
పద పద—పద పద
ముందు కురకరా

అనేక కవితా విస్ఫులింగాల కాంతి శ్రీశ్రీ మహో ప్రపంచం కవిత మీద ఎంత నిర్దిష్టంగా ప్రసరిస్తున్నదీ స్పష్టమే ఇంకా స్పష్టంగా

దుర్గమగిరి కాంతారములు, ఎడారులు
రక్తసర పారావారములన్నీ
దుర్భర ధ్వాంత నిశీధులలోనే
లంఘించాలిక తప్పదు యాత్రిక
సాహసమతివై సారస కృతివై
లఘించాలిక తప్పదు యాత్రిక
నదీ నదాలూ, అడవులు కొండలు
ఎడారులా మన కడ్డంకి

అన్న శ్రీ శ్రీ వాక్యం నజ్రుల్ పై పాదాలు భావ స్ఫోరకత్వం లేకుండా గాలి నుంచి వచ్చాయంటే అమాయకులు నమ్మాలి.

అలాగే పులి పంజా గీతంలో

"కోటమీద బొల్లి గద్ద
కోట క్రింది కుకలాసం"

వంటి పద చిత్రాల సాంద్రత నజ్రుల్‌కి ప్రతిధ్వని.

శ్రీరంగం నారాయణబాబు కవిత్వంలో అగ్నివీణ, కపాలమోక్షం, గద్దివరకే వంటి అసంఖ్యాక పద చిత్రాలు నజ్రుల్ కావ్యాలు ధూమకేతు, అగ్నివీణల నుంచి వీచిన ఝుం ఝూ మారు తాలే.

సరిగ్గా ఇదే సమయంలో శిష్ట్లా ఉమామహేశ్వరరావు గుంటూరు జిల్లా నుంచి కవిత్వాన్ని ఆధునీకరించటానికి ఏకాకిగా కృషి సల్పేడు. అయితే అతని అభివ్యక్తిలో ప్రతీకలు, పద చిత్రాలు నెలకొల్పటంలో ముక్తచ్ఛంద స్వరూపాన్ని

దక్షతతో నిర్వహించటంతో పరిమితమైంది తప్ప ఆధునిక ప్రపంచ స్పృహాగల ఇతివృత్తాన్ని ఎన్నుకోడం జరగలేదు. అయితే సాంప్రదాయికంగా వస్తున్న ఇతివృత్తానికి కల ఎల్లలను అతనూ ఛేదించాడు. సామాన్యజనుల నైతిక పతనాన్ని. ఈతి బాధలను మునుపెన్నడూ లేనంత స్పష్టంగా అభివ్యక్తం చేసేడు నా ప్రేమలీల అనేకవితలో మోసగింపబడ్డ మధ్యతరగతి వనిత ఆక్రోశం గంభీరనాదంగా వినిపింపచేసేడు. 1930 ల దశాబ్దం అంతా ఆధునిక స్పృహతో కవులు జరిపిన ప్రయోగ శీలతకు కంకణం కట్టుకుందా అన్పిస్తుంది. అందుకే కాణాచిగా నిల్చింది. పండిత ప్రకాండుల పొత్తిళ్ళల్లోంచి నేరుగా ఆధునిక లోకంలోకి ఊడిపడ్డ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, గురజాడ, వాల్మీకి అనే ఉద్ఘాటనతో గురజాడను ఆధునిక కవితా శ్రేణికి ప్రథమః గుర్తించారు. అయనే ఉపనిషత్తులు, వేదాలు ప్రశ్నింపవలసినవి కావన్న సాంప్రదాయిక అజ్ఞానం ఛేదించి.

ఉపనిషద్వీధిలో ఊరేగుదానా
ఉర్వీదౌర్జన్యాల కూరుకున్నావా?

అని కంఠోక్తిగా సవాలు చేయటం ఆనాటి యువ హృదయాలను ఆవేశ పరిచింది.

పాలగుమ్మి పద్మరాజు కవిత్వాన్ని హృదయావేశ బంధాలనుంచి విముక్తం చేసి హేతువాద విచికిత్సకు ఆకారంగా నిల్పడం దాదాపు మొదటి ప్రయత్నంగా విజయవంతమైంది. "చీకటి ఒక మహోద్యమంలా ప్రారంభించి. పగలుపోని, రేయి రాని సంధ్య సందిగ్ధంమీద అనేక ప్రాణుల పరిసర స్పర్శ తగిలి కుంచితమైపోయిన అంతరాంతర రూప పరిమితి నశించిన అఖండ భావనాకాశంలో స్వేచ్ఛగా అణువు అణువు వ్యాపించింది అనేక నక్షత్రాలై వంటి శాస్త్రీయ సత్యంలా భాసించేకవితోక్తిని సృష్టించటమేకాక ముక్తచ్ఛంద కవితకు ఒక రుచిర రూపాన్ని ఘటించేరు.

సంపత్ (శంఖవరం సంపతురాఘవాచారి) ఆధునిక రీతిలో అసంఖ్యాక రచనలు చేసి పరిపుష్టం చేసేరు. ఆధునిక మానవుడు రుద్రనేత్రం తెరచి చూడాలని అనుశాసించేరు. అప్పటికిగాని "మృత్యుగానపు లోకాలు, రక్తపానపు జలాశాలు. మర్మఘాతుక శలాకాలు గుండె రేకులు చీల్చివేస్తూ, జీవసారం పీల్చివేస్తూ, స్వప్నసౌధం కూల్చివేస్తూ హృదయమును రణభూమి చేయటం" విస్పష్టంగా కన్పించదని ఉద్ఘాటించేరు.

పిలకశాస్త్రి సంప్రదాయిక పండితుల శుశ్రూషలోంచి బయటపడ్డ పండితుడు,

అయినా పాండిత్య ప్రకర్షను ఒక మూలకునెట్టి ఆధునిక వ్యూహాలో వీధినపడ్డాడు. "ఘోరని గాలి దుమారము లెగరెను, భోరని ధారావర్షం కురిసెను. చీకటిలో ఎవరో ఆ పేదలు ఆకలితో ఏవేవో ఘోషలు అమ్మా మాధవా భళం తల్లీ" అంటూ వర్తమాన క్షుభిత హృదయాలను ప్రతిధ్వనించేరు.

అలాగే వాన అనే కవితలో కూడా "వాన హాయిగా కురిసెనుకాని—కానీ కాని దరిద్రుల కన్నీళ్ళన్నీ ఈ నీళ్ళల్లో ప్రవహిస్తున్నాయి కదా" అంటూ మాత్రా ఛందస్సుల ప్రాబల్యం తగ్గించని వచన పద్యంలా సంతరించేరు.

1930-40 దాకా కల దశాబ్దంలో ప్రయోగవాదులైన కవులు అనేకులు ప్రాముఖ్యం వహించేరు. అందరిదారి దాదాపుగా ఒకటైతే "పఠాభి" దారి వేరొకటి. అప్పటికే మనదేశంలో నగరాల పెత్తనం స్థిరపడింది. నగర జీవన సంక్షోభం చెలరేగ నారంభించింది. నాగరికత తొలి సౌకర్యాలు నెలకొల్పుకుంటుంది. ఆంధ్రదేశ ప్రజాజీవితం పల్లెపట్టులకే పరిమితం కావటంవల్ల అంతవరకు కవితా సామాగ్రిగా వున్న "దిగంత రేఖలు", "చంద్రికా రేఖలు", ఉదయ సూర్యకిరణాలు, కోకిల గానాలు, చిగురులెత్తిన చెట్లపిలుపులు- ఇవన్నీ ఒక్కసారిగా మటుమాయమై నగర జీవన వైవిధ్యం పఠాభికి కవితా సామాగ్రిగా మారింది అత్యాధునిక బహుముఖాలుగా దర్శన మిచ్చింది సంఘానికి వేస్ట్‌పేపర్ బాస్కెట్‌గా వున్న భోగం వాసలు వెన్నెల సౌరుల విస్మరింపచేసే నియాన్ లైట్ల కాంతిపుంజాలు వంటి నాగరిక జీవన రూపాలన్ని మొట్టమొదటిసారిగా పఠాభి కవితలో నిలిచాయి. అయితే గ్రాంధికమో, ఏలిక మైన వ్యవహారికమో తెలియని ఒక కృతక భాష ప్రాబల్యం వహించి నగరజీవనం లాగే కృత్రిమ శోభ వెలార్చింది. కవితలో జీవన బీభత్సం మితిమీరి లలిత భావన మృగ్యం కావటం వలన, కొద్దిమంది రచయితలు, పాఠకులు మాత్రం ఆదరించిన కవిగా పఠాభి మిగిలేడు.

ముఖ్యంగా ఆ దశాబ్దిలో పఠాభి పాఠకులు చాలా తక్కువ. ఈ కవిశ్రేణిలోనే అనూన సంప్రదాయంగా ఆంధ్ర కవిత్వానికి ఆధునికత్వాన్ని అబ్బచేసిన వారిలో "పింగరాచార్య" వంటివారు కూడా ఉన్నారు. తిలక్ ఆ శతాబ్ది అంతంలో ఒకెత్తి 1966లో చనిపోయేముందు దశాబ్దంలో విస్తృతంగా విఖ్యాతుడయ్యాడు. అలాగే అనిశెట్టి.

ఆరిపోతున్న దీపం ఆఖరి కాంతులను ఎంతైనా ఉజ్జ్వలంగానే ప్రకాశింప

జేస్తుంది. అలాంటిదే భావకవిత్వపు అంతిమదశలో పుట్టిన మల్లవరపు విశ్వేశ్వరరావు కవిత్వం. ఎంతకన్నా దానికి ప్రామాణ్యత లేదు. ఆధునిక కవితా శ్రేణిలో నిలపాలన్నా నిలవదు.

వర్జీనియా వుల్ఫ్ ఆంగ్లసాహిత్యం గురించి విశ్లేషిస్తూ ఆధునికత్వం ప్రప్రథమంగా ఆంగ్ల కవిత్వంలో 1910లో ఆవిర్భవించిందని యాదృచ్ఛికమే అయినా ఆంధ్ర కవిత్వంలో సైతం సరిగ్గా అదే 1910లో గురజాడతో ఆధునిక కవిత్వం పాదుర్భవించింది.

—సోమసుందర్

అనంతపథంలో

ఎప్పుడు బయలుదేరానో
నిమిషాలు గడిచాయి
గంటలు కూడ
రోజులు గడిచాయి
వారాలు కూడ
గడిచాయి మాసాలు
సంవత్సరాలు కూడ
వ్యతీతమయాయి
శతాబ్దాలు కూడ
కావి కావి
నడిచింది
తక్కువ
నడవనున్నది
ఎక్కువ

నడక సాగదు

అనంత పథంలో.
బాగున్న భాగం
ఎంతో తక్కువ
రాళ్ళున్న భాగం
ముళ్ళున్న భాగం
బురదున్న భాగం
ఎంతో ఎక్కువ;
ఎండలో నడిచి
నీడలో నడిచి
ఉక్కలో
గాలిలో
చీకట్లో
వెన్నెట్లో
ఆశతో నిరాశతో
నడిచి నడిచి
పైకి చూస్తూ
కొంత సేపు
క్రిందికి చూస్తూ
మరికొంత సేపు
తూర్పుకు చూస్తూ
ఇంకొంత సేపు
పడమట
ఉత్తర దక్షిణాల వైపుకు
చూస్తూ ఎంతో
ఎంతో ఎంతో సేపు
నడవటం నడవటం
వడిగా నడవటం
వేడిగా నడవటం
మధ్య మధ్య

కూర్చుంటూ నడవటం.
మైళ్ళ మైళ్ళ వరకు
రైళ్ళవలె
పరుగులు తీయటం
ఎక్కడైనా
మజిలీల్లో
మకాములు.
తిరిగి మళ్ళీ
పడకలు
పరుగులు
ఉరుకులు:
ఎంతవరకు?
మార్గం ఎక్కడంతమవుతుందో
అంతవరకు;
మార్గం
అంతం కావటంలేదు
మార్గస్థుడు
ఆగటంలేదు:
బయలుదేరిన తావు
తెలుస్తుంది
ఆగాలసిన తావు
అంతులేదు:
అందుకని
ఆగిన చోటునే
అంతం అనుకొంటే?
ఆ విధంగా
భావించవచ్చు
బాటసారి,
బాటమాత్రం

భావించదు;
బాటసారి ఇష్టాన్ని
అనుసరించదు బాట,
బాటసారి
అనుసరించాలి
బాట ఇష్టాన్ని;
పథలోనివాడు
పథికుడు
పథికునిది కాదు
పథం.
పథం సూటిదైతే
పథికుడు నడుస్తాడు
సూటిగా.
పథం వంకరైతే
నడుస్తాడు పథికుడు
వంకరగా;
పథం నడిపితే
పథికుణ్ణి
తిరిగి నడుపుతాడు
పథాన్ని
పథికుడు
పథంలోని
వంకరలను
సరిచేస్తాడు.
రాళ్ళను తొలగిస్తాడు
ముళ్ళను ఏరేస్తాడు

ఎత్తు పల్లాలను
సమపరుస్తాడు;
తాను మార్చిన
పథాన్ననుసరించి
పయనిస్తాడు
ముందు ముందుకు;
పథాన్ని పరిచేవాడే కాని
అందుకోలేకపోతున్నాడు
అసలు గమ్యాన్ని;
గమ్యం ఎరగని
పథికుడు
గమ్యాన్ని ఏమి
చేరుకొంటాడు?
గమ్యాన్ని
చేరే పథికుడైతే
గమ్యంలేని పథాన్ని
ఎన్నుకోటం
ఎందుకు?
అనంతంగా
కనిపిస్తుంది
పథం;
ప్రతి మజిలీ
దేనికది
అంతంగా ఉన్నట్లు
కనిపిస్తుంది,
కాని
ఆ మజిలీని
చేరుకోగానే
పథం ఇంకా

ముందుకు
పరపడదే ఉంటుంది:
దిగంతమే
ఈ పథానికి
అంతమా?
అసలు ఆ పథంలో
దిగంతమే
గోచరించంది
ఇక దిగంతపు అంతం
ఏమి గోచరిస్తుంది?
నిజానికి
పథం
అంతంకాకుండా
ఉండాలనే
పథికుని
ఆకాంక్ష;
ఆగని పయనమే
అంతంకాని పథకయే
పథికుని
ఆశయం;
అంతమైన
పథాన్ని
వదలి అయినాడు
పథికుడు
అనంతపథంలోని
పథికుడుగా!
పథం అంతమైతే
గమ్యాన్ని చేరితే
ఇంకా చేసేందుకు

మిగిలేదేమిటి?
ఇంకా పోయేదెక్కడికి?
పోకుండా ఉండటమంటే
ఉన్నచోట
ఉండి పోవటమే;
ఉన్నచోట
ఉండిపోవట మంటే
జీవనగతికి
ప్రగతిలేదు;
గతి లేనప్పుడు
ప్రగతి లేవప్పుడు
జీవితం
అవుతుంది
గతిలేని నిలకడ
ప్రగతిలేని
స్తంభన
గతిలేని జీవితం
మృతికి మరో రూపం;
కనుకనే
అంతంలేని
అనంతపథం
గమ్యంలేని
రమ్యమార్గం;
పథికుడు
నడుస్తూనే ఉంటాడు
నిరంతరం
చిరంతనంగా
ఆనందమార్గంలో
అనంత పథంలో.

—డా॥ సంజీవ దేవ్

భావకవిత్వం తీరుతెన్నులు

ఇరవయ్యో శతాబ్దం పూర్వార్ధంలో నవ్య కవిత్వంగా వెలుగుచూచిన భావకవిత్వం మూడు దశాబ్దాలపాటు తన తళుకులను విరజిమ్మింది. కులుకులను కుమ్మరించింది. కొత్త అనుభవాల కాంతిపేటికలను తెరిచింది. విశ్వమంతా ప్రాణవిభుని మందిరంగా భావించి మానవతా సంగీతాన్ని మారుమ్రోగించింది. పుట్టలోని పాములాగ, రేకులు విప్పుతున్న పువ్వులాగ గళద్వారపు గడియ తీసుకుని సుతారంగా వచ్చి నిలిచింది. మనస్సున మల్లెలు పూయించింది. కన్నుల వెన్నెల దోలల నూగించింది. దేశభక్తిని రంగరించి. కవితామకరందాన్ని అందించింది.

కొందరు పనిగట్టుకొని ఆక్షేపణలు పెట్టినా భావకవిత్వం పండిత కవులకు కూడ గిలిగింతలు పెట్టకపోలేదు. శేషాద్రి రమణ కవులు, కొమాండూరి కృష్ణమాచార్యులవంటివారే భావకవిత్వాన్ని వ్రాయాలనే కోర్కెను అణచుకోలేకపోయారు. మడికట్టుకున్నవాళ్ళు ఎంత ముక్కుమీద వేళ్ళేసుకున్నా పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారి వంటి ప్రముఖ వ్యాకరణవేత్త, సాహితీ సమీక్షకులుకూడ శాస్త్రీయ దృక్పథంతో భావకవితోద్యమాన్ని సమర్థించటం జరిగింది. తన పాండితీ ప్రతిభతో విశ్వనాథవారు కల్పవృక్షాన్ని సాహితీ లోకంలో నాటినా భావకవితపట్ల ఆయనకు వల్లమాలిన ప్రేమ కదా! అభ్యుదయ కవిత్వయుగకర్త శ్రీశ్రీ కూడ తొలిరోజుల్లో భావగీతాలను ఎక్కువగానే సృజియించారు.

నవ్యకవిత్వంగా చలామణీ అవుతున్న తొలి రోజుల్లో విషయ వస్తువుకీ, రసాన్నీ మించి భావావిదే పైచేయిగా వున్న కవితల్ని రాయప్రోలువారు భావగీతాలని పిలిచారు. 1920 ప్రాంతంలో ఆంధ్రపత్రిక దినపత్రిక సంపాదకులుగా వున్న గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు దానికి భావకవిత్వం అని నామకరణం చేశారు. భావగీతాలకూ lyrioal poetry కి సారూప్యత ఏర్పడింది. కట్టులో జుట్టులో కూడ ఓ ప్రత్యేకతను నిలుపుకున్న భావకవులు కాల్పనికత (romanticism) వైపు ఎంతగానో ప్రభావితులయ్యారు. స్వేచ్ఛ వాళ్ళకు ఊపిరి. భావకవిత్వ మనగానే అంతర్ముఖత్వం. ఆత్మసౌందర్యం. ఆత్మార్పణం. ఆరాధన, అలౌకికానందం మొదలైన భావాలు మనసులో సుడులు తిరుగుతాయి.

అసలు భావకవిత్వమంటే ఏమిటి. దీనికి సమాధానం ఎందరో ఎన్నో విధాలుగా చెప్పారు. విశ్వనాథవారి మాటల్లో — "కవి యొక్క ఒక అవి స్పష్టవాంఛాంతరము. ఒక అంతర్నిగూఢ భావము ఒక చిన్న కావ్యములో ఊదబడినచో అది భావ కవిత్వ మవుతుంది" పాటిబండ్ల మాధవశర్మగారి ప్రకారం అది గానయోగ్యం కూడ కావాలి. ఇక శ్రీశ్రీగారు "హృదయాలను, మానసాలను కలవరపరుస్తూ అల్లకల్లోలంగా ఘూర్ణిల్లే ప్రమాద ప్రాంతాలలో కవికి నిరాఘాటంగా విహరించే అధికారం కలదు. అట్టి కవి సంచారాలలో ఏ సుమ్మోహనార్ద్రక్షణానో కావ్యగీతం ఒకటి మెరుగు గుండెలోని ఏ సంవేదనా రోచిస్సులో వెలుగు చూస్తుంది. ఆ గీతం కవి అనుభవించిన రసస్థాయిని సమగ్రంగా పాఠకునిలో ఆవిష్కరించ గలుగుతుంది. ఉత్కృష్ట భావగీతానికి నా నిర్వచనం ఇది" అన్నారు. డాక్టరు సీతాపతిగారి దృష్టిలో భావకవులు సమకాలీన జీవన చిత్రణ చేస్తారు; వారి ఆనందాలను ఆవేదనలను గానం చేస్తారు, వారి ప్రణయాలలోని సఫలతలనూ, విఫలతలనూ కమ్మని కవితలుగా సృజియిస్తారు. ఎందరెన్ని విధాలుగా దర్శించినా నిర్వచనానికి అందని సొబగులేవో భావ కవితలో దాగున్నాయని భావించేవారూ లేకపోలేదు.

భావకవిత్వాన్ని డాక్టర్ పి నారాయణరెడ్డిగారు ఆరు శాఖలుగా విభజించారు. 1) ప్రణయ కవిత్వము 2) ప్రకృతి కవిత్వము 3) భక్తి కవిత్వము 4) దేశభక్తి కవిత్వము 5) సంఘ సంస్కరణ కవిత్వము 6) స్మృతి కావ్యాలు.

ప్రణయ కవిత్వం చెప్పిన భావకవులలో స్వీయ అనుభవాలను గానం చేసిన వారూ ఉన్నారు. ఊహా ప్రేయసిని సృష్టించుకొని పలవరించిన వారూ ఉన్నారు. రాయప్రోలు వారి "తృణకంకణం". అబ్బూరి వారి "మల్లికాంబ". దువ్వూరివారి "కడపటి వీడ్కోలు"లలో రసవత్తరంగా ఊహా ప్రేయసి సృష్టి జరిగింది. దేవులపల్లివారి కృష్ణపక్షము". నాయని వారి" సౌభద్రుని ప్రణయ యాత్రలలో స్వీయ ప్రణయోదంతాలు పాఠకుల హృదయాలను ఊపి వేశాయి. భావకవులు సంయోగ శృంగారానికి స్వస్తి చెప్పి వియోగ శృంగారానికి స్వాగతం పలికారు. దానికి వారు అమలిన శృంగారమని పేరు పెట్టుకొన్నారు. అమలిన శృంగార ప్రణయ భావనకు మచ్చుతునకగా వేదులవారి గీతిక:

"ఆమె నవనీత హృదయ, నా యంతరంగ
శాంతిదేవత. అగా ధాంత

పారిజాతమ్ము ప్రేమజీవన విభాత
శైశిరీ గీతి, నా తపః కల్పవల్లి"

స్వచ్ఛంద ప్రణయము, పూర్వరాగము, సంయోగ దశ, ఆశాభంగము, విషాదస్థితి, నిరాశావాదము, విషాదమాధురి, ఊహా ప్రేయసీ సృష్టి, ప్రేయసీ పూజ్యత వంటి ఎన్ని భావనలు ఈ ప్రణయ కవితా వేణువుల నుండి మధుర నాదాలుగా వెలువడినవో భావకవుల చేతిలో ప్రేమ ఎన్ని రాగాలుగా మారి ఎన్ని గానాలు పోయినదో! హృదయేశ్వరి, వత్సల ఊర్వశి, శశికళ కిన్నెరసాని, యెంకి వంటి ఎందరు ప్రేమైక నాయికల పరిచయ భాగ్యమబ్బిందో తెలుగువారికి!

ప్రకృతిలోని అందాన్ని చూచి ఆనంద తరంగితులయ్యే వాళ్ళు భావకవులు, నీలి ఆకాశం, మిలమిల మెరిసే తారకలు చల్లని వెన్నెల వర్షించే మేఘాలు, విరిసే కుసుమాలేగాకుండా గడ్డిపువ్వులు, గుడ్డిపువ్వులు కూడ కవితావస్తువులయ్యాయి వారికి. కేవలం వర్ణనల కొరకు వర్ణనలు కావు వారి ప్రకృతి వర్ణనలు. ప్రకృతి పులకరింతకు వాళ్ళ హృదయాలు ఎలా నర్తిస్తే అలా దర్శింపజేయటమే వాళ్ళ ధ్యేయం. దువ్వూరి రామిరెడ్డి, దేవులపల్లి కృష్ణశాస్త్రి ఈ తరహా ప్రకృతి కవిత్వం అందించటంలో వాసికెక్కారు. మరో వైపు నుండి కవి కొండల వెంకటరావు, నండూరి వెంకటసుబ్బారావు, కొనకళ్ళ వెంకటరత్నం వంటి వారు జానపద శైలిలో భావ గీతికల్ని అందించారు భావకవుల ప్రకృతి వర్ణనలలో "సుక్కలన్ని కొండమీద సోకుజేసుకుంటవి." "పంట బోది పసిమిసితో పకపక నవ్వుతుంది; పల్లగాలి తోటకంత సక్కలిగిలి "పెడుతుంది." ఎన్నెలంతా మేసి ఏరు నెమరేస్తుంది వొయ్యారంగా ఒగలుపోయే ఒనలచ్చిమి కూసింత సేపు కళ్ళు మూసుకుని కూకుండ నీదు. నల్లని యెన్నెట్లో సాపేసి కూకుంటే కళ్ళు మూసినా కళ్ళు తెరిసినా ఆమె అందాల పందాలే!

"తోట ఆకుపచ్చపైట తొలగిజార

పూలరొమ్మునిక్క పొడిచి నిలిచె"—తిలక్ తన కవితలో ప్రకృతిని అలా చిలికిస్తే శేషేంద్రశర్మగారి భావశబలతలో ప్రకృతి ఇలా దర్శనమిస్తుంది.

"ఆకాశపు నీలి నికుంజం వెండిపూలు పూచింది
మల్లెపూల బాటల్లో మబ్బుల విచ్ఛోక వతులు

వెడలెను అతి షోకుగా వెన్నెల తిరునాళ్ళకు

వెళ్ళిపోకు జాబిల్లీ నా ఊహల పాలవెల్లీ"

భావకవులను ఆకర్షించిన మరో విషయం మధుర భక్తి. వెంకట పార్వతీశ్వర కవుల "ఏకాంత సేవ"లో, విశ్వనాథవారి శృంగార వీధిలో, దువ్వూరి వారి "పిచ్చిబికారి"లో మధుర భక్తి పెల్లుబికి ప్రవహించింది. ఇక దేశభక్తి కవిత్వం విషయానికొస్తే ఆంధ్రుల వీరోచిత గత వైభవం, ఎనలేని భోగ భాగ్యాలు, కళ పట్ల వారికి గల మక్కువ ఎక్కువగా చోటు చేసుకొన్నాయి. తుమ్మల వారి "రాష్ట్రగానము" విశ్వనాథవారి "ఆంధ్రప్రశస్తి" కొడాలివారి "హంపీక్షేత్రము" పుట్టపర్తి వారి "పెనుగొండ లక్ష్మి." ఏటుకూరి వారి "నాయకురాలు" గాదె జగన్నాథస్వామి గారి "ఆంధ్రదేశ ప్రశంస" ఈ కోవకు చెందిన రచనలు.

సంఘ సంస్కరణ విషయంలో మంగిపూడి వెంకటశర్మగారి "వితంతు విలాపము" భోగరాజు నారాయణమూర్తి గారి "పండుగకట్నము" రాయప్రోలు సుబ్బారావుగారి "స్నేహలత", జాషువగారి "గబ్బిలము" త్రిపురనేని రామస్వామి చౌదరిగారి "శంబుకవధ" సూతపురాణము, తుమ్మల సీతారామమూర్తిగారి "ధర్మజ్యోతి", "ఆత్మార్పణము", కాటూరి వెంకటేశ్వరరావుగారి "గుడిగంటలు" ఎన్నదగిన రచనలు.

భావ కవుల కవిత్వంలో విషాదానిదీ పెద్ద పీటే. వారి కవితలు మధురమైన బాధలుగా భాసించాయి. ఆంగ్ల కాల్పనిక కవుల రచనల వల్ల ప్రభావితులైన బసవరాజు అప్పారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి, బాలాంత్రపు వెంకటరావు, గుర్రం జాషువ, నాయని సుబ్బారావు వంటి వారు గుండెలు పిండి వేసే స్మృతి గీతాలను రచించారు.

"మా గుండె గుబులు పెల్లుబికి విరియ

మా కన్నులు నీరు దలిన పెన్న కాలువలు"—ఇది నాయని వారు అనుభవించిన పుత్రశోకం. ఇటువంటి శోక గీతికలు పాఠకుల హృదయాలను కూడ కలచివేసి అశ్రువర్షం కురిపించగలవు.

భావకవితల ఈ శాఖా విభజన సౌలభ్యం కోసమేగాని గిరిగీసి అందులో నిలిపేదానికి కాదు. ప్రణయ కవిత్వం ప్రధానంగా గల రచనలో ప్రకృతి వర్ణన

తొంగి చూస్తుంది. ప్రకృతి వర్ణన ప్రధానంగా గల రచనలో భక్తి భావం పంపు చేసుకోవచ్చు. భావ కవుల రచనలలో ఇవన్నీ మనోజ్ఞంగా, శక్తివంతంగా, సుతారంగా కలగలిసి పోతాయి.

భావకవులు "స్వప్నపు నీలి క్రొందెరలు" "మౌనభాష్పకణము" వంటి అద్భుతమైన భావ చిత్రాల నెన్నింటినో సృజియించారు కృష్ణశాస్త్రిగారి "పల్లకి" నిండా అవే. భావ కవులు క్రొత్త క్రొత్త పవనాలను ఎన్నింటిని కవితాలోకంలోకి విసిరేసారో! వలపుటాకలి" వారెరుగుదురు. మూగకనుల సోయగాలు" వారు కన గలరు. ఇరుల "గుసగుసలు" వారు వినగలరు. "మబ్బుకన్నెలతో వారు మంతనా లాడగలరు "పూలదీపాలు" వెలిగించగలరు. "జాలి వెన్నెల"లు కురిపించి, "మంచు మంటలు" వేయగలరు. వారి నగిషీ పదలవంలో పాత మాటలు కొత్త అందాలతో జిగేల్‌మన్నాయి.

భావకవులలో పద్యరచన చేపట్టినవారున్నారు. గేయ రచన కొనసాగించిన వారున్నారు. రెంటినీ కలబోసి రచనలు చేసిన వారున్నారు. "సౌభద్రుని ప్రణయ యాత్ర", "తృణ కంకణము". గిరి కుమారుని ప్రేమ గీతాలు" "మల్లికాంబ" వంటివి పద్య రచనలైతే "కిన్నెరసాని పాటలు." "వకుళమాల" "శశికళ" "యెంకి పాటలు" బంగారి మామపాటలు' గేయ రూపంలో వెలువడినాయి. "కృష్ణపక్షము" ప్రవాసము" ఊర్వశి" హృదయేశ్వరి" వంటి రచనలలో పద్యము గేయము పడుగు పేకల్లా అల్లుకు పోయాయి పద్యాలనూ, గేయాలనూ అందంగా కూర్చుకుంటూ తల్లావఝుల శివశంకరశాస్త్రి ఎన్నో రూపకాలను అందించారు.

ఇంతటి మనోహర కవితారీతి [illegible] చేయబడినంతగా వేరొకటి చేయబడ లేదు. లాక్షణికుల కట్టుబాట్లను ధిక్కరించి భావకవుల కవితల్లాటం ఇందుకు ప్రధానకారణం. భావకవిత్వంలో అక్కడక్కడా లోపించిన చిత్తశుద్ధి చలంగారితో చురకలు వేయించింది. ఏది ఏమయినా 1900-1930 మధ్య కాలంలో భావకవితా ప్రభావం నుండి తప్పించుకోగలిగిన కవిలేడంటే సత్య దూరం కాబోదు. తరువాత అయినా అడపాదడపా భావకవితలు అక్కడక్కడా తొంగి చూస్తూనే ఉన్నాయి. అయితే తక్కిన నవ్యకవితా ధోరణుల మధ్య నలిగిపోతున్నా మొగలిపొదలో దాగిన పరిమళవలె కవితా పిపాసువులకు సుడివేస్తూనే వున్నది. లోలోన నసి చెడినట్లున్న మానసాలకు మధుర బోగొట్టే మధురానుభూతులను అందిస్తూనే

వుంది. డాక్టర్ కడియాల రామమోహనరావుగారి వంటి నిశిత విమర్శకులు ప్రకృతి సౌందర్యమూ, వేడుకలు వున్నన్నారు. భావకవిత్వం పూర్తిగా కనుమరుగు కాదని పిస్తుంది అంటూంటే కొన ఊపిరితో వున్న భావకవితకు ఏవో కొత్త ఊపిరి ఊదినట్లయ్యింది.

—రావెల సాంబశివరావు

ప్రబోధాత్మక పాటలు పాడిన పల్లెపదాల ప్రేమకవి శ్రీ కొనకళ్ళ

కమనీయ, జానపదకవి సహజ స్పృహ కలిగిన కథకుడు "శ్రీ కొనకళ్ళ."

కొనకళ్ళ వెంకటరత్నంగారి బంగారిమామ పాటలకెంతో పెద్దపేరు వచ్చిన మాట నిజం. కానీ ఇతరమైన పాటలుగూడా ఎన్నో మంచి ప్రచారానికొచ్చినై. ఆయన ప్రబోధ గేయాలు, జోలపాటలు, భావగీతాలు జాతీయగీతాలు, యుద్ధగీతాలు, ఎంతోమంది పాడుకొంటూ వుంటారు. మనకి రేడియోలో వినిపిస్తుంటై. ఒకటి మచ్చుకి.

చలోరె ముందుకు చలో యువకుడా
స్వతంత్ర భారత స్వర్ణయుగాలవె ॥చలోరె॥

నాది నాదను వినాదములో భువి
నరక కూప మొనరించిన వరుడా
మనది మనదను విశాల భావనల
మనరా మనుకొని చనరా చిరాన ॥చ॥

స్వార్థ పరత వర్ధిల్లించే నీచులు
సారెకు వర్ధిల్లించకు మన్నా
సర్వజనతా శుభోదయమని వనీ
శాంతి శోభవిమిడి యున్నదన్నా ॥చ॥

నాదినాది అన్నమాట ఇన్నాళ్ళ-మతం. మనదిమనది అనమంటున్నారిప్పుడు. ఇట్లాంటి విశ్వజనీన భావాలు వారి గేయాలలో కోకొల్లలు. అట్టడుగున ఉన్న సామాన్యుడి సుఖసంపదలంటే ఆయనకెంత పక్షపాతమో చూడండి.

భారతదేశం నాదని చాటి
సారెకు విరుచుక పలుకన్నా భుజి
నే కడనైనా చేరగలదునా
వెంతని తీవిగ నిలువన్నా ॥భారత॥

స్వరాజ్య మొకటున్నా లేకున్న
సంపన్నుడు సుఖమేనన్నావట
శ్రమ జీవికి అందై నిలిచే. పట
స్వాతంత్ర్యమె స్వర్గమురన్నా ॥భారత॥
పసుల గసుల పెన్నదుల పిరుల్, వి
ద్రాణమైన క్షేత్రమురా యిది
స్వార్థ పరత గిరిగీయని చోట్లకు
సంపత్తుల్ తరలింపన్నా ॥భారత॥

ఈ వాక్యాలు గురజాడవారి "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులు" అన్న పలుకుల్ని స్మరణకు తెస్తాయి. ఒక మామూలు సిపాయిని ఎంత ఉన్నతమైన అంతస్తులో చూపుతున్నారో చూడండి "కొనకళ్ళ."

సిచిందిన నెత్తురు బాట
తారాజుల నవ్వులతోట
నీవిడిచిన గ్రుక్కెడు ప్రాణం
తాజ్యాంగపు తొలి సోపానం
నీ అస్థులు విస్మృతి పాతై
యుగ సంధుల వంతెన లైనై

ఒక యుగం వెళ్ళి యింకోయుగం వచ్చినప్పుడల్లా నీ అస్తికలు వంతెన లైనై అంటున్నారు. అంటే నీ శవమ్మీదుగా కొత్త యుగాలు. కొత్త నాగరికతలు. కొత్త రాజ్యాలు, స్థాపింపబడుతున్నై అన్న భావాన్ని ఎంత దయనీయంగా చిత్రించారో కొనకళ్ళ. శ్రీ కొనకళ్ళని సిపాయి కవి అనేవారు కొన్నాళ్ళు. ఇది ఒక పాట కచేరీలో శ్రీ ఈదర నాగరాజుగారు పాడగా విన్నానునేను.

మనచుట్టూ నడుస్తున్న అవినీతిని ఎంత సున్నితంగా ఎంత హాస్యంగా వేలు పెట్టి చూపగలరో వినండి కొనకళ్ళ

ఘూటమ తెచ్చిన మొనగాడా, మనె
మూటిప్పాలని పెత్తనమిస్తే
మూట చంకనెట్టిను మా అందరి
ముల్లె సుమా అది జాగరతయ్యా ॥స్వరాజ్యమంటే॥

దొంగతలకు దొరటోపీ ఉంచను
దూరకుంట ఇలు దోచేస్తారు
దొంగా దొరలాలోచి అయితే
దోపిడి కి దొరతనమని పేరు.

ఈ పాటకు నేను నా అభిమాన నాట్యకళావేత్త శ్రీ ఘంటా కనకారావుగారిచే నృత్యం చేయించాను అనేకచోట్ల ఎవరో ఒక Reviewer వెంకటరత్నంగారి కవిత్వంలో హాస్యం లేదన్నారు. "మొక్కజొన్న తోటలో" అన్నపాటలో ఎంతెంత హాస్యం వుంది. సున్నితమైనదే అనుకోండి. "తంటా మన ఇద్దరికీ తప్పదు మామయ్యా" అన్నప్పుడూ చెదిరిపోకు మామయా బెదిరిపోకు మామయ్యా, వదురుకొపి వదునుగుండె నక్కని మామయ్యా-" అన్న మాటలలో ఎంత గిలిగింత వున్నది. ఆయనది చందమామ పాట ఒకటున్నది. అందులో కోడలుపిల్ల చందమామని పిలిచి తనకీ, కోపగించి వెళ్ళిపోయిన బంగారి మామకీ రాజీ కుదర్చమంటుంది. మొట్ట మొదట చందమామని పొగిడి ప్రసన్నంగా చేసుకొంటుంది. తరువాత తన పని పురమాయిస్తుంది.

ఎక్కడికి పొయ్యేవు చందమామా ను
వ్వెందాకా పయనాలూ చందమామా
మబ్బుంపుల గుర్రమెక్కి మహా పసందు తాజితీని
మలచుతెరలు వల్లెవాటు మాటికి సవరించుకొంటు ॥ఎక్కడికి॥

ఎత్తున వున్నావు. బంగారి మామ ఎక్కడున్నాడో చూచి
చిగిరించిన తోటంతా చిన్నబోయెనని చెప్పు
వెచ్చని వెన్నెల కాలము వొచ్చిందనరా చెవిలో ॥ఎక్కడికి॥

వెన్నెల చల్లదనానికి పేరుగదా వెచ్చని వెన్నెలేమిటి అన్నాను వారితో ఒకసారి. విరహజ్వరం సోకినపుడు వెన్నెల వెచ్చగా వుంటుంది ఒకసారి చూడండి అన్నారు కొనకళ్ళ.

ఎండో ఎన్నెలో నీ మన
పేదో రుజువీ రాతిరి
చల్లని దొరవయితె మము
జంట కలిపిపో చూతము.

నీ మనస్సు ఎండో, వెన్నెలో తేలాలి. మమ్మల్నిద్దరినీ కలిపి మువ్వ చల్లని దొరతని రుజువు చేసుకో అని ఛాలెంజ్ చేస్తోంది. ఇందులో ఎంత సౌఖ్యమున్నది.

"మా భారతదేశమా, వదరా వదా ముందుకు వదరా"

ఇట్లాంటి గీతాలు శ్రీ బి. వి. గారినెందుకు ఆకర్షింపలేదో ఆశ్చర్యమే. వారి నాట్యంలో సాహిత్యంలో లాలిత్యానికి ప్రాధాన్యమిస్తారు అనుకొంటాను శ్రీ బి. వి.

ఇకపోతే శ్రీ కొనకళ్ళ వారి బంగారి మామ
శృంగార నాయకుడు మాత్రమే కాదు.

వెళ్ళిపోదామా
వెళ్ళిపోదమ పట్నవాసపు కుళ్ళు వీధులలో బడి
ఋణము పైవున్న వైరులు ఏటిమువకల పాలుజేసి
కొంపగోడే విడచి పస్తైదు కూటికై ఊరేగవలెరా
వెళ్ళిపోదామా

అని పంటలు పోయి పట్నవాసం కూలికిపోయాడు బంగారుమామ. ఈ పాట శ్రీ ఘంటసాలగారు ప్లేబ్యాక్‌లో పాడారు. "అంతా మనవాళ్ళే" అన్న సినిమాలో, ఒక సినీ పత్రిక ఆ పాట రికార్డవుతుండగా విన్నవాళ్ళకే గుండె పట్టేసిందని వ్రాసింది.... ఈ పాట "శ్రీ నాజర్‌గారు" తన బెంగాల్ కరువు బుర్రకథలో ఇమిడ్చి దేశమంతటా పందలాది ప్రజల్ని కంటతడి పెట్టేలా గానం చేశారు. కొనకళ్ళ వారి "సాగర హైలెస్సా" పాటని సైతం శ్రీ నాజర్‌గారు తన బుర్రకథలో ఉపయోగించు కొన్నారు. రేడియోలో వస్తుంటుంది. శ్రీ డాక్టరు రాజారావుగారు తన "అల్లూరి సీతా రామరాజు" నాటకంలో వినిపించారు.

ఇలా శ్రీ కొనకళ్ళ శృంగారరసం, కరుణరసం, వీరరసం, హాస్యరసం అన్ని రసాలను తమ గేయాలలో పలికించారు. అందుకే ఆయనని నేడు సంస్మరించు కొంటున్నా.

—డాక్టర్ జి. వి.

సంగీతము-సాహిత్యము

భారతీయ కళలను చతుష్షష్టి కళలుగా విభజించారు. వాటిని యేర్చి కూర్చి, విగ్గు తేల్చి అయిదు కళలుగా సమకూర్చి వాటిని లలిత కళలు. అన్నారు, కాని ఒక సరస విమర్శక కవి పండితుడు ఇంతకంటే సంక్షిప్తమైన విభాగాన్ని -

"సంగీతంచ సాహిత్యంచ సరస్వత్యాః స్తనద్వయం। ఏకామాపాతమధురం, ద్వితీయం చింతనామృతం॥"– అని సూచించాడు. లలిత కళలలోని మిగిలిన మూడు కళలు కూడా ఈ రెండిటిలో అంతర్భాగములై యుంటాయి. సాహిత్యం సంగీతంతో కూడుకొని మరింత స్వారస్యంగా యుంటుంది. కవిత్వానికి సంగీత సాహిత్యాలు రెండు. రెండు నేత్రాల వంటివి శిల్పానికి. చిత్ర లేఖనానికి సాహిత్యం ప్రాణం సాహిత్య మర్మజ్ఞానంలేని వాడు శిల్పి. చిత్ర కారుడు కానేరడు.

"సమ్యక్ గీతం సంగీతం" అన్నారు గీత మనగా పాడబడునది. ముందుగా గీతమే ఆవిర్భవించింది. క్రమంగా ఆ గీతం విస్తరించడానికి భావ ప్రకటనకు సాహిత్యం అవసరమైంది. కవిత్వం ఈ సాహిత్యంలో అంతర్భాగం. కను కొందరు లాక్షణికులు దీని స్థానంలో నాట్యాన్ని ప్రవేశపెట్టారు చక్షు ప్రీతి ప్రధాన ప్రయోజనమైన ఈ నాట్యం సంగీత సాహిత్యాల సమావేశంవలన ఆవిర్భవించింది. ఈ నాట్యాన్ని అనుసరించి శిల్పము. చిత్ర లేఖనములు ప్రభవించినాయి. కనుక లలిత కళా పంచకానికి సంగీత సాహిత్యము మాతాపితల వంటివి. వీటిలో సంగీతము పండిత పామర జనాదరణీయమై. సర్వజనాకర్షకమై యొప్పారుచున్నది. సాహిత్యము ఆలోచనా మధురమై పండిత జనహృదయరంజకమై వెలయుచున్నది. ఇవి రెండును వీణాపాణియై చదువుల తల్లియై, జ్ఞాన స్వరూపిణియైన సరస్వతీదేవికి స్తనములట మాతృ స్తన్యమును గ్రోలకుండ స్తనపాయిలగ జీవులు మనలేవు కదా।

నాట్య శాస్త్రము: ఇది సర్వేంద్రియానందప్రదమైనది. అతిప్రాచీనమైనది. సంగీత, సాహిత్య శిల్పములను లలిత కళల సంపూర్ణ సమన్వయము కలది. దీనిని:

"జగ్రాహ పాఠ్యం ఋగ్వేదాత్. సామభ్యోగీతమేవచ।
యజుర్వేదాదభినయాన్. రసానాథర్వణాదపి॥"

ఋగ్వేదము నుండి వాచకాన్ని. సామవేదమునుండి సంగీతాన్ని, యజుర్వేదము నుండి అభినయాన్ని, అధర్వవేదం నుండి రసాలను గ్రహించి బ్రహ్మ నాట్యాన్ని సృజించాడు. ఇది నాట్య శాస్త్రము. ప్రకృతి స్త్రీ రూపం కాగా, పురుషుడు జ్ఞాన స్వరూపం. ఈ ప్రకృతి పురుషుల సమైక్యత దంపతి. సృష్టి చేయడం దంపతికి ప్రధాన ధర్మం. ఈ జంగమ స్థావరాత్మకమైన విశ్వమంతా దంపతి యొక్క సృష్టి రచనా విలాసం.

పురుషుని ఆనందింప చేయడంకోసం ప్రకృతి పరిణామం చెందుతుంది. భారతీయ తాత్త్వికులు పరమ శివుని విశ్వ పురుషునిగా భావించారు. ఆ శివుడు విశ్వనర్తనం చేశాడు. నర్తించే శివుడు "నటరాజు" అయినాడు. విశ్వ పురుషుని–నటరాజు నటనలో సృష్టి, స్థితి. లయం, తిరోభావం, అనుగ్రహం, అను పంచ క్రియలు ఉన్నట్లు అభివర్ణించారు. ఈ పంచక్రియలకు పంచ అధి దేవతలు వెల

శారు. వారు బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివుడు అనువారు. విశ్వవర్తన రూపుడయిన శివుని:

"ఏ కాస్యంతు చతుర్భుజం, త్రినయన దుష్టాంగం।
చంద్రం పత్ర శిఖిప్రసారితకరం, ర్ధ్వంపతం కుంచితం।
సర్వస్వస్తిక మండలం, డమరుకం. గంగాంజుచే చిత్రతం।
వందేకీర్ణజటం నటేశ మనిశం భస్మాంగ రాగం సదా॥" అని అభివర్ణించారు. ఈయన చేతిలోవి డమరుకం సృష్టికి చిహ్నం. అభయముద్ర స్థితికి లక్షణం వేరొక చేతిలోవి జ్వాల లయానికి ప్రతీక. పైకి ఎత్తిన కాలు మోక్షానికి గుర్తు వంచిన చేయి అనుగ్రహానికి సూచన అని వివరించారు

"నృత్యావసానే నటరాజ రాజోన నాద ఢక్కాం నవపంచవారం।
ఉద్ధర్తు కామా స్సనకాది సిద్ధా। ఏతద్విమర్శేశివ సూత్రజాలం॥"

నటరాజు నృత్యావసాన సమయంలో డమరుక వినాదం చేశాడు. దానిని విన్నవారు తమతమ సంస్కారాను గుణ్యంగా భావించుకొన్నారు. పాణినికి అక్షర రూపంగా గోచరింపగా నాట్యాచార్యులకు నాట్య జతులుగా భాసించాయి పతంజలి వాటిని వ్యాఖ్యానింపగా,విఘ్నేశ్వరుడు రచించాడు. నారదుడు మైమరచి గాన మాల పించాడు. విశ్వవర్తకుని అనుగ్రహంవలన నాట్య శాస్త్రమూపొర్భవించింది ఇది తొలుతటిది. తరువాత వచ్చిన లాక్షణికులకు మార్గదర్శిగాను, లక్షణ గ్రంథముగాను ఈ నాట్యశాస్త్రము రాణించినది

నటన సూత్రకర్తలగు "శిలాలి-కృశాశ్వులు" అను వారు నటన సూత్రాలు రూపొందించారు. వాటిని అనుసరించి వృద్ధ భరతుడు. (ఆది భరతుడు) అను ఒక భరతుడు క్రీ.పూ 400లలో" ద్వాదశ సహస్రి"గా ఒక నాట్య శాస్త్రాన్ని రచించాడు. ఆటు తరువాత క్రీ. పూ. 300లలో ఇదే నాట్యశాస్త్రాన్ని సంగ్రహించి వేరొక భరతుడు షట్సహస్రిగా రెండవ కూర్పు సృష్టించాడు ఈ రెండవ కూర్పు, అనేకములయినచేర్పులు మార్పులు పొందిమనకిప్పుడు లభ్యమౌతోంది.ఈభరతశబ్దం శిక్షకుడు వాచకం కావచ్చు "భరతః" అనునది ఆకాలంలో నాట్య శిక్షకులకు (Master నటుడు) పర్యాయ పదంగా ఉండేది. భరతః-నటుడు. అమర కోశము అయితే ఆయిద్దరు భరతులు ఎవరో? వారి నామము లేవో? వారిని గురించిన వివరములు తెలియుటలేదు. ఈ మాష్టరు నటుడైన భరతమునికి ఒక నాట్య రంగము ఆతనికి తోడుగ 104 గురు భరత పుత్రులను యవ్వన నటులు, 24 గురు అప్సరసల వంటి స్త్రీలు నుండెడివారు.

సంగీత రత్నాకర శార్ఙ్గ దేవుడు

"విశ్శంకుడు" అని బిరుదు వహించిన శార్ఙ్గ దేవుడు కాశ్మీరమునుండి

వచ్చిన భాస్కర పండితుని పుత్రుడు. సోఢల దేవుని పౌత్రుడు. యాదవ వంశస్థుడు. కాలము క్రీ. శ. 1230 ప్రాంతము. దౌలబాద్ అనెడి దేవగిరిని క్రీ. శ. 1210 మొదలు 1247 వరకు పాలించిన సిహ్మణ మహారాజు ఆస్థాన పండితుడు.

భరత నాట్య శాస్త్రము మొదలు తనకు లభించిన అన్ని ప్రాచీన లక్షణ గ్రంధములను నిశితముగ పరిశీలనము జరిపి, వాటి సారమును గ్రహించి వ్రాయబడిన గ్రంథము సంగీత రత్నాకరము. దీని కర్త శార్ఙ్గ దేవుడు. ఈ గ్రంధము యావద్భారతమున ప్రశంసింపబడినది ఇది సంగీత లక్షణములకు మూలాధార గ్రంధమని నేటి వరకు గల లాక్షణికులు భావించుచున్నారు.

సంగీత రత్నాకరములో గల విషయములు మనకీ నాడు లభింపకపోయినను అందలి విషయములను వేదవాక్కుగాను, లక్షణ వివరములను సంగీత శాసనములు గనూ, సంగీతజ్ఞులు నమ్ముచున్నారు. ఈ గ్రంధమునకు ఏడు వ్యాఖ్యానములు వెలసినవి. వానిలో కళానిధి అను సంస్కృత వ్యాఖ్య ప్రశస్తమైనది దీని కర్త చతుర కల్లినాధుడు; తోదర కులస్థుడు లక్ష్మణాచార్యుని పుత్రుడు. విజయనగర సామ్రాజ్యమునేలిన ఇమ్మడి దేవరాయల ఆస్థాన పండితుడు.

ఈ సంగీత రత్నాకరం కేవలం సంగీతానికి సంబంధించిన గ్రంథం మాత్రమే కాదు అదిఒక విధంగా నాట్యశాస్త్రం కూడ. ఒకనాడు మహోన్న దశ నందిన చతుష్షష్టి కళలు కాలాంతరంలో నామ రూపాలు లేకుండా నశించాయి. ప్రాచీన గ్రంధములు ఎక్కడనో చెరబడి రహస్యముగ ఉంచబడినాయి. ప్రాచీన సంప్రదాయ సంగీత లక్ష్య మార్గం పూర్తిగా కనుమరుగైంది. కాని అక్కడక్కడ కొన్ని దేశీ మార్గ పద్ధతులు మాత్రం ప్రజల వాడుక నుండి తొలగిపోలేదు. వీటిని ఆధారంగా తీసుకొని రచింపబడిన గ్రంధములలో ముఖ్యముగ చెప్పదగినవి: శార్ఙ్గ దేవుని సంగీత రత్నాకరము 2 సోమనాధుని రాగవిబోధము 3. అహోబలుని సంగీత పారిజాతము మున్నగునవి.

సంగీత రత్నాకరమున, 1. స్వరగతాధ్యాయం 2. రాగవివేకాధ్యాయం. 3. ప్రకీర్ణాధ్యాయం 4. ప్రబంధాధ్యాయం 5. తాళాధ్యాయం 6 వాద్యాధ్యాయం 7. నర్తనాధ్యాయం అని ఏడు అధ్యాయాలున్నాయి. చివరిది యగు నర్తనాధ్యాయంలో నాట్యశాస్త్రానికి సంబంధించిన అనేక విషయాలు వివరింపబడినాయి. కూచిపూడి సంప్రదాయ. పిండోత్పత్తి. ప్రకరణం దీని నుండి గ్రహించి యుండవచ్చు. దీనికి యజ్ఞ పట్టును జతచేసి "ఆత్మ యజ్ఞం" అను పేరుతో శ్రీ భాగవతుల రామయ్యగారు రచించారు. ఈనాడు కూచిపూడి సంప్రదాయ ప్రయోగంలో ఇది కనుమరుగై పోయింది.

చతుర్దండి ప్రకాశిక వేంకటమఖి :

భరతముని రచించిన నాట్యశాస్త్రమునకు సాటియగు గ్రంథము చతుర్దండి ప్రకాశిక. దీని రచయిత వేంకటమఖి ఇతడు విప్రోత్తముడు "ఆధునిక కర్ణాటక సంగీత" పద్ధతిని ప్రతిష్ఠాపించి ప్రచార మొనరించిన మహనీయుడు. గోవింద దీక్షితుని కుమారుడు. తంజపురమును పాలించిన నలుగురు నాయక రాజులలో కడపటి వాడగు విజయరాఘవ నాయకుని సంస్థానము నలంకరించిన వారిలో ముఖ్యుడు. అనగా క్రీ.శ. 1633 73 కాలమువాడు. ఇతడు సంగీత లక్షణ లక్షణజ్ఞుడు.

నాట్యశాస్త్రములోని ప్రాచీనత, చతుర్దండి ప్రకాశికలోని ఆధునికత, ఈరెండు గ్రంథములను పరిశీలించిన పండితులకు సులభముగ విశద పడును.

వేంకటమఖి తరువాత అనగా క్రీ.శ. 1673 ప్రాంతము తంజపురి విపరీతములైన కలవరములలో మునిగి తేలుచున్నది. విజయరాఘవ నాయకుడు యుద్ధములో శత్రునిహతుడయ్యెను. 1676లో మహారాష్ట్రి పరిపాలన మారంభమైనది. రాజ్యమున ప్రశాంత పరిస్థితికి భంగము వాటిల్లినది. ఈ సమయమున వేంకటమఖి తన పద్ధతిని రచించిన చతుర్దండి ప్రకాశిక గ్రంథపు వ్రాత ప్రతిని, దానితోపాటు రచించిన అనుబంధములను అతని వంశములోని వారు వాటిని కాపాడదలచి రహస్యముగ నుంచవలసిన స్థితి యేర్పడినది. అందుచే నాగ్రంథ మెవరికిని లభింపలేదు అందుచే నందలి విషయములనూహించియు-విను కలిగలిగినవి. వాడుకలోనున్నవి యునగు విషయము లాధారముగ రచింపబడినది. సంగ్రహ చూడామణి.

సంగ్రహ చూడామణి—గోవిందా చార్యులు :

గోవిందా చార్యులు, సంగ్రహ చూడామణిని రచించెను. ఈ కాలములోని పండితులు వీరి మతమును గౌరవించి వీరినాదరించిరి. ఆంధ్ర వైష్ణవ సంప్రదాయమునకు జెందిన వాడు తంజపురిని పరిపాలించిన కడపటి మహారాష్ట్రి రాజగు శరభోజునికి ప్రీతి పాత్రుడై సంస్థానపు విద్వాంసులలో ముఖ్యుడుగ నుండెను ఈయన కాలము క్రీ.శ.1800లు పందొమ్మిదవ శతాబ్ది మొదటిదశాబ్దమునవీగ్రంథము వెలుగు జూచినది.

ప్రాచీన సంప్రదాయమునకు విరుద్ధములైన యనేక విషయములిందు పొందుపరుపబడినవి. చంద్రగిరి రంగాచార్యులుగారు. గోవిందాచార్యుల వారి మతమునసుసరించుచు, పింకను విచిత్రములయిన విషయములను ప్రకటించెను. కొన్ని జన్యరాగములకు క్రొత్త నామములు కల్పించెను. 2500 రాగముల పట్టికల వాటి ఆరోహణ అవరోహణములను వివరించెను. ఇట్టి చిత్ర విచిత్ర రాగములను లక్షల

కొలది కల్పించవచ్చునని ప్రకటించెను. కాని అవి గీత ప్రబంధములకు యోగ్యములు కావని వేంకట మఖి యభిమతము.

ప్రాచీన సంప్రదాయ విరుద్ధములు గల ఈ సంగ్రహ చూడామణిలోని విషయములను త్యాగరాజుగారు ఉపయోగించరని భావించిరి. ఈ గ్రంథమే సంగీత లక్షణమునకు ఆధారముగా ఆధునికులు అనుసరించుచున్నారు. ఇది మన సంగీత కళకు పట్టిన దౌర్భాగ్యము.

పూర్వ. గుప్త సామ్రాజ్య స్వర్ణ యుగములకు అనేక శతాబ్దముల తరువాత మరి యొక సువర్ణ యుగముగ ప్రఖ్యాపహించిన విజయనగర-విద్యానగర సామ్రాజ్య రాజుల కాలమున నొక నూతన సంగీత మార్గమునకు బీజమునాటి వారి కాలమున సంగీతమునకు బదులు సంకీర్తన. కేళిక. హరికథలుగ వ్యాప్తికి తేబడిన వాగ్గేయకారులు ఈనాటి కూచిపూడి నాట్యాచార్యుల దృష్టిలో 11వ శతాబ్ది వారుగ భావింపబడుట శోచనీయము అట్టి వారిలో కొందరు

1. పాండురంగ విఠల భక్తుడైన పురందరదాసు: ఇతని కాలము క్రీ. శ. 1494–1564 స్వనామము శ్రీనివాస. ఇతడు కన్నడములో వేలకొలది పదములు రచించెను.

2 తాళ్ళపాక చిన్నయ్య: ఈయన తిరుపతి వేంకటేశ్వరుని భక్తుడు. ఈవంశములోని వాడగు అన్నమయ్య వేలకొలది సంకీర్తనలను రచించెను. ఉత్సవ పద్ధతి భజన పద్ధతులను తెల్పిరి

3. వరదయ్య. క్రీ. శ. 1600–1660 కాలము క్షేత్రయ్య అని పిలువబడినాడు శృంగార రస శిష్యందములగు పదములను అనంతములుగ రచించెను

4. రామదాసు: ఈయన స్వనామము కంచర్ల గోపన్న. భద్రాచల రామచంద్రుని మీద అనేక కీర్తనలు రచించెను

5 సిద్ధేంద్రయోగి: జనులారవినుకి హరికథ · అని యక్ష గానమునకు అదిరూపమగు హరికథా: సాంప్రదాయమును స్థాపించి, కూచిపూడి వారిచే స్త్రీ పాత్రను గూడ పురుషులచేన టింపజేసి ప్రయోగింపజేసెను. కాలము క్రీ. శ. 1633–77.

—చింతలపాటి లక్ష్మీనరసింహశాస్త్రి

....o....

SARATHCHANDRA, THE MATCHLES NOVELIST

Sri Gorrepati Venkata Subbaiah

"As for Bengali, we have had Bunkim, have still Tagore and Sarathchandra. That is achievement enough for a single country."

– Aurobindo.

In the opinion of many, Bunkim Chandra Chatterjee is the first novelist in the Bengali literature. He is the pioneer of pioneers. He was called Bengali Scott. He heralded an era in literature. He created and ushered in the golden age. Sarath is the shining star of that age. He gave lustre to the golden age. Bunkim is a talented novelist, but he is not a great novelist.

Ravindra is an universal poet and a multi - faceted genius. There is nothing he left untouched. But essentially he is a poet. His novel "Chokher Baali" gave birth to a new dawn in literature. In his novel, Ravindra gave a sympathetic portrayal of the desire of Vinodini, a widow, for sexual love. He is the solitary Bengali novelist who dealt with socially tabooed love in the most natural way.

Sarath made a profound study of this novel of Gurudev and strove hard and long to come upto that level and succeeded in full. After Ravindra, he is the only novelist who has dealt with tabooed love with dexterity and captured the hearts of all readers.

With Sarath, Bengali characters and prototypes, their behaviour come to life with the sweetness of Bengali language in his writings. This is why he captured the admiration and affection of Bengalees. Portrayal of social life, living lively language and dexterity of conversation reached a high water mark in Sarath Babu.

In the Bunkim era, Taraknadh Gangopadhyaya preceded Ravindra with his novel "Swarnalatha". Therein he portrayed the joys and sorrows of Bengalees with consummate skill. Hence it attained eminence in the Bengali novel literature. Attracted by its publicity and popularity, many writers tried to imitate, but all of them failed.

In the intervening period between Bunkin and Ravindra, "Swarnalatha" enjoyed its golden age.

Tharaknath wrote many other novels but they did not attain the popularity of "Swarnalatha."

It was given to Sarath Babu, the deathless artist, to create writings of the type of "Swarnalatha" and revive the golden age. He wrote about 20 novels. The public never bothered to discover which of them were great and which were not. They felt that every one of them was great, a jewel.

Novel are of two kinds those giving importance to story content and those where pride of place is given to characterisation. Novels by Sārath belong to the latter category. In his novels the characters come to life and are vividly etched in our mind and memory. His characters engulf and carry the reader with their individual mental make up and ideas and emotions. They take the reader into the recesses and remotest places in the mental habyrinths of the characters. This is the greatest triumph of Sarath. He is the peerless artist in the production of novels specialising in portrayal of characters delting into and delineating their mental make-up.

This is the reason why characters in his novels appeal to us as our near and dear and as our kith and kin. According to Bhavabhuthi, "Karuna Meva Yeko Rasaha" (Compassion is the only Rasa). Sarath is truly our modern Bhavabhuthi. His compassion is not tragic nor does it end in tragedy. His characters melt our heart into mercy and ennoble us and thus win our sympathy. In short, Sarath Chandra is truly the Chandra of Sarath. He is the uncrowned monarch in the literature of novel - writing in India,

SARATH'S INFLUENCE

Sarath has made a profound impact on Telugu literature in the field of creative writing.

TRANSLATORS AND PUBLISHERS

Sarath novels were translated from Bengali into Telugu for the first time in 1926 by Jonnalagadda Satyanarayana. He translated "Veeraj Bahu" as "Susheela", "Devados" as "Syamali", "Bada Deedi" as "Madhavi", "Chandranath" as "Lalitha" and some other works in "Grandhika" (classical) style. These were published by Addepalli Lakshmanaswami, the proprietor of Saraswath Grandha Mandali of Rajahmundry.

Iam detailing below the translations between 1930-39.

Veluri Sivarama Sastry, Chakrapani, Suryadevara Venkatasubbayya, Edara Lakshminarayana originally published their translations in journals. Venkata Subbayya and Lakshminarayana translated only one or two works of Sarath.

Sastry and Chakrapani enjoy a high reputation for translation of Sarath's works. It was these two who enabled the Telugu people to take Sarath to their hearts.

Sivarama Sastry published his translations. "Ramuni Budhimamtanam", "Teerani Korkelu" and some others in Praja Mitra. "Bindhgari Abbayi" was published in Bharathi and "Pather Daabi" was published in Maatru Bhumi in parts. "Vykunthuni Veelunama" was called Sarvesu and Veelunama and Arakshaneeya was translated as "Kattu Dappina Pilla" (which means a girlwho attained the age of wearing saree, having grown beyond the age of skirts). Baamuner Maiye was changed as "Baapana Pilla". They translated some more works, but they rema

ins unpublished. They not only gave Telugu titles to their translations. but also succeeded in creating the atmosphere of Telgunadu. Among all the translators, Sastry was a great scholar. His ambition was to proclaim and broadcast the greatness of Sarath through translation of his works.

Chakrapani is young in years. He cultivated thorough knowledge of Bengalee. Besides Sarath's writings, he translated many other works. He is eminent in spoken language. All his translations were published from Tenali by Yuva Book Depot, which was started by him.

Bud Deedi, Palleeyulu were first published in Prajaa. Bandhu, Devados in Nava Shakti, Parineeta in Veena, Penchina. Prema, Pativrata, Pariksha, in Andhra Patrika and Vaagdatha in Andhra Jyothi.

Devadoss was Published in bold print and with fine illustrations in Andhra Jyothi It was later published in book form. It was Sastry who encouraged Chakrapani in his endeavour telling him that the latter's translations were better than his own.

The influence of these two individuals is discernible all subsequent translators. The decade 1940-50 was the high water-mark for Sarath translations and translators. They are Digavalli Seshagiri Rao, Maddipatla Soori, Puranam Kumara Raghava Sastry, Neelakantam, Bhogaraju, Perraju Siva Ramakrishna.

Gadde Lingayya, Nannapaneni Subbarao, Lavanam, Krillivasa Theerdhulu, Lakshmanaswami and others follow. They come after 1950.

Seshagiri Rao translated Aada Brathuku and Vijaya and Jaagarana from Hindi. He himself published those translations.

Neelakantam Guruswami hails from Vijayawada. All his translations are from Hindi vertions. Charitra Heen was published in part in Chitra Gupta. It has not come out in complete book form. Sree Kaantha, Savitha, Subhada, Viraaja Bahu, Bhyravi, Nava Vidhaan, Arakshaneeya are the works translated by him.

Chakrapani and Siva Ramakrishna were friends. The latter went to Northern India and after passing Sahitya Rathna in Hindi began translation of Sarath's works from Hindi in about 1943. He translated Kaasi Nadh, Sarayu, Hemangini and other stories of Sarath and published them through Satyanarayana. proprietor of Variety Agencies in Vijayawada.

Thereafter, in 1944 Sivarama Krishna started Desee Kavitha Mandali in Vijayawada. In addition to translation of Sarath's works he also published many other works. He became famous in publication and as writer and also prospered in business.

Puranam Kumara Raghava Sastry translated Gruha Dahanam, Vipradaasu, Poojarini, Datta, Sarath letters, Jaagarana from Hindi. They were Published by Desi Kavitha Mandali.

Maddipatla Suri translated from Bengalee. His translation "Charitra Heen" was published by Desi Kavitha Mandali.

It was Sivaramakrishna who translated Sarath's works and published them in Telugu.

In 1953 he published Sarath's works in Telugu in 14 volumes as also separately. Later on, he translated the uncompleted novels, Children's Stories and other writings of Sarath's and published them in 15 volumes. In 1956 he published my two writings Sarath Jeevithamu and "Sarath samalochanamu"

in continued form as the 16th volume entitled Sarath Darsha-namu. Thus he attained prominence among all Telugu translators of Sarath's works. Desi Kavitha Mandali published many reprints of the 16 volume Sarath Works.

Even till to-day no other writer is in so much drama in Andhra as Sarath Literature. The reason for this is Sivarama Krishna by introducing it into every house in Andhra.

Therefore, Sarath literature and Desi Kavitha Mandali became Synonymous in Andhra.

Sivaramakrishna's enterprise was not mainly commercial. He was an ardent admirer of sarath He named his residence as "Sarath Buildings". There used to be a fine portrait of Sarath in his drawing room.

Gadde Lingayya established Adarasha Grandha Mandali in Vijayawada and published Sarath translations along with other works. He himself translated some works. Aadarsha Grandha Mandali published the translations by Nannapaneni Subba Rao, Lavanam and others.

There are as many as ten translators of devadoss. For fear of space, I have merely mentioned the names of some prominent translators without going into details.

WORKS WHICH HAVE NOT BEEN TRANSLATED

1) Tharani Bidroh
2) Sarath Chandra Ki Chaatra Samaaj
3) Sarath Bytak Kadha have not been translated into Telugu.

COMMENTARIES

Veluri Sivarama Sastry introduced Sarath to Telugu readers through essays in Krishna Patrika while Chakrapani did the same through Bharathi. But they have not been published in book form.

Humayun kabir wrote "Sarath Chandra Chettarjee in English. This was translated into Telugu by Pasupuleti Koteswara Rao in 1954. Tagore publishing house of Tenali published this book. This was the only commentary published in book form in Telugu by them.

As I realised the absence of many work on the life of Sarath in spite of numerous Telugu publications of his works in such abundence, I made detailed study of books in Hindi, Bengalee and English and wrote a concise but comprehensive book about Sarath's life. As I felt that there was no c ommentary in Telugu on Sarath's writings. I wrote "Sarath Darshanam" dealing with Sarath literature and combining it with the story of his life. This book was dedicated to translators and publishers of Sarath's works in Telugu. This book was acclaimed by the intelligentia and the press, Readers are aware that this book was published by Desi Kavitha Mandali in 1956 as the 16th volume of comprehensive Sarath works.

BIO DATA :

Sri Gorrepati Venkata Subbaiah was born on 1-7-1898 in Ghantasala village in Krishna District. He studied upto V form in Noble College High school of Machilipatnam. He studied School Final in Brahmo Boys High School in Calcutta, but discontinued. Even in his school days, he learned Bengalee from Sri Kowtha Sivarama Sastry, who was a scholar in Bengalee. Afterwards he also studied Hindi.

His published works number about thirty. Some of his biographical works were awarded prizes of the Telugu Saahitya Akadami and Telugu Bhasha Samithi.

He has special interest in writing biographies, literary criticism and historical research.

His occupation is agriculture. His taste is in writing books.

చలము పట్టి గాంధి సమరమునన్ దూకె
కలము పట్టి సరస గద్య గూర్చె
జంకులేని జోదు వెంకట సుబ్బయ్య
తొణుకులేని సాహితీ విభాత

— తుమ్మల సీతారామమూర్తి